సత్సంగం

(ఆధ్యాత్మిక వ్యాస సంపుటి)

డా॥ కొప్పరపు నారాయణమూర్తి, Ph.D.,

ముద్రణ : 2024 మే

ప్రతులు : 500

C సర్వ హక్కులు రచయితవే.

డా॥ కొప్పరపు నారాయణమూర్తి, ఆంధ్రప్రదేశ్, 7671909759

ఐ.ఎస్.బి.ఎన్. సంఖ్య : 978-93-343-2774-8

టైటిల్ డిజైను : రాపిక్సల్.కామ్ సౌజన్యంతో

వెల రూ. : 225/-

ప్రచురణ కర్త : డా॥ కొప్పరపు నారాయణమూర్తి Ph.D.

డి.టి.పి. :
శ్రీ దుర్గ గ్రాఫిక్స్, తెనాలి, సెల్ : 9110761291

విషయసూచిక

		పుట సంఖ్య
1.	తిరువాయార్ త్యాగయ్య తరించిన తీరు	4
2.	హయగ్రీవావతారం – శ్రీ బెల్లం కొండ రామరాయ కవీంద్రులు	15
3.	చందోలు మహర్షి తాడేపల్లి రాఘవ నారాయణశాస్త్రి	26
4.	చందోలు శాస్త్రి గారి అంతేవాసి – మేళ్ళచెరువు సుబ్రహ్మణ్యశాస్త్రి	49
5.	శాస్త్రీయ సూత్రాలతో పశ్చిమానికి బోధించిన స్వామి వివేకానంద	57
6.	అలంపురం జోగులాంబదేవి – బ్రహ్మేశ్వరాలయాలు	73
7.	రుషి తుల్యులు – బులుసు సూర్య ప్రకాశశాస్త్రి	79
8.	రామభక్తిలో తెలుగు రాష్ట్రాలది భారతదేశంలోనే అగ్రస్థానం, తెలుసా ?	88
9.	ఆత్మానుభవం సాధ్యమేనా?	97
10.	ఎవరినివారే ఉద్ధరించుకోవటమంటే!	100
11.	క్రమశిక్షణ విజయ సోపాన రహస్యం	104
12.	మానవ మేధస్సు – ప్రశాంతత – ఆధ్యాత్మికత	107
13.	అలవాట్లను మార్చుకోవటం ఎలా?	110
14.	ఆలోచనలను అదుపు చేయటమే జీవన సాఫల్యానికి సోపానం	115
15.	'కర్మ' శబ్దం పట్ల సరైన అవగాహనే నిజమైన సుఖమూ, శాంతి!	119
16.	విశ్వాసమే జీవనయానంకు ఆలంబన!	124
17.	మనిషి శాంతి, అశాంతిలకు నేత్రాలే కీలకం!	129
18.	మాటల పొందు	135

నా మాట

'స్వాధ్యాయాభ్యసనం చైవ వాఙ్మయం తపముచ్యతే', అని గీత కారుడు శ్రద్ధాత్రయ విభాగయోగంలో సెలవిచ్చారు. ఇది 'సత్సంగం'లో ఒక భాగం. జగద్గురువులు ఆదిశంకరులు 'సత్సంగత్వే నిస్సంగత్వం, నిస్సంగత్వే నిర్మోహత్వం' అని చెప్పి తద్వారా జీవన ముక్తి సాధించవచ్చని సులభమైన మార్గం ఉపదేశించారు. ఈ పుస్తకంలోని వ్యాసాలన్నీ నా 'స్వాధ్యాయాభ్యసనం' నుంచి వచ్చినవే. మనుషులకు దేహభావాలు మామూలే. కానీ, దేహాతీతమైన భావాలు, దేహభావాలు రెండూ ఉన్నట్లు కొందరికే తెలుస్తాయి. వారికి వీట మధ్య తేడా ఒక్కోసారి తెలుస్తుంటుంది. దేహభావాలు ఇంద్రియ సంబంధమైనవి. కానీ, దేహాతీత భావాల మాటేమిటి అనే ఆలోచననే మనిషిని ఆధ్యాత్మిక మార్గంవైపు మళ్ళిస్తుంది.

అలా స్వాభావికంగా మనుషులలో మార్పు వచ్చే సమయానికి ఏ సత్పురుషుడో మనలను ఆధ్యాత్మిక మార్గం వైపుకు ఎలా మళ్ళాలో నిర్దేశనం చేస్తాడు. అంత మాత్రానికే అతను గురువు కానక్కరలేదు. అతను కేవలం సముద్రంలో పడవలకు దిక్కులు చూపే దీప స్థంభం లాంటివాడూ కావచ్చు. మన ఆధ్యాత్మిక ప్రయాణం ముందుకు సాగేకొద్దీ, మన భక్తి వైరాగ్యాలను బట్టి, బుద్ధి, చిత్తం, మనస్సు విభాగాలు శుద్ధమైనప్పుడు గురువే మనలోని ఆత్మప్రకాశం చూసే వీలు కలిగిస్తాడు. మోక్ష మార్గం పట్టిస్తాడు.

ఆ గురువు మన 'ఆత్మ'నే. మరొకరు కారు. బాహ్యంగా దేహాలలో కనిపించే సద్గురువులు అంతా ఆ ఆత్మ గుణ రూపాలు. కానీ, వారు పరిశుద్ధాత్మలు. నిత్య చైతన్య రూపులు. దేహాతీతులు.

అలాంటి ఆధ్యాత్మిక పరిమళాల వనంలో ప్రయాణమే సత్సంగం. సాత్విక యజ్ఞం గ్రంథ రచన, వ్యాస రచన. మనలో ఒక్కొక్కరిపట్ల కలిగే భక్తి విశ్వాసాలకు రూపాలు వేరు. కానీ వాటిలోని ఆ పరమాత్మ ఒక్కడే. ఈ పుస్తకంలో నేను రాసిన ఆధ్యాత్మిక వ్యాసాలన్నీ సత్సంగ మార్గంలో సాత్విక భజన, వాక్ తపస్ లాంటివే. ఈ వ్యాసాలు చదివిన వారికి ఆ భావన తప్పక సిద్ధిస్తుంది.

ఇందులో చాలా వ్యాసాలు నా సాధన జన్యాలు. ఆత్మ సాక్షాత్కార మార్గంలో మనిషి గురువుని భక్తితో శరణు వేడి, సాధన ఆరంభిస్తే ఇంట్లోనే ఉంటూ, సామాన్యుడిలా జీవిస్తూనే, నిత్యం ఆ పరమేశ్వరుడి విభూతి అయిన ఈ జగత్తును, మాయను దర్శిస్తూ ఆనందంలో తేలిపోవచ్చును. ఈ అనందం శబ్ద, స్పర్శ, రూప, రస గంధాదుల్లా మనల్ని బంధించదు. ఇంతకు మించిన అఖండ సౌదర్యం వైపుకు మనల్ని ఎగదోస్తుంది. అప్పుడు ఈ ఆనందాన్ని, వ్యక్తపరచలేని స్థాయిలో ఇంద్రియాలతో నిమిత్తం లేకుండా పొందుతాం. అదే సాధన తాలూకు అంతిమ లక్ష్యం.

నిద్రలో కూడా మనం మరవ కూడని మాట – 'ఏకం సత్ – విప్రా బహుధా వదన్తి', 'బ్రహ్మమే న ద్వితీయం' విష్ణుః విష్ణుః విష్ణుః, శివోహం శివోహం, శివోహం. ఇవే జ్ఞానుల ముఖతః వచ్చే పరమ పవిత్ర వాక్యాలు.

ఇందులో వ్యాసాలను ప్రచురించిన స్వాతి బలరాం గారికి, భక్తి పత్రిక నేతి సూర్యనారాయణశర్మ గారికి, ఋషి పీఠం సామవేదం షణ్ముఖ శర్మ గారికి, దర్శనం పత్రిక శర్మ గారికి నా కృతజ్ఞతాంజలులు.

– డా కొప్పరపు నారాయణ మూర్తి Ph.D
7671909759

1

తిరువాయార్ త్యాగయ్య తరించిన తీరు

తంజావూర్ నుంచి కేవలం పద మూడు కిలోమీటర్ల దూరంలో ఉన్న తిరువాయార్, త్యాగరాజు తండ్రిగారైన రామబ్రహ్మంగారి కాలం నుంచి పంచనద క్షేత్రంగా ప్రసిద్ధికెక్కిన పుణ్యస్థలం. ఈ స్థలంలోని ఆరాధ్యదైవం త్యాగ రాజస్వామి. ఇది శివుని రూపం, నామం కూడా.

ఆయన దర్శనభాగ్యం కలిగిన కారణంగా రామబ్రహ్మం, సీతాంబలు వరప్రసాదమైన తమ మూడవ కుమారుడికి త్యాగరాజని పేరు పెట్టారు. త్యాగరాజు ముత్తాతగారైన పంచనద బ్రహ్మంగారి స్వస్థలం ఆంధ్ర రాష్ట్రంలోని ప్రకాశం జిల్లాకు చెందిన కంభం తాలూకా కాకర్ల గ్రామం.

పుణ్యక్షేత్రంలో జీవించాలన్న ఆధ్యాత్మిక సంకల్పం కలిగి ఆయన క్రీ.శ. 1600ల ప్రాంతంలో తంజావూరు సమీపంలోని తిరువారూరుకు తరలివెళ్ళారు. తర్వాత ఆయన మనవడైన రామబ్రహ్మం తిరువాయార్‌కు నివాసం మార్చటంతో త్యాగరాజ యోగిపుంగవుల జననానికి నాందీ ప్రస్తావనయింది. అంతేగాక, తిరువాయార్‌కు త్యాగరాజుకు మధ్య సంబంధం శాశ్వతమై పోయింది.

తిరువాయార్ :

తంజావూర్ నుంచి తిరువాయార్‌కు వెళ్ళేప్పుడు రహదారికి అటూ ఇటూ పచ్చని కొబ్బరి తోటలు కన్నులవిందును కూరుస్తాయి. తంజావూర్

నుంచి తిరువాయార్‌ను కలిపే పవిత్ర కావేరీ దారి పొడుగునా రమణీయ మనోహర ప్రకృతి దృశ్యాలు హృదయాన్ని ఉన్నత లోకాల్లో విహరింపచేస్తాయి. పరవశింప చేస్తాయి. తిరువాయార్‌లో త్యాగరాజ స్వామి నివసించిన ఇల్లు, ఆయన మహా సమాధి పొందిన వాల్మీకి మంటపం ఉన్నాయి.

వాల్మీకి మంటపంపై 'శ్రీరామ జయం' అని చక్కగా రాసి ఉంటుంది. స్వామి మహాసమాధైన స్థానే ఆయన విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. మంటప ముఖద్వారంపై సీతాసమేత రాములవారు ప్రశాంత వదనుడై ఆసీనుడవగా, ముందు వినమ్రుడై కూర్చున్న త్యాగరాజస్వామి విగ్రహం ప్రతిష్ఠితమై ఉంది.

స్వస్థల రీత్యా తెలుగువాడైన త్యాగరాజు తన కీర్తనలన్నీ ఆంధ్ర, సంస్కృతాలలోనే రచించారు. అలాంటి వాటిలో కొన్నింటిని ఇతర భాషలలోకి కూడ అనువదించి, పాలరాతిపై చెక్కించి మంటపం లోపలి గోడలపై కన్పించేలా వేయించారు. మంటపానికి కాస్త దూరంలో స్వామి ప్రియశిష్యుడైన వాలాజపేట వెంకటరమణ స్వామి భాగవతార్ విగ్రహాన్ని ప్రతిష్ఠించిన దేవాలయం ఉంది. ఈ మంటపంలో స్వామి అర్చించిన శ్రీ రామ పంచాయతన విగ్రహం, చిడతలు, తంబూరా ఉన్నాయి.

మంటపం ముందు పూరిపాకలో త్యాగరాజస్వామి వారి నాలుగవతరం మనవడు శ్రీనివాస భాగవతార్, ఆయన సతీమణి సుగుణమ్మలు ఉంటున్నారు. తాతగారి ఘనమైన వారసత్వం నిలుపుతూ శ్రీనివాస భాగవతార్ ఇప్పటికీ త్యాగరాజస్వామి పూజను నిర్వహిస్తూ, సంగీతసాధన చేస్తూ, సంగీతం బోధిస్తూ స్వల్పాదాయంతోనే జీవిస్తున్నారు.

భగవత్సాక్షాత్కారాన్ని నమ్ముకున్న యోగులకు ధనంతో,

తిరువయ్యార్ త్యాగరాజస్వామి నిలయం చిత్రాలు

తిరువయ్యార్
త్యాగరాజస్వామి విగ్రహం

త్యాగరాజస్వామి పూజించిన
రామ,లక్షణ, సీతా
పంచాయతన విగ్రహం



త్యాగరాజస్వామి శిష్యుడు
వాలీజపేటై వేంకటరమణ
భాగవతార్‌కు సంగీతం
నేర్పిస్తున్న దృశ్యం



త్యాగరాజస్వామి
వాయించిన తంబూర

సుఖదు:ఖాలతో పనేమిటి ? వారి ఏకైక కుమారుడు చిరంజీవి సుబ్రహ్మణ్యన్ ఎలియాస్ రాజన్ తంజావూర్ సంస్కృత పాఠశాలలో విద్యాభ్యాసం చేస్తున్నారు. అతను కూడ సంగీత విద్వాంసుడే. వీరంతా ఎన్నో దశాబ్దాలుగా తమిళనాడులో ఉంటున్నా ఇప్పటికీ ధారాళంగా తెలుగు మాట్లాడగలగటం విశేషం.

తిరువాయార్‌లోని స్వామి వాల్మీకి మంటపం వెనుకనే పదడుగుల దూరంలో కావేరి నది ఉధృతంగా ప్రవహిస్తుంటుంది. మంటపం ముందున్న విశాలమైన ఇసుక తిన్నెలలోనే పందిళ్ళు వేసి దేశం నలుమూలల నుంచి వందల సంఖ్యలో పేరు ప్రఖ్యాతులున్న సంగీత విద్వాంసులు వచ్చి త్యాగరాజస్వామి ఆరాధనను సంగీత సమ్మేళిత పూర్ణకుంభోత్సవంతో ప్రారంభిస్తారు. ఆ మనోహర దృశ్యాన్ని చూడవలసిందే తప్ప వర్ణించనలవిగాదు. త్యాగరాజస్వామి పటాన్ని ఊరేగిస్తూ, ఉత్సవ కీర్తనలు "రామ! కోదండరామ! రామ కళ్యాణరామ!" లాంటివి భక్తిరసంలో మునిగి గానం చేస్తు, వేలాది పండితులు స్వామి వారి సమారాధన కోసం భిక్ష స్వీకరిస్తారు.

నానాటికీ పాశ్చాత్య నాగరికత పట్ల ఆకర్షితమవుతున్న మనదేశ యువతకు యోగి పుంగవులైన త్యాగరాజ భక్తి రస సంగీత ఝరి నిజమైన ఆనందాన్నిస్తుందనటంలో సందేహం లేదు. అటువంటి త్యాగరాజ మహనీయుని యోగతత్వం గురించి తలుచుకోవటం మనకు, సాక్షాత్తు శ్రీరామచంద్రునికి నిజమైన ఆత్మార్పణ చేసుకొనేందుకు మార్గం సుగమం చేస్తుందనటంలో సందేహం లేదు.

త్యాగరాజ యోగతత్వం

అదేమి వింతోగాని భారతదేశ చరిత్రలో 18వ శతాబ్దం

సువర్ణాక్షరాలతో లిఖించదగ్గది. ఈ శతాబ్దంలో ఉద్భవించినంత మంది యోగులు మరే శతాబ్దంలోనూ ఉద్భవించలేదు. కాని వివేకానందులు చెప్పినట్లు సద్గురువులు ఎల్ల కాలాల్లోనూ ఉన్నారు. అయితే 18వ శతాబ్దంలో మటుకు మన ఆధ్యాత్మిక సనాతన ధర్మాన్ని కళ్ళకు కట్టినట్లుగా పునరుజ్జీవింపచేసిన యోగి పుంగవులలో త్యాగయ్య (1767–1847), శ్రీ రామకృష్ణ పరమహంస (1836–1886), వివేకానంద (1863–1902), రవీంద్రనాథ ఠాగూర్, పావారీ బాబా, అరవింద ఘోష్, శిర్డి సాయిబాబా, ఉపాశనీబాబాల వంటి వారు ముఖ్యులు.

వీరిలో త్యాగయ్య, రామకృష్ణ పరమహంస భక్తి యోగులైతే, షిర్డీ సాయిబాబా, వివేకానంద, అరవింద ఘోష్‌లు రాజయోగులు. అయితేనేం ఆత్మసాక్షాత్కారం పొందాక ఆ యోగులకు అన్ని యోగాల (ముఖ్యంగా కర్మ, భక్తి, రాజ, జ్ఞాన యోగాలు) అనుభవం కలుగుతుంది. పరబ్రహ్మంతో విలీనమై కూడ సగుణబ్రహ్మరూపంలో ఇచ్ఛాశక్తి గలవారై ఉంటారీ మహాయోగులు.

తత్వపరంగా వారు అవలంబించిన యోగాలు వేరైనా, అందరూ కొలిచేది కేవలం ఆ పరబ్రహ్మాన్నే అని కృష్ణుడు కూడ గీతలో చెప్పాడు. అంటే సాంఖ్య, ధ్యాన, భక్తి, క్షేత్ర – క్షేత్రజ్ఞ విభాగ, గుణ త్రయ విభాగయోగాలలో ఏ ఒక్కటైనా తననే బ్రహ్మంగా తెలుసుకొనే అవకాశాన్ని కలిగిస్తుందనే కృష్ణుడు గుణత్రయ విభాగం చివరి శ్లోకం "బ్రహ్మణోహి ప్రతిష్ఠాహ మమృత స్యావ్యయస్సచ"లో చెప్పాడు.

అంతేకాదు. ఈ యోగాలలో ఏ యోగం గురించైనా సాధికారంగా చెప్పగల ప్రజ్ఞ ఒక్క యోగికే ఉంటుంది. (వివేకా నందుడి ప్రవచనం) ఎందుకంటే యోగం చెప్పటానికి తర్కం ప్రమాణం కాదు. అనుభవం

ప్రమాణం. అలానే భక్తి యోగాన్ని రామకృష్ణ పరమహంస, వివేకానందులు స్వయంగా అనుభవించారు. వివేకానందులు స్వయంగా కీర్తనలు రచించి మధురాతి మధురంగా గానం చేసేవారు. కాబట్టి రాజయోగైనా వివేకానందుని భక్తియోగ వ్యాఖ్యానం ప్రామాణికమై ఒప్పారింది.

నారద భక్తి సూత్రాలకు, గీతలో కృష్ణుడు చెప్పిన భక్తి యోగానికి ప్రత్యక్ష నిరూపణ స్వయంగా త్యాగయ్యే. భక్తిరసం తొణికించిన త్యాగయ్య ధ్యానయోగం ద్వారా శ్రీరామ సాక్షాత్కారం పొందటం వల్లనే భక్తి యోగ పరాకాష్టను సులువుగా అందుకోగలిగింది. కృష్ణుడు గీతలో భక్తి యోగ ప్రారంభంలోనే ఉపాసన, ధ్యాన యోగాల ప్రశంస చేయటమే ఇందుకు తార్కాణం.

భక్తి, ధ్యానయోగ నిరూపణ

కేవలం భక్తితో భగవత్సాక్షాత్కారం పొందటం చాలా కష్టం. కాలవ్యయంతో కూడుకొన్నటువంటి విషయం కూడా. అటువంటి భక్తి, ప్రేమమయమై ఒప్పార వలసి వుంది. ప్రియుడు, ప్రియురాలి సంబంధంగా విలసిల్లవలసి కూడా ఉంటుంది. ప్రియుడు, ప్రియురాలు పరస్పర నామస్మరణాన్ని ఎంత అమృత తుల్యంగా భావిస్తారో, అంత అనురక్తంగా భగవన్నామస్మరణ ప్రేమతో చేయవలసి ఉంటుంది. దీన్నే కృష్ణుడు :

> "మయ్యావేశ్య మనోయేమాం, – నిత్య యుక్తా ఉపాసితే !
> శ్రద్ధయా పరమోపేతాస్తేమే యుక్త తమా మతా:
> అని –
> "యేత్వక్షర మనిర్దే శ్య మవ్యక్తం పర్యుపాసతే"
> సర్వత్రగమచింత్యం చ కూటస్థ మచలం ధ్రువమ్"
> – అని భక్తియోగం మొదటనే చెప్పాడు.

అందువల్ల భక్తి యోగం ఉపాసన ప్రధానమై నటువంటిదని స్పష్టంగా తెలుస్తుంది. ఆ ఉపాసనెటువంటిదంటే 'ధ్యాన యోగమనే' కృష్ణుడు స్పష్టం చేశాడు.

త్యాగయ్యకు మూడు ఉపదేశాలు

త్యాగయ్య జీవితంలో మనకి మూడు స్పష్టమైన మలుపులు కనిపిస్తాయి. ఈ మూడు మలుపులు ఆయన జీవితంలో ఆయనకు మూడుసార్లు గురూపదేశం జరిగే అవకాశాన్ని కలిగించాయి. తత్ఫలితంగా ఆయన జీవితం నాద బ్రహ్మ యోగంగా మారింది.

త్యాగయ్య ప్రధానంగా భక్తిరస సంపన్నుడు. చిన్నప్పుడే భక్తి సంబంధమైన ప్రేమతత్వం ఆయన మనస్సులో సుప్రతిష్ఠమైంది. తండ్రి యజ్ఞోపవీతం వేసేప్పుడు చేసిన బ్రహ్మోపదేశం ఆయన భావి జీవితానికి మొదటి ఉపదేశం.

అయితే జన్మత: త్యాగయ్యకు రామ నామ ప్రీతి ఎక్కువ. ఈ జపం చేస్తున్న త్యాగయ్యకు రామషడక్షరీ మంత్రాన్ని ఉపదేశించారు రామకృష్ణానంద స్వాముల వారు.

ఎవరిని ఆత్మ సాక్షాత్కారం వరిస్తుందో వారి దగ్గరికే స్వయంగా గురువు వెళ్ళి ఉపదేశం చేసి వస్తారు. ఇలా అందరి యోగుల విషయంలో అయింది. రామకృష్ణ పరమహంసకు వీరభైరవ బ్రాహ్మణి యోగి, వివేకానందుకు రామకృష్ణ పరమహంస, శ్రీమాత (మీర్ అల్ఫస్సా)కు అరవింద – ఇలా ఒకరికి మరొకరు సాక్షీభూతం అవుతుంటారు.

రామకృష్ణానందులవారు చెప్పినట్లు త్యాగయ్య తిరువాయూర్‌లోని పంచనదీశ్వరాలయంలో రోజుకు లక్షా ఇరవై వేల సార్లు రామనామాన్ని జపిస్తూ 96 కోట్లు పూర్తి చేశారు.

తదనుగుణంగా గీతలో కృష్ణుడు చెప్పినట్టు (ధ్యానయోగం)

"సమం కాయ శిరోగ్రీవం ధారయన్న చలం స్థిర:

సంప్రేక్ష్య నాసికాగ్రం స్వం దిశశ్చా నవలోకయన్" అని,

ప్రశాంతాత్మా విగతభీర్బ్రహ్మచారి వ్రతే స్థిర:

మనస్సంయమ్య మచ్చిత్తో యుక్త ఆసీత మత్పరం" అని

ధ్యానయోగానికి ఈ శ్లోకాల్లో నిర్దేశించిన ధర్మాన్ని తు.చ. తప్పకుండా త్యాగయ్య నిర్వర్తించటంవల్లనే ఆయనకు విశ్వామిత్ర సమేత శ్రీరామ సాక్షాత్కారమైంది. ఇక్కడ గీతలో జ్ఞానయోగంలో ఆత్మసాక్షాత్కారం కోసం రకరకాల యోగులు చేసే యజ్ఞప్రక్రియలతో త్యాగయ్య ధ్యానయోగ ప్రక్రియను అన్వయించుకోవాలి.

"సర్వాణీంద్రియ కర్మాణి ప్రాణ కర్మాణి చాపరే

ఆత్మ సంయమ యోగాగ్నౌ జుహ్వతి జ్ఞాన దీపితే"

అనే శ్లోకం త్యాగయ్యకు చక్కగా వర్తిస్తుంది. రాజయోగానికి కావలసిన ప్రాణాయామాన్ని సూచించే యజ్ఞ ప్రక్రియను కూడ కృష్ణుడు జ్ఞాన యోగంలోనే సూచించాడు.

శ్రీరామ సాక్షాత్కారం కాగానే త్యాగయ్య నోటినుంచి అప్రయత్నంగా ఓ దివ్యామృతగానం దానంతటదే వెలువడింది. "బాల కనకమయచేల" ఆ కీర్తనే సాహిత్యంలోను, సంగీతంలోను అద్వితీయమై వెలసిల్లింది ఆ మరుక్షణంలోనే. ఈ కీర్తన అమరం, సుమధురం, ఈ కీర్తన మురళిగానమై ఆయననూ, బాహ్య ప్రపంచాన్ని తన్మయులని చేసింది. అంతే త్యాగయ్యకు సంగీతంలో ప్రవేశం కలిగింది.

అంటే, అంతకు ముందు త్యాగయ్యకు సంగీత పరిజ్ఞానం లేదంటే అజ్ఞానమే అవుతుంది. తల్లి నుంచి నేర్చుకొన్న పురందరదాసువారి కీర్తనలు అనేకం ఆయనకిదివరకే కరతలామలకం. అయితే 'బ్రహ్మజ్ఞాని త్యాగయ్య'గా

మారాక ఆయనలోని సంగీత రసజ్ఞత కొత్త ముఖాన్ని సంతరించు కొన్నదనటంలో ఆశ్చర్యపడవలసింది లేదు కదా !

వెంటనే త్యాగయ్య తండ్రి కుమారుని శొంఠి వెంకటరమణయ్య గారి దగ్గర శిష్యుడిగా చేర్చాడు. బ్రహ్మజ్ఞానియైన త్యాగరాజుకు గురువు గారి సంగీత పరిజ్ఞానం అంతా త్రుటికాలంలోనే వచ్చేసింది. అంతటితో త్యాగరాజుకు సంతృప్తి కలగలేదు. తన మాతామహులైన వీణకాళ హస్తయ్య గారింట్లో సంగీత గ్రంథాలన్నీ తిరగేశారు. ఇంకా సంతృప్తి రాలేదు. ఎలా వస్తుంది ? పర్యవసానంగా నారదోపాసన చేశారు. ఈసారి స్వయంగా నారదులవారే గురువై వచ్చి, త్యాగరాజుని పంచనదీశ్వరాలయానికి తీసుకువెళ్ళి – "స్వరార్ణవం" అనే సంగీత ఓషధీగ్రంథాన్నిచ్చి అంతర్ధానమయ్యారు.

అంతటితో త్యాగయ్య నాదబ్రహ్మ సిద్ధి పొందారు. నారద కటాక్షంతో తిరిగి అపర ప్రహ్లాదుని భక్తితత్వంగా ప్రకాశించారు. భక్తి పారవశ్యంతో కీర్తనలు ఆయన్నుంచి ధారాళంగా వచ్చేసేవి.

"సంగీత జ్ఞానము, భక్తి వినా
సన్మార్గము గలదే మనసా,
భృంగి నటేశ సమీరజ ఘటజ
మతంగ నారదాదులు సాసించే" అని

కీర్తించేవారు. అలా సుమారు ఇరవై వేల పైచిలుకు కీర్తనలు ఆయన వాక్కు నుంచి పూసిన సుమాలుగా మారాయి. త్యాగయ్యను మూడవ వాగ్గేయకారునిగా మార్చేశాయి.

భక్తియోగ సంకేతాలు

భక్తి తత్వానికి మూలంగా నారద భక్తి సూత్రాల్నే ప్రధానంగా

పేర్కొన్నారు స్వామి వివేకానంద. అదృష్టవశాత్తు త్యాగయ్య జీవితంలో నారదుడే స్వయంగా ఉపదేశం చేయటం వలన ఆయన భక్తి పరబ్రహ్మంలో ఆయన్ని సులువుగా విలీనం చేసింది. నారదోపదేశం తర్వాత త్యాగయ్య భక్తి అంతకు పూర్వం కన్నా కొన్నివేల రెట్లైందంటే, అతిశయోక్తి అనుకొనేరు.

"సాత్వస్మిన్‌పరమ ప్రేమరూపా" అని, "యల్లబ్ధ్వాపుమాన్ సిద్ధో భవత్యమృతో భవతి తృప్తోభశతి" అని "యత్ర్పాప్య నకించి ద్వాభవి, నశోచవి, నద్వేష్టి న రమతే నోత్సాహీ భవతి'' అని త్యాగయ్య త్రిగుణాతీతుడై, ప్రేమస్వరూపియై విలసిల్లాడు.

భక్తి తత్వంలో అతిసామాన్యమైన భక్తిని "శాంతభక్తి" అంటారు. త్యాగయ్య కీర్తనలో "నగుమోము గనలేని నా జాలిదెలిసి నను బ్రోవరాదా శ్రీ రఘువరా" లాంటి ఒక్క కీర్తన చాలు త్యాగయ్య శాంత రసాన్ని ఆస్వాదించడానికి.

దీని తర్వాత చెప్పుకోదగ్గది 'దాస్యభక్తి'. ఇందులో భక్తునికీ, భగవంతునికీ మధ్య సేవకుడు – యజమాని సంబంధం ఉంటుంది. "పట్టు విడువరాదు. నా చేయి పట్టి విడువరాదు" లాంటి కీర్తనలు ఎన్నో.

ఇంకొంచెం సఖ్యభక్తి. "ఓరచూపు జూచేది న్యాయమా" కీర్తనను ఇందుకు ఉదాహరణగా మాత్రమే చెప్పవచ్చు. భగవంతుని వద్ద మైత్రితో కూడిన చనువే ఈ భక్తితత్వానికి పునాది.

తరువాతది 'వాత్సల్య భక్తి'. భగవంతుని తండ్రి అని, తాను ఆతని బిడ్డని భావించుకోవటమే దీనికి ఆధారం. "కన్న తండ్రి నాపై "కీర్తనల్లాంటి వాటిల్లో ఈ భక్తిరసం తొణికిసలాడుతుంది. ఈ భక్తిలో భక్తుడు చనువు సాధించి దేవుని తన బిడ్డగా మార్చేసి ఆయన్ని లాలించి, ముద్దుచేసి చివరికి మందలిస్తాడు కూడ. "కద్దను వారికి కద్దు కద్దని

మొరలనిడు" లాంటి కీర్తనల్లో త్యాగరాజు ఆ విధమైన తాదాత్మ్యం పొందుతాడు.

చివరిది "మధురభావం". ఇది భగవంతునికి, భక్తునికి మధ్య ప్రియుడు, ప్రియురాలికి ఉన్న ప్రేమలాంటిది. గోపికలు, రాధ, మీరా, రుక్మిణి, కృష్ణునితో బొందిన భావం ఇదే. త్యాగయ్యగారి 'నౌకాచరిత్ర' ఇందుకు చక్కని ఉదాహరణ. "మరుగేలరా ఓ రాఘవా", "రారా మా ఇంటిదాకా" లాంటివి అనేక కీర్తనలు ఉన్నాయి.

ఈ విధమైన ఆధ్యాత్మికమైన మలుపులతో పరబ్రహ్మాన్ని పొందిన త్యాగయ్య క్షేత్రం తిరువాయార్ నిజంగా దర్శనీయ పుణ్యక్షేత్రం. కాని దురదృష్టవశాత్తు భక్త జనులు ఆశించినమేరకు దీనిని తమిళనాడు టూరిజం వాళ్ళు అభివృద్ధి చేయక పోవటం శోచనీయం.

ఏది ఏమైనా, సంగీత, భక్తి, ధ్యానయోగ నిధి పరబ్రహ్మ స్వరూపుడైన త్యాగరాజు అందరూ 'ఇహం నుంచి పరానికి ఎప్పుడో ఓసారి వెళ్ళి తీరవలసిందే' నని చెప్పి అపార జ్ఞాననిధిని మనకు వదిలి పుష్య బహుళ పంచమినాడు మహాసమాధి నొందారు.

(స్వాతి సాహిత్య మాస పత్రిక, ఏప్రియల్ 1990)

2
హయగ్రీవావతారం - శ్రీ బెల్లం కొండ రామరాయ కవీంద్రులు

తెలుగు రాష్ట్రాల్లో చాలా మందికి బహుశ తెలిసి ఉండకపోవచ్చు. కానీ పాండిత్య లోకంలో శ్రీ బెల్లంకొండ రామరాయ కవీంద్రులు గురించి తెలియనివారు బహుకొద్దిమంది. రామరాయ కవీంద్రులు సనాతన తాత్విక సాహిత్యంలోని అనేక విభేదాలకు, వివాదాలకు స్వస్తి చెప్పేలా అనితర సాధ్యమయ్యే తాత్విక సాహితీ కృషి జరిపిన ***'అపరఆదిశంకరుడు'గా*** కీర్తి గణించారు. వీరు వివేకానందుడికి, అరబిందుడికి, శ్రీ రామకృష్ణ గురుదేవులకి, శ్రీ రమణ మహర్షులకు, షిర్డీ సాయిబాబా వంటి బ్రహ్మరుషులకు సమకాలికులు. బ్రహ్మశ్రీ తాడేపల్లి రాఘవనారాయణ శాస్త్రి గారు (చందోలు శాస్త్రి), కంచి పరమాచార్య చంద్రశేఖర సరస్వతీ స్వామి వారు వీరి కన్నా వయస్సులో చిన్నవారైన ఆయనకాలంలోనే ఉన్నారు. కొప్పరపు కవులు, తిరుపతి వేంకట కవులు వీరి కాలం వారే. హయగ్రీవుడు శ్రీరామరాయ కవీంద్రులలో ప్రవేశించటం వలన వీరిని హయగ్రీవ అవతారంగా కూడ పలువురు వేదాంతులు, మఠాధిపతులు, సంస్కృతాంధ్ర పండితులు పూజిస్తారు.

జననం

శ్రీ రామరాయ కవీంద్రులు (డిశెంబరు 27, 1875–అక్టోబరు 27, 1914) పమిడిపాడు గ్రామంలో (నేటి నర్సరావుపేట తాలూకా, గుంటూరు జిల్లా) మోహనరావు, హనుమాంబ దంపతులకు జన్మించారు.

వీరు ఆరు వేల నియోగి బ్రాహ్మణ కుటుంబీకులు. ఆధ్యాత్మికంగా వీరు విశిష్టాద్వైతాన్ని అనుసరించేవారు. ఈ కుటుంబీకులు గొప్ప అగ్రహారీకులు, వేల ఎకరాల భూములకు యజమానులు. ధనిక కుటుంబానికి చెందిన వారైనా దైవం, దానం, ధర్మం వీడనివారు, నిత్య దైవారాధకులు, అగ్నిహోత్రీకులు.

రామారావుగారు ఏడు సంవత్సరాల ప్రాయంలో ఉండగా వీరి తండ్రి గారు కాలం చేశారు. కొంతకాలం వీరు గ్రామం సమీంలోని పాఠశాలలో విద్యనభ్యసించి ఆపైచదువులకు గుంటూరు వెళ్ళి అక్కడ ఆంగ్లమాధ్యమంలో బోధించే పాఠశాలలో చేరారు. కాని ఏకారణానో వారు ఈ కాలంలో అనేకసార్లు అనారోగ్యంపాలు అవటంతో చదువు సాగక తిరిగి స్వగ్రామానికి వచ్చేశారు.

విద్యాభ్యాసం

అప్పట్నుంచి వీరి విద్యాభ్యాసం అంతా ఇంటిపట్టునే సాగింది. శ్రీ శంకరమంచి లక్ష్మీనారాయణ శాస్త్రి, శ్రీ శంకరమంచి సీతారామయ్యలు వారికి ఇంటి వద్దనే **ఉపనిషత్తులు, నమకచమకం, వేదాలు** బోధించారు. పురిఘట్ల రామశాస్త్రి గారు, భాగవతుల హరిశాస్త్రి గారు, పురిఘట్ల సుబ్రహ్మణ్య శాస్త్రి గారు ***మహాభాష్యం, వ్యాకరణం, తర్కం*** బోదించారు. పురిఘట్ల రామశాస్త్రి గారు ***మనోరమ, శబ్దేన్దుశేఖరము, పతంజలి భాష్యము*** మొదలైనవి నేర్పారు. తొలుత రామరాయ కవి గారు ***సిద్ధాంత కౌముది, సంధిపంచకం*** వంటి ప్రామాణిక పాఠాలు శ్రీ పురిఘట్ల రామశాస్త్రి గారి వద్దనే నేర్చారు. ఒకానొక సందర్భంలో వీరి అధ్యాపకులైన పురిఘట్ల రామశాస్త్రి, పురిఘట్ల సుబ్రహ్మణ్య శాస్త్రి గార్లు కొన్ని గృహావసరాల వల్ల శలవుపై కొంతకాలం వారి స్వగ్రామాలకు వెళ్ళటం జరిగింది. ఆ సమయంలో తాము

రామరాయకవికి బోధించడానికి తెచ్చిన పాఠ్యపుస్తకాలను శ్రీరామరాయకవివారి వద్దనే ఉంచి వెళ్ళారు. వారు తిరిగి వచ్చే లోపల రామరాయకవి ఆ పుస్తకాలను పూర్తిగా చదివి తనకు అర్థమయిన రీతిలో వాటిపై సులభమైన శైలిలో టీకా, తాత్పర్య సహిత వ్యాఖ్యానం రాశారు. ***సిద్ధాంతకౌముది***పై రామారావుగారు రాసిన తొలి వ్యాకరణ రచనకు ***'శరద్రాత్రి'*** అని, మరొక దానికి ***'కువలయానందము'*** అని నామకరణం చేశారు. వారు గురువులు స్వగ్రామముల నుంచి తిరిగి వచ్చాక ఈ రచనలను చదివి సంభ్రమాశ్చర్యాలకు లోనైనారు. తమ నుంచి రామరాయకవి నేర్చుకొనిన దానికన్నా, రామరాయకవి స్వకపోలం నుంచి వెలువడిన వ్యాకరణ ధారలు వారిని ముగ్ధులను చేశాయి. ఆపై వారు రామరాయకవికి బోధన చేయ సాహసించలేదు.

రామరాయకవి నిత్యనైమిత్తికాలు, ఆధ్యాత్మిక సాధన.

రామరాయకవి గారికి వీరి తండ్రి గారు చేసిన నామకరణం రామారావు గారని మాత్రమే. రామారావు గారు వారి కుటుంబీకుల ననుసరించి ఉపనయనాది పర్యంతం శ్రీవైష్ణవారాధన చేసేవారు. వారుండే పమిడిపాడు గ్రామంలో కొన్ని వందల సంవత్సరముల నాటి పురాతన విష్ణుదేవాలయము ఒకటి ఉండేది. ఈ దేవాలయాన్ని చోళ రాజుల కాలంలో గంటిరాజు 1155వ సంవత్సరంలో కట్టించారు. బ్రహ్మముహూర్తములో నిద్రలేచి, యోగాభ్యాసములు నిర్వర్తించి, ఊరి వెలుపలనున్న శేషుబావి వద్ద స్నానము చేసి, గొంతు వరకు నీళ్ళలో నిల్చుని వేయి గాయత్రీ జపం చేసేవారు. ఆ తర్వాత బ్రహ్మయజ్ఞము చేసి వారింటికి వచ్చే విద్యార్థులకు పాఠములు చెప్పేవారు. మరల గాయత్రీ మంత్రము వేయిసార్లు జపించి, మధ్యాహ్నవేళకు తన విద్యార్థులతో

సహపంక్తి భోజనం చేసేవారు. వారి బాల్యములో కొంతకాలం వారి జ్ఞాతులైన బెల్లంకొండ సీతారామయ్య గారి వద్ద సంస్కృతమును నేర్చుకొన్నారు. ఆనాడు వారి ఏకసంతగ్రాహ్యత్వమును గమనించి బెల్లంకొండ సీతారామయ్య గారు ఎంతో ఆశ్చర్యానికిలోనయ్యేవారు. స్నాన సంధ్యాదినైమిత్తికాలు, బ్రహ్మయజ్ఞములు వంటి గృహకర్మలాచరణానంతరం వారు తమ గ్రామంలోని ఇంతకుముందు పేర్కొన్న శ్రీ రమావల్లభరాయల వైష్ణవాలయానికి వెళ్ళి అక్కడ ధ్యానముద్రలో కూర్చుని శ్రీ రమావల్లభుడిని ధ్యానించేవారు. ఆ రమావల్లభుడి యందు ప్రేమతో వారు ఆ దేవాలయంలో ఒక తులసి వనాన్ని ఏర్పరచి, దాని మధ్యనే ఒక ఆసనంపై కూర్చుని ఆ మహావిష్ణువును లక్ష్మీదేవితోసహ ధ్యానించటం వలనకామోలు కొంతకాలానికి వీరికి నిద్రలో శ్రీ హయగ్రీవ దర్శనం జరిగింది.

సాధారణంగా మనం అంతా చిన్నప్పుడు **'జ్ఞానానందమయం దేవం నిర్మలస్ఫటికాకృతమ్, ఆధారమ్ సర్వవిజ్ఞానమ్ హయగ్రీవముపాస్మహే'** అని పాఠశాలలో తరగతులు ప్రారంభించేప్పుడు స్తుతిస్తామే గాని ఈ హయగ్రీవుడెవరు, అతను మనకు సకల విద్యలను ఎట్లా ప్రసాదిస్తాడు అని ఎంత మాత్రం ఆలోచించే ప్రయత్నంచేయం. ఇప్పుడు ఈ బెల్లంకొండ రామారావు గారి జీవితాన్ని పరిశీలిస్తే మనకు హయగ్రీవావతరం శక్తి, విరాట్ రూపం రెండూ ద్యోతకమవుతాయి.

హయగ్రీవ దర్శనం

రామారావు గారికి హయగ్రీవ దర్శనం జరిగినప్పుడు ఆయన వయస్సు దాదాపు 14 సం॥లు ఉంటాయి. హయగ్రీవులు కలలో మంత్రముపదేశించటమే గాక ఆ మంత్రానికి సంబంధించిన యంత్రాన్ని ఒక దానిని గతంలో తాను రత్నమాచార్యుడనే దమ్మాలపాడు గ్రామస్థులకు

బెల్లంకొండ రామరాయ కవీంద్రులు - పమిడిపాడు

రామరాయ కవి

హయగ్రీవుడు

పమిడిపాడు వల్లభరాజస్వామి దేవాలయం

వేయి సంవత్సరాల నాటి వల్లభరాజస్వామి దేవాలయం ముఖద్వారం

ఇచ్చానని, రామారావు ఆ గృహస్తు వద్దకు వెళ్ళి తాను చెప్పినట్టుగా తెలిపి ఆ మంత్రమును తెచ్చికొని దానిని పూజించమని చెప్పి అంతర్ధానమయినాడు. మెళుకువ వచ్చిన వెంటనే రామారావు గారు దమ్మాలపాడు గ్రామం వెళ్ళి రత్నమాచార్యుల వారిని కలిసి తన కలలో జరిగిన హయగ్రీవ దర్శనం, తదనుసారంగా తను అక్కడికి ఎలా రావలసివచ్చిందో వివరంగా తెలిపారు. రామారావు గారి కృషి ఫలించి ఆ యంత్రం రత్నమాచారి గారు వారికి బహూకరిస్తారు. అప్పట్నించి రామారావు గారి చింతన, ధ్యానం అన్నీ శ్రీ హయగ్రీవుడే. ఈ కాలంలోనే, అంటే సుమారు 14-17 సంవత్సరములప్రాయంలోనే రామారావు గారు ***నైషధము, మురారీ*** అను కఠిన సంస్కృత గ్రంధములను పఠించి వాటికి తానే స్వయముగా వ్యాఖ్యానము జెప్పేవారు. తన 17వ యేట ***వల్లభారాయస్తవము*** వంటి గ్రంధ రచనలు ఆరంభించారు. 18మంజరులున్న ***సముద్రమథనము*** అనే చంపూకావ్యాన్ని 17వ యేటనే ఆయన రచన గావించారు. వారికి 19వ ఏట వివాహం జరిగింది. అనేకమంది పండితోత్తముల కోరిక మేరకు వీరు నరసరావుపేట చుట్టుప్రక్కల కొన్నిచోట్ల అష్టావధాన, శతావధానములు చేశారు ఆ సమయంలోనే.

విశిష్టాద్వైతము నుండి అద్వైతమునకు - విశిష్టాద్వైత ఖండన

ఇంతకు ముందే తెలిపినట్లు రామారావు గారు, వారి కుటుంబీకులు కొన్ని తరాల నుండి శ్రీరామానుజులు ప్రతిష్టించిన విశిష్టాద్వైతమును పాటించేవారు. ఈ మతమును అనుసరించేవారు తమ శరీరముపై శంఖు, చక్ర ముద్రలు వేయించుకొంటారు. అంతేగాక శ్రీ వేంకటేశ్వరస్వామికి ఉన్నట్లు మూడు నామాలు నిలువుగా పెట్టుకొంటారు. వీటిని ఊర్ధ్వపుండ్రాలు అంటారు. రామారావు గారు గూడ మొదట్లో

ఊర్ధ్వపుండ్రాలు పెట్టుకొనేవారు. ఒకసారి శ్రీరామానుజ మతాచార్యుడు పీఠాధిపతి అయిన శ్రీమాన్ త్రిదండి ప్రతివాద భయంకర రంగాచార్య మహాస్వామి వీరుండే పమిడిపాడు గ్రామం దర్శించారు. రామారావు గారి కోరిక మేరకు వారు వీరి స్వగృహమున విడిది చేశారు. ఆ మహస్వామి వారు అక్కడున్నన్ని దినములు శ్రీ రామానుజల విశిష్టాద్వైత ప్రతిష్టానము గురించి గ్రామ ప్రజలకు బోధపడే రీతిలో ప్రసంగించేవారు. అక్కడ అలా ఉన్న దినములలో రామారావు గారు ప్రతి దినం ఆ మహాస్వామి దర్శనం చేసుకొనేవారు. వీరికి నమస్కరించే వారే తప్ప ఏనాడు సాష్టాంగ నమస్కారం చేయలేదు. ఇది విశిష్టాద్వైత సిద్ధాంతమునకు, ఆచరణకు విరుద్ధం. దీనిని ప్రతిదినం గమనించిన మహాస్వామి రంగాచార్యులవారు ఒకనాడు రామారావు గారిని పిలిచి చక్రాంకితములకు సిద్ధము కావలనని ఆజ్ఞాపించారు. రామారావుగారు ఇది బ్రాహ్మణులకు ఎంత మాత్రం అవసరం లేదని ఇతరులకు మాత్రమే అవసరమని అందువలన తాను చక్రాంకితములు చేయించుకోనని తెలిపారు. మహాస్వామి ఆజ్ఞ ఉల్లంఠించటంతో కోపించిన మహాస్వామి రామారావు గారితో వాదనకు దిగారు. చివరకు రామారావు వాదంలో బలం గ్రహించి, అక్కడ్నించి నిష్క్రమించడానికి సన్నద్ధులైనారు. రామారావుగారు మృదుస్వభావి, సత్యశీలుడు, ధర్మపరుడు కాబట్టి మహాస్వామి ఆయన అనుచరగణం తమ స్వస్థలం చేరేందుకు అవసరమైన రవాణా, భోజన సామాగ్రి, కానుకలు, ఇతర సంభారాలు ఇచ్చి అత్యంత గౌరవంగా సాగనంపారు. అదే ఆఖరు. ఆపైన రామారావు గారు తన పేరును రామరాయలుగా మార్చుకొనటమే గాక, ఊర్ధ్వపుండ్రములు ధరించటం మానేశారు. కేవలం బ్రాహ్మణులకే అవసరమైన తిలకధారణ

చేసేవారు. పూర్తిగా ఆరువేల నియోగుల సహజ సంప్రదాయమైన స్మార్తానికి మారిపోయినారు.

ఈ ఘటన జరగక పూర్వమే రామరాయకవి గారు శ్రీరామానుజుల విశిష్టాద్వైత రచనలు కొన్ని చదివి ఉన్నారు. వారికి ఆ రచనల్లో ఎన్నో లోపాలు ద్యోతకమయినాయి. రామానుజులు రాసిన ***శ్రీ భాష్యం, గీతా భాష్యం***లో ఆది శంకరుడి అద్వైతాన్ని ఖండిస్తూ ఆదిశంకరుడ్ని దూషిస్తూ శ్రీరామానుజులు రాసినవి, తర్వాత విద్యారణ్యస్వామి రాసినవి పోల్చి చూస్తే ఈ మొత్తం రచనలన్నీ లోపభూయిష్టంగా ఉన్నట్లు గ్రహించారు రామరాయకవి. వాటిని ఒక్కొక్కటిగా ఖండిస్తూ చాలా విస్తృతంగా తన రచనలు కావించారు రామరాయకవి. ఆ రచనల్లో ముఖ్యమైనవి ఆయనకు ***'అపర ఆదిశంకరుడు'*** అన్న ఘనకీర్తి సాధించిపెట్టినవి. ***శంకరాశంకరభాష్యవిమర్శ, భగవద్గీత భాష్యార్క ప్రకాశిక, సిద్ధాంత సింధు, కృష్ణోద్భవ సంవాదవ్యాఖ్య అద్వైత విజయః వేదాంత సంగ్రహః, అద్వైతాన్యమత ఖండనము*** మొదలైనవి. రామానుజుడి విశిష్టాద్వైతాన్ని గతంలో కూడా కొందరు మహాపండితులు ఖండించారు. కాని రామరాయకవి అనుసరించిన పద్ధతి చాలా శాస్త్రీయమై, లోతుగా ఉండటమే కాదు విస్తృతాధ్యనంపై నిలిచి ఉంటుంది. ముఖ్యంగా రామరాయలు శ్రుతుల ఆధారంగా, వ్యాకరణం ఆధారంగా రామానుజులు, శ్రుతసేనులు, సుదర్శనాచార్యుల విశిష్టాద్వైత వివరణలు ఎంత తప్పుడు వ్యాఖ్యానాలో సోదాహరణంగా వివరిస్తారు. ఇలా శ్రుతి ఆధారంగా స్కాంధ పురాణం, విష్ణుపురాణం, భగవద్గీతను సమన్వయ పరుస్తూ పదాలను విడదీసి సరైన అర్థాన్ని తెలిపిన వారు గతంలో లేరు.

రామరాయ కవి చాలా స్వల్పకాలం దాదాపు 39 సం॥లు మాత్రమే జీవించి ఉన్నారు. కాని ఆ కొద్ది కాలంలో దాదాపు 148 రచనలు

చేశారు. వాటిలో నేడు కొద్ది మాత్రమే – దాదాపు 45 మిగిలాయి. వాటన్నిటినీ వర్గీకరించి చాలా సూక్ష్మంగా ఒక్కో వర్గం లేదా రచన గురించి తెలుగులో చక్కగా వివరించిన మహా పండితులు ఎందరో ఉన్నారు. ఆచార్య రాములు గారు, ఆచార్య బాలసుబ్రహ్మణ్యం గారు, ఆచార్య రేవతి గారు వంటి వారు రామరాయకవి రచనల్లోని వేదాంత సంగ్రహం, చంపూ కావ్యాలపై పరిశోధనలు చేశారు. అంతకు పూర్వం ఆచార్యులు శ్రీ కె.యస్.ఆర్.దత్త గారు శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం నుండి బెల్లంకొండ రామరాయ కవి రచనలపై పరిశోధనలు చేసి తొలి డాక్టరేట్ పొందారు.

రామరాయకవిగారి గురించి ఇక్కడ తెలియపరచిన విషయాలు చాలా తక్కువ. సముద్రపులోతులున్న ఆయన జీవితం, బహుముఖ ప్రజ్ఞ, ఆంధ్రం, సంస్కృతాల్లో వారి పాండితీ ప్రకర్ష పూర్తిగా చెప్పటం ఇంత స్వల్ప స్థలంలో సాధ్యం కాదు. వారి సంపూర్ణ రచనల వైశిష్ట్యం చెప్పాలంటే అదో వేయిపేజీల గ్రంథం అవుతోంది.

"యింత స్వల్ప వయస్సులో యిన్ని శాస్త్రాలు సాధించి, ఆ శాస్త్ర గ్రంధాల మీద వ్యాఖ్యానాలు వ్రాయడాన్ని బట్టి చూస్తే ఈయన సాక్షాత్తు ***'అపర ఆదిశంకరాచార్యులే'*** అని చెప్పవలసి వస్తుంది" అని కీర్తించారు తిరుపతి వేంకట కవులు తాము రాసిన వ్యాసంలో (ఆంధ్రవాణిలో 30-03-1946లో ప్రచురితమైంది.)

సీ॥ అనవరతాన్న విద్యాదాన తప్త విద్యార్థి విరాజద్గృహంగణుండు, వ్యాకృతి తర్కవేదాంత మీమాంసాది రమణీయశాస్త్ర పారంగతుడు, సకల విద్వజనస్తవనీయ విషయ విభాసితా ప్రతిమాన భాష్యకర్త, సరస సంస్కృత కావ్య చంపుముఖ శతాధిక గ్రంధ నిర్మాణ కవిత యశుడు, నిమత

దుర్వాది కాననవీతిహోత్రుడాత్మ విజ్ఞానవర్తి సత్యవ్రతుండు, హారి బెల్లము కొండ వంశాబ్ధవిధుడు రామరాయ కవీంద్రుడు ధీమహితుడు – (ఒక గుంటూరు మండలవాసి రాసిన వ్యాసంలోని పద్యం – 1914 ఆనంద సంవత్సరాది సంచిక : ఆంధ్రపత్రిక స్వర్ణోత్సవ సంచిక, 1965)

నిజానికి పమిడిపాదులోని స్వామి వారింటిని, ఆయన గ్రంథ రచన చేసిన గదిని పరిశీలిస్తే ఆయన తన రచనలకు వాడిన పరిశీలనా గ్రంథాలు కేవలం పదుల్లోనే ఉన్నాయి. కాని ఆయన రచనల్లో కొన్ని వందల పౌరాణిక, వేదాంత విషయాలు ప్రస్తావిస్తారు. విద్యారణ్యుల వారి పుస్తకాలు, మధుసూదన సరస్వతి, రామానుజుల, ఆయన అనుచరుల పుస్తకాలు ఎన్నో ప్రస్తావిస్తారు. కాని ఆవేమి ఆయన దగ్గరున్నట్లు కనబడవు. ఆఖరికి ఆయన సంపూర్ణ రచనల వ్రాత ప్రతులు కూడ పూర్తిగా లేవు. ఆ విధంగా పరికిస్తే స్వామి వారి విస్తృత వ్యాఖ్యానం, విజ్ఞానం పుస్తకాలపై ఆధారపడినవి కావు. అది కేవలం బ్రహ్మజ్ఞాన ఫలితమే శ్రీ హయగ్రీవుడికి అనుగ్రహం. వారు ఆయనలో ప్రవేశించటం వలననే జరిగింది. అందువలననే ఆయన హయగ్రీవుడు అయ్యాడు.

బెల్లంకొండ రామరాయకవి దేవాలయం – పమిడిపాడు.

శ్రీ బెల్లంకొండ రామరాయ కవీంద్రుల మనుమలు, ముదిమనుమలు ఈ మహనీయుని పేరిట ఒక ట్రస్టు నెలకొల్పారు నరసరావుపేటలో. అంతేగాక ఈ ఋషి పుంగవుడు జీవించిన పమిడిపాడు ఇంటిని రామరాయ కవి దేవాలయంగా మార్చారు. అందులో స్వామి వారి విగ్రహం ప్రతిష్ఠాపన చేశారు. ఈ ప్రతిష్ఠాపన శృంగేరీ పీఠాధిపతి హస్తముల మీదుగా జరిగింది. అక్కడ స్వామి వారిని హయగ్రీవావతారంగా పూజిస్తారు. అర్చిస్తారు. అన్ని పండుగలు, విశేష దినముల్లో ఇక్కడ ప్రత్యేక పూజలు, కార్యక్రమాలు

నిర్వహిస్తారు. సాధన చేసే భక్తులు, స్వామి వారి సన్నిధిలో గడపాలనుకొనే భక్తుల కోసం ఇక్కడ ఒక వసతి గృహం నిర్మించారు. నల్గురు వ్యక్తులు ఉండవచ్చు. కేవలం దినుసులు తెచ్చుకొంటే చాలు. వంట సామాగ్రి అంతా ఉంది. పమిడిపాడు నర్సరావుపేట నుంచి పదికిలోమీటర్లు ఉంటుంది. అన్నిరకముల రవాణా అందుబాటులో ఉంటుంది. స్వామి దర్శనంకు వచ్చేవారు వేయి సంవత్సరముల క్రితం నిర్మించిన రమావల్లభరాయలు వారి దేవాలయాన్ని కూడ దర్శించవచ్చు.

(ఋషిపీఠం మాసపత్రిక జూన్ 2022)

3
చందోలు మహర్షి తాడేపల్లి రాఘవ నారాయణశాస్త్రి

"ఆంధ్రదేశమున శ్రీ శాస్త్రి గారి నెఱుంగని వారెవరు? ఈ చందోలు శాస్త్రి గారు (బ్ర.శ్రీ. తాడేపల్లి రాఘవ నారాయణ శాస్త్రి గారి అభిజనము తెనాలికి సమీప మందలి చందోలు (ఒకప్పుడు చంద్రపురి). వీరు గృహస్థాశ్రమమందున్న శంకరులు – 'దర్శనాదేవ సాధవ:' అను నానుడికి వారే తార్కాణము. వారు నిస్పృహులు, కవులు. వారి దర్శనమొక భాగ్య విశేష్యము. వారి తండ్రి గారు బ్ర.శ్రీ. వెంకటప్పయ్య శాస్త్రి గారు ఆంధ్రదేశమున 'నహిప్రతి'గా పేరొందిన కవి తల్లజులు అని వర్ణించారు బ్ర.శ్రీ బులుసు సూర్య ప్రకాశ శాస్త్రి గారు.

వీరు తెనాలి సాధన గ్రంథమండలి వ్యవస్థాపకులు. అంతేగాదు కంచి పరమాచార్య శ్రీ చంద్రశేఖర సరస్వతి స్వామి వారికి అత్యంత సన్నిహితులు. వారి అనుగ్రహం, ఆశీస్సులు మెండుగా కలవారు. వారు తెనాలి వచ్చినప్పుడల్లా వీరింట్లోనే విడిది చేసేవారు. ఈ మహాస్వామిలాగానే శృంగేరి పీఠాధిపతివారు కూడ తెనాలి వచ్చినప్పుడు బులుసు సూర్యప్రకాశ శాస్త్రి గారి ఆతిథ్యమే స్వీకరించేవారు. ఇటువంటి నేపథ్యమున్న బులుసు సూర్యప్రకాశశాస్త్రి గారు శ్రీ తాడేపల్లి రాఘవ నారాయణశాస్త్రి గారికి కూడ ఆప్తులు అవటమేగాక, కంచి పరమాచార్య అనుమతి, ఆదేశములతో శ్రీ శంకర భగవత్పాదులు రచించిన అన్ని స్తోత్రములకు శ్రీ చందోలుశాస్త్రి గారితోనే వ్యాఖ్యానము, అనువాదము చేయించి వాటిని అనేక సంపుటములలో వరుసగా ప్రచురించారు.

శ్రీ తాడేపల్లి రాఘవ నారాయణశాస్త్రి గారినే 'చందోలు శాస్త్రి' గారు అంటారు. కారణం చందోలు వారి ఊరు కావటమే. ఇది బాపట్ల, గుంటూరు బస్సు మార్గంలో ఉంటుంది. తెనాలి నుండి కూడ వెళ్ళవచ్చు. దాదాపు గంట ప్రయాణం. 'చందోలు శాస్త్రి' గారిని 'మహర్షి' అని కూడ అంటారు. వీరి తండ్రి గారు శ్రీ తాడేపల్లి వెంకటప్పయ్య శాస్త్రి గారు కూడ 'రుషితుల్యులు', 'మహాకవి'. తిరుపతి వేంకట కవులకు, కొప్పరపు కవులకు, బెల్లంకొండ రామరాయ కవి వంటి కవులకు సమకాలికుడు. తిరుపతి వేంకటకవులకు, బెల్లంకొండ రామరాయ కవితో వివాదంలో ఆనాడు ప్రధాన పాత్ర పోషించారన్నది నాటి సాహిత్య పత్రికల్లో ప్రముఖంగా కనిపిస్తుంది.

శ్రీ తాడేపల్లి రాఘవనారాయణ శాస్త్రి గారి చిన్ననాటి వివరాలు చరిత్రలో నిక్షిప్తం కాలేదు. ఆయన ఆగస్టు 25, 1896 వెంకటప్పయ్య, హనుమాయమ్మలకు జన్మించినట్టు మాత్రమే వారిపై అందుబాటులో ఉన్న సాహిత్యం నుంచి తెలుస్తోంది. వారి తల్లి గారి వివరాలు ఆవిడ గారి స్వస్థలం, వంశం, గోత్రం, వారి వైపువారెవరో కూడ తెలియదు. కేవలం తండ్రి గారు అయిన వెంకటప్పయ్య శాస్త్రి గారి వివరాలు మాత్రమే జీవిత చరిత్ర పుటలు తెలుపుతున్నాయి. అంతటి గొప్ప యోగ పురుషుడి జనని వివరాలు తెలియక పోవటం నిజంగా ఒక చారిత్రక లోపమే. వెంకటప్పయ్య శాస్త్రి గారు ఆత్రేయస గోత్రీకులు అని మాత్రం తెలుస్తోంది. 'తాడేపల్లి' ఇంటిపేరు గలవారు అంతా 'ఆత్రేయస' గోత్రీకులు కాదు. తెనాలిలో, ఇతరత్రా ఈ ఇంటి పేరుతో ఉండే అనేక కుటుంబీకులకు శ్రీ చందోలు శాస్త్రి గారితో ఎటువంటి చుట్టరికమూ లేదు.

తొలుత శ్రీ రాఘవ నారాయణ శాస్త్రి గారి యోగ జీవితమును

గ్రంథస్థం చేసినవారు వారి దౌహిత్రులు చెఱువు సత్యనారాయణ శాస్త్రి గారు. వారు దానిని శుద్ధ గ్రాంథికములో రాయటం జరిగింది. అందులో భాగమైన ఒక కథను దశాబ్దాల క్రితం శ్రీ రాఘవ నారాయణ శాస్త్రి గారి శిష్యులలో ఒకరైన గట్టి లక్ష్మీ నరసింహశాస్త్రిగారు 'అగ్ని పరీక్ష' అనే పేరుతో తెలుగులో గద్య కావ్యంగా రాశారు. ఈ కథను సంస్కృతంలో (తెలుగు లిపి) 'శ్రీ గురు చరిత - మహాకావ్యం'గా శ్రీ మేళ్ళ చెరువు వేంకట సుబ్రహ్మణ్యశాస్త్రి గారు 1991లో ముద్రించారు. దీనినే తెలుగులో "పితాపుత్ర కవీశ్వరులు : చందోలు మహర్షులు"గా కూడ రాశారు శ్రీ మేళ్ళ చెరువు వేంకట సుబ్రహ్మణ్యశాస్త్రి గారు. తొలుత దీన్ని బులుసు సూర్య ప్రకాశశాస్త్రి గారి కుమారుడు హరిశంకర శర్మ సాధన గ్రంథ మండలి నుండి 1996లో వెలుగులోకి తెచ్చారు. దీని మూడవ ముద్రణ 2018లో వేశారు.

ఈ 'పితాపుత్ర కవీశ్వరులు' చందోలు మహర్షులు' గ్రంథంలో చందోలు శ్రీ శాస్త్రి గారి బాల్యంలోని మంత్రోపదేశ ఘట్టం నుంచి, ఆయన యోగ సాధన, ఆత్మ సాక్షాత్కారం, ఈ సాధనలో ఎదురైన అనుభవాలు వరకూ ప్రధానంగా కనిపిస్తాయి. శ్రీ శాస్త్రి గారి సాధన, ఎదురైన అనుభవాలు ఆయన నుంచే వెలువడిన మాటల ఆధారంగా ఈ పుస్తక రచన సాగిందన్నది మేళ్ళ చెరువు వేంకట సుబ్రహ్మణ్యశాస్త్రి గారి రచన ద్వారా విదితం అవుతుంది. మన ప్రవచనకారులు తమ ప్రవచనాల్లో శ్రీ చందోలుశాస్త్రి గారి గురించి చెప్పే విషయాలు ఎక్కువ భాగం ఈ పుస్తకం నుంచీ తెలిపేవే నన్నది ఈ పుస్తకం చదివిన వారికి తేట తెల్లం అవుతుంది. కారణం ఏమిటంటే మన ప్రవచనకారుల్లో చాలామంది శ్రీ చందోలు శాస్త్రి గారు బ్రతికున్న కాలంలో వారిని దర్శించి ఉండలేదు.

చందోలుకు రాలేదు. కాని, కంచిపరమాచార్య శ్రీ చంద్రశేఖర సరస్వతి స్వామి వారు, శ్రీ శృంగేరి పీఠాధిపతులు శ్రీ చందోలు శాస్త్రి గారిని దర్శించి, ఆయనకు తమ ఆశీస్సులు అందించటానికి స్వయంగా చందోలు వచ్చినది మాత్రం చారిత్రక సత్యం. ఇందుకు బులుసు సూర్యప్రకాశశాస్త్రి గారితో సహా అనేక మంది నాటి మహామహులు ప్రత్యక్ష సాక్షులు.

మేళ్ళ చెరువు వేంకట సుబ్రహ్మణ్యశాస్త్రి గారు సంస్కృతంలో (తెలుగు లిపి) రాసిన, 'శ్రీ గురుచరిత – మహాకావ్యం' అటు కావ్య ప్రమాణాలకు ధీటుగా, ఇటు శ్రీ చందోలు శాస్త్రి గారి యోగసాధనా ప్రకరణకు తగ్గకుండా చాలా అద్భుతంగా ఉంటుంది. సంస్కృతంలో ప్రవేశం ఉన్నవారు దీనినే చదివి తరించవచ్చును. మేళ్ళ చెరువు వేంకట సుబ్రహ్మణ్య శాస్త్రి గారు రాసిన రెండు జీవిత చరిత్రల్లోనూ శ్రీ తాడేపల్లి రాఘవ నారాయణ శాస్త్రి గారి జీవితం ఒక క్రమ పద్ధతిలో, సంప్రదాయ జీవిత చరిత్రల్లో లాగా ఆవిష్కారం కాదు. ఉదాహరణకు శ్రీ చందోలు శాస్త్రి గారి తల్లి పేరు చందోలు శాస్త్రి గారి జననం, బాల్యం, విద్యాభ్యాసం వంటివి ఏవీ చరిత్ర క్రమంలో కనిపించవు. శ్రీ చందోలు శాస్త్రి గారు సన్యసించాలనుకొని తల్లి అనుమతి కోరిన ఒకే ఒక ప్రస్తావన సందర్భంగా తల్లిపేరు ప్రస్తావన చేస్తారు మేళ్ళ చెరువు వేంకట సుబ్రహ్మణ్యశాస్త్రి గారు. అంతేకాదు చందోలుశాస్త్రి గారి యోగ శక్తిని దర్శించిన, అనుభవించిన వారి పేర్లు, వివరాలు ఏవీ ఉండవు. కేవలం ఒక లీలగా రేఖామాత్రంగా వాటిని పేర్కొనటం ఉంటుంది. ఇది ప్రామాణిక జీవిత చరిత్రలకు భిన్నమైన పద్ధతి. ఇక తెలుగు వికీపీడియాలో శ్రీ చందోలు శాస్త్రి గారి జీవిత చరిత్రంతా తప్పులు తడకలుగా ఉంటుంది. ఈ వికీపీడియా కథనాన్ని 'అచ్యుతన్' అనే వెబ్‌సైట్ కథనం ద్వారా

సేకరించారని తెలుస్తుంది. అది అంతా ఎన్నో వక్రీకరణలతో ఉంటుంది.

ఈ నేపథ్యంలో అత్యంత ప్రముఖ యోగి శ్రేష్ఠులైన శ్రీ తాడేపల్లి రాఘవ నారాయణశాస్త్రి గారి జీవితమును ఒక సంప్రదాయ బద్ధమైన జీవిత క్రమంలో రాయవలసిన అవసరం ఎంతైనా ఉంది.

బాల్యము, విద్యాభ్యాసము :

శ్రీ చందోలు శాస్త్రి గారు బాల్యంలో అందరిపిల్లల్లా ఆటపాటల్లో గడపలేదు. బాల్యం నుంచే తల్లిదండ్రులు బాలుని వేదవిహిత కర్మలకు అలవాటు చేశారు. అక్షరాభ్యాసం మొదలు పదేళ్ళు వచ్చే వరకూ వారు తండ్రి వెంకటప్పయ్యశాస్త్రి గారి వద్దనే సంస్కృత విద్యనభ్యసించారు. బ్రాహ్మీముహూర్తంలో లేవటం నుంచి అనుష్ఠాన కర్మలు, యజ్ఞ హోమ క్రతువులలో తల్లిదండ్రి వెంటనే ఉండి అన్నిటా భాగస్వామ్యులు అయినారు. పాఠశాల విద్యలకు పోలేదు. ఆ ప్రకారంగా వారికి ఆంగ్ల భాషతో సంకరం అయ్యే అవకాశం కలగలేదు. ఈ క్రమంలో ఆయన బాల్యంలోనే ఒక తపస్విలా కనిపించేవారు. మెడలో రుద్రాక్ష మాలికలు, నుదుట భస్మత్రిపుండ్రరేఖలు ధరించి అగ్నికార్యం నిర్వర్తించేవారు. లోకం దృష్టిలో వారు ఒక బాల బైరాగి. వారికి ఓనమాలు నేర్పిన మాచిరాజు దండయ్య పంతులు గారి అల్లుడు ఒక గొప్ప మంత్రవేత్త. ఆయన పేరు కేదారలింగం. ఆయన తాడికొండ నివాసి, గొప్ప ఉపాసకుడు. శ్రీ చందోలుశాస్త్రి గారికి 'బాలామంత్రోపదేశం' చేశారు వారి పన్నెండవ ఏట. అప్పట్నించి చందోలుశాస్త్రి గారు ఈ మంత్రాన్ని తన పదహారవ ఏటి వరకూ పూర్ణ బ్రహ్మచర్యంతో జపిస్తూనే ఉండేవారు. బ్రహ్మచర్య వ్రతం అంటే వివాహం లేకుండా ఉండటమని చాలా మంది అనుకొంటారు. ఎందుకంటే ఆ రోజుల్లో బాల్య వివాహాలు ఉండేవి సంప్రదాయ బ్రాహ్మణ కుటుంబాలలో.

కాని, ఇక్కడ విషయం ఏమిటంటే శ్రీ చందోలు శాస్త్రి గారు అద్దము, దువ్వెన, తలకు నూనె వాడేవారు కాదు. కేశాలంకరణవంటివి చేయలేదు. తాంబూలాన్ని ముట్టుకునేవారు కాదు. స్నానం, జపం, అగ్నికార్యం, నేలపై పడుకోవటం, రాత్రిమాత్రమే నిద్రించటం చేస్తూ మంత్రాన్ని జపించటం వలన ఆయనకు 'మంత్రసిద్ధి' జరిగింది. ఫలితంగా వారి వాక్కుకు మహిమ ఏర్పడింది. వారి వాక్కుతో ఏమంటే అది జరిగేది. ఈ క్రమంలోనే సాక్షాత్కరించిన 'బాలాత్రిపుర సుందరి', తను 'పినతల్లి' అని పిలిచే మాచిరాజు శేషమ్మని పోలి ఉండటంతో 'పిన్నమ్మ' అని పిలిచేవారు. నిజానికి ఈ మాచిరాజు శేషమ్మ చందోలు శాస్త్రి గారికి పినతల్లి అవునా, లేక పరిచయస్థురాలా అన్న విషయంలో స్పష్టతలేదు.

సన్యాస ప్రయత్నం, తుదకు వివాహము :

'బాలా' సాక్షాత్కారము తర్వాత చందోలుశాస్త్రి గారు మానసికంగా సంపూర్ణ వైరాగ్య స్థితి పొందారు. సాక్షాత్తు జగన్మాత దర్శనమైన తర్వాత వారికి ఈ ప్రపంచంలో ఏదీ అవసరమని అనిపించలేదు. తనకేది కావాలో అది 'అమ్మే' ఇస్తుందన్న భావనలో ఉండేవారు. ఆఖరికి తనకు శారీరక అనారోగ్యం కలిగినా, ఆర్థిక అవసరం ఉన్నా అన్నీ ఆ 'బాలా'నే చూసుకొంటుందన్నంత నమ్మకం ఏర్పడింది.. ఆయనలో ఆయన నమ్మకాన్ని ఏనాడు వమ్ము చేయక ఆయనతోనే చివరి క్షణం వరకు ఉండిపోయింది 'బాలాత్రిపుర సుందరి'. ఈ క్రమంలోనే ఆయన ఇక సన్యసించాలనుకొన్నారు. తన కోర్కెను తల్లి హనుమాయమ్మకు తెలిపారు. ఆమె ఈ విషయం వెంకటప్పయ్య శాస్త్రి గారికి చేర్చింది. వారివురు శ్రీ చందోలు శాస్త్రి గారి సన్యసించాలన్న కోరికను సరిగ్గా అర్థంచేసికోలేదు. అదంతా ఏదో అమ్మ అనుగ్రహించటం వలన కలిగిన ఆవేశంగానే

భావించారు. కాని ఒకనాడు శాస్త్రి గారి తండ్రి వెంకటప్పయ్య శాస్త్రి గారు కొన్ని పనులపై ఊరి బయటకు వెళ్ళారు చందోలులో. అక్కడ తాటి చెట్ల నుడమ, ముళ్ళ పొదల మధ్య తపస్సులో కూర్చున్న కొడుకును చూసి ఆశ్చర్యపోయారు. చందోలుశాస్త్రి గారికి పరిసరాల స్పృహలేదు. సమాధి స్థితిలో ఉన్నారు. అప్పుడు అర్థమయింది వెంకటప్పయ్య శాస్త్రి గారికి తన కుమారుడైన చందోలు శాస్త్రి మనోగతం.

తన కుమారుడు సామాన్య జీవుడు గాడని, అతని వృత్తాంతం తెలుసుకోవాలని ఆయన గుంటూరులోఉన్న గోవిందరాజుల శ్యామలాంబ అనే దివ్యజ్ఞాన యోగిని వద్దకు వెళ్లారు. ఆమె ధ్యానంలో శ్రీ తాడేపల్లి రాఘవనారాయణశాస్త్రి పూర్వ జన్మమును దర్శించి, ఎవరో మహాపురుషుడు నీ పుత్రుడిగా జన్మించాడని తేల్చి చెప్పింది వెంకటప్పయ్యశాస్త్రికి. ఈ విషయం ఆయన తన కుటుంబీకులకు తెలియపర్చారు. ఇదంతా విన్న శ్రీ రాఘవ నారాయణశాస్త్రి గారు తన్మ పూర్వ జన్మ వృత్తాంతము తెలియగోరి సమాధిలోకి వెళ్ళారు. చిన్నమ్మ సాక్షాత్కరించి 'నీవెవరో చెప్తారా...' అంటూ చందోలుశాస్త్రి వారి చేయి పట్టుకొని బయల్దేరింది. స్థూలకాయుడై ఉన్న శ్రీ చందోలు శాస్త్రి గారి నుంచి ఒక దివ్య శరీరం, చిన్నమ్మ రూపంలో ఉన్న బాలా దివ్యశరీరం రెండూ ఊర్ధ్వలోక ప్రయాణం అయినాయి. అని అనేక లోకాలను దాటి ముందుకు వెళ్తున్నాయి. అలా పయనించి చివరకు ఆ శరీరాలు శ్రీ చక్రవ్యూహంలోకి ప్రవేశించాయి. ఈ త్రికోణాత్మక చక్రంలో మూడు ఆవరణలు దాటి నాల్గవ ఆవరణకు వచ్చాయి. అప్పుడు చిన్నమ్మ చెప్పింది. "అబ్బాయి, నీవిక్కడ వాడవు' అని ఆ ఆవరణంలోకి రాగానే శాస్త్రి గారి దివ్య శరీరం మాయమై ఒక సిద్ధ పురుషుడిగా మారింది. తానొక సిద్ధ పురుషుడిగా తనకు తానే కన్పించటం

జరిగింది. అక్కడ వీరికి ఎదురుగా శ్రీ చక్రేశ్వరి, శ్రీ మహారాజ్ఞి అయిన పరాభట్టారిక దర్శనమిచ్చింది. ఆమె వీరికి కొంచెం దూరంలో ఉన్న ముగ్గురు యువతులను చూపి సిద్ధ పురుషుని రూపంలో ఉన్న శ్రీ చందోలుశాస్త్రి గారిని వెళ్ళి వారిని తన వద్దకు తీసుకురమ్మని ఆజ్ఞాపించింది. వారలాగే వారి వద్దకు వెళ్ళి వారిని తెచ్చారు. అందులో ఒకర్ని భుజం పైన ఎక్కించుకొని, మిగతా ఇద్దరిని చెరోవైపు చేతుల్తో పట్టుకొని తెచ్చారు. పరాభట్టారిక మహారాజ్ఞి ఒక్కసారిగా మందహాసం చేసి, ఓరీ నీ మనస్సు చలించినది. నీవు భూలోకంలో జన్మించు. నీ భుజంపైన వచ్చిన సుందరి నీకు భార్య అవుతుంది' అని చెప్పి అదృశ్యమైంది. అంతే భూమ్మీద సమాధి స్థితిలో నున్న శ్రీ చందోలుశాస్త్రి గారికి తన పూర్వజన్మం అవగతమైంది.

ఈ క్రమంలోనే తండ్రి వెంకటప్పయ్య శాస్త్రి గారి ఆజ్ఞవలననో, లేక తను సమాధి స్థితిలో దర్శించిన స్త్రీ వృత్తాంతము కారణంగానో శాస్త్రి గారు వివాహానికి సిద్ధమైనారు. వారు తన పందొమ్మిదవ ఏట దేవమ్మ గారిని వివాహం చేసుకున్నారు. అఖండ శ్రీదేవి ఉపాసకులైన అద్దేపల్లి సోమనాథశాస్త్రి గారి అన్న కూతురు ఈ దేవమ్మగారు. ఈ అద్దేపల్లి సోమనాథ శాస్త్రి గారు తాడేపల్లి వెంకటప్పయ్య శాస్త్రి గారికి గురువు.

(ఋషిపీఠం మాసపత్రిక జనవరి 2023)

(2వ భాగం)

తర్వాతి జీవితంలో చందోలుశాస్త్రి గారు తన యోగానుభవంలో తనకెదురయిన పరీక్షలు గురించి, చిన్నమ్మ లీలల గురించి అప్పుడప్పుడు వివరించిన ఘటనలు లోక విదితమే. అయితే శ్రీ చందోలుశాస్త్రి తన యోగానుభవంతో వివరించిన శ్రీ శంకర భగవత్పాదుల సౌందర్యలహరి

శ్లోకం అన్నింటిలోనూ మకుటాయమానం వంటిది. అదిక్కడ వివరిస్తాను.

వాగ్దేవి ఎవరి భార్య? :

వేదాంత శాస్త్రములోని కొన్ని కథలు పరస్పర విరుద్ధంగా ఉన్నా, సమన్వయానికి అవి చాలా అవసరం అంటారు శ్రీ చందోలుశాస్త్రి గారు. అలాంటివి కొన్ని శంకరవాఙ్మయంలో గూడ ఉన్నాయంటూ, ఈ క్రింది శ్లోకాన్ని వివరించారు.

గిరా మాహుర్దేవీం ద్రుహిణ గృహిణీ మాగవిదో
హరే: పత్నీం పద్మాం హరసహచరీ ముద్రితనయాం
తురీయా కాపిత్వం దురధిగమ నిస్సీ మహిమా
మహామాయా విశ్వం భ్రమయసి పరబ్రహ్మ మహిషీ

వాగ్దేవత బ్రహ్మదేవుని భార్యయని అందరూ పరిగణిస్తుంటారు. "విష్ణు పత్నీం సరస్వతీం" అని శ్రీ హర్షుడు రాశారు. ఆగమములలో 'శాంభవీం శంభుపత్నీం' అని కనబడుచున్నది. సరస్వతి భర్త యెవరని సందేహము ఇక్కడ ప్రస్తుతము. అనేక మంది ఉద్దండులైన పండితులను సంప్రదించినప్పటికీ పరిష్కారం కాని ఈ వైరుధ్యం ఆదిశంకరుని రచన అయిన సౌందర్యలహరిలో పైన పేర్కొన్న పద్యం వద్దకు రాగానే పరిష్కారమయింది. ఇందుకు తన యోగాను భవమే సాక్ష్యమని" శ్రీ చందోలుశాస్త్రి గారు పేర్కొనటం, ఆయన ఇచ్చిన ఈ క్రింది వ్యాఖ్యానం చదివితే మనమంతా ఆశ్చర్యపోక తప్పదు.

"ఈ శరీరములో షట్చక్రములు ఉన్నవన్నది యోగుల అనుభవము. గుద స్థానమునకు నాలుగు అంగుళములపైన మూలాధారము అను చక్రమున్నది. ఇడ, పింగళ అనునాడులు అక్కడనుంచి భ్రూమధ్యమున ఆజ్ఞాచక్రము దాకా సుషుమ్నానాడికి కుడివైపున, ఎడమవైపున వ్యాపించి

యున్నది. వీటికే ప్రకృతి, పురుషుల మధ్య 'ప్రస్ఫురన్నాద రూపం' అని అభియుక్తులు చెప్పుచున్నారు. ఆనాదము నాభీ ప్రదేశమున్న మణిపూరకము అను చక్రము వరకూ సూక్ష్మరూపముగా ఉన్నది. ఆ మణిపూరకమునకు విష్ణువు అధికారి. అట్టి నాదాన్ని విష్ణువు అనాహతము వరకు వ్యాపింప చేయుచున్నాడు. దానికి పశ్యంతీదశ అనిపేరు. అనాహతమునకు అధిపతి శివుడు. అక్కడి నుండి నాదము విశుద్ధ చక్రమునకు ఆ శివుడు నడుపును. దానికి మధ్యమ అని పేరు. దీనిని నడుపువాడు శివుడే. దానికి అధికారి భర్తయని చెప్పబడుచున్నాడు. అక్కడి నుండి ముఖరంధ్రముల ద్వారా బయటకు వచ్చే ఆనాదమయమైన వాగ్దేవత వైఖరీయని చెప్పబడుచున్నది. ఆ సరస్వతి భర్త బ్రహ్మదేవుడు. కావున ఆ సరస్వతి నాలుగు రూపములు కలిగి ఉన్నది. ఎక్కడి రూపమునకు అక్కడి వారే అధికారులుగా చెప్పబడుచున్నారు. ఆ యోగము తెలియని మనకు సరస్వతికి ఇందరూ భర్తలా అని పరిహాసముగా తోచుచున్నది. ఈ విషయమునే ఆదిశంకరులు పై శ్లోకము ద్వారా సౌందర్యలహరిలో నిరూపించియున్నారు" అని వివరణ ఇచ్చారు శ్రీ చందోలుశాస్త్రి గారు.

"ఇట్లే ఆదిశంకరుల స్తోత్రములన్నింటిలోనూ ఏదో నిరూపింప శక్యము గాని విషయము ఒకటి సిద్ధాంతీకరించబడియున్నది" అంటారు చందోలుశాస్త్రి గారు.

వివాహానంతర లౌకిక జంఝాటనము, ధనార్జన ప్రయత్నం :

శ్రీ చందోలుశాస్త్రి గారికి 19వ ఏట వివాహం జరిగిన నాటి నుంచి లౌకిక జంఝాటనము పట్టుకొంది. నాడు వివాహానంతరము ధర్మపత్నిని వెంటనే ఇంటికి పంపువారు కాదు. కొంత తడవ తర్వాత

పంపేవారు. ఆ సమయంలో తన సంసార ఖర్చులకు సరిపడ్డ ఏదైనా వ్యాపకం కల్పించుకొని, తద్వార ధన సముపార్జన చేయాలని భావించారు. ఈ న్యాయమైన పురుషార్థము కోసం తాడికొండలో ఉండే శ్రీ ముదిగొండ నాగలింగశాస్త్రి గారిని ఆశ్రయించారు. ఆయన వద్ద కొంత కాలం వ్యాకరణం నేర్చారు. వేదాంతాధ్యయనంలో విశేష కృషి సల్పారు. వీరిలాంటి శిష్యుడు లభించటం ఒక గొప్ప వరంగా భావించారు నాగలింగశాస్త్రి గారు. ఆయన చందోలుశాస్త్రి గారికి వేదాంతశాస్త్రం చెబుతూనే శంకర భాష్యం, ప్రక్క ప్రక్కనే రామానుజభాష్యం, మాధ్వభాష్యం, నీలకంఠ (శైవ) భాష్యం కూడ తులనాత్మకంగా బోధిస్తూ, ప్రతి సూత్రానికి పాఠం చెప్పారు. ఈ విద్యాభ్యాసం సమయంలోనే నాగలింగశాస్త్రి గారు ఏ సభలకు, సమావేశాలకు వెళ్తే వారితోనే చందోలుశాస్త్రి గారు కూడ వెళ్ళేవారు. ఆవిధంగా చందోలుశాస్త్రి గారికి అష్టావధానాలు, శతావధానాలు చేసే అవకాశాలు లభించేవి. అటువంటి కార్యక్రమములు చేసినప్పుడు లభించే ధన, ద్రవ్యాలను గురువు నాగలింగశాస్త్రి గారికి గురు దక్షిణగా సమర్పించే వారు చందోలుశాస్త్రి గారు.

ఏదైతేనేం? చందోలు శాస్త్రి గారికి వివాహానంతర జీవితం నెట్టడానికి అవసరమైన ముడిసరుకు, ప్రతిభ, మార్గం ముదిగొండ వారివద్ద లభించింది. అలాంటి ఆత్మ విశ్వాసం ఏర్పడినా ఎక్కడో ఏదో భయం, సందేహం-అనుకొన్నట్లు ధనార్జన అవుతుందా? కాదా? అని. అప్పటికే 'చిన్నమ్మ' సాక్షాత్కారం అయినా ఒక పసి మనస్సు ఆందోళన అది. చాలామంది ఆత్మసాక్షాత్కారానుభవం కల్గిన యోగులు ఈ విధమైన డోలాయమానస్థితి, పసిమనస్సుతో బాధపడుతుంటారు. అందుకు శ్రీ రామకృష్ణ పరమహంస గురుదేవులే చక్కని ఉదాహరణ. శ్రీ రామకృష్ణ

పరమహంస జీవిత చరిత్ర చదివితే ఇది బోధపడుతుంది. అందువల్ల "చిన్నమ్మ" 'బాలత్రిపురసుందరి' అనుగ్రహం తర్వాత కూడ చందోలుశాస్త్రి గారు ఈ ముదిగొండ వారి వద్ద లౌకిక జీవిత విద్యలు నేర్చుకొంటున్న నేపథ్యంలో ఒకసారి చందలూరు అమ్మవారి దర్శనానికి వెళ్ళారు. అప్పట్లో 'చందలూరు మహాలక్ష్మమ్మ' అంటే ప్రతి ఇంటిలో మారుమ్రోగే పేరు.

చందలూరు మహాలక్ష్మమ్మ గారిని ఉపాసించే గణాచారి లక్ష్మినారాయణగారు సందేహాలు, సంశయాలతో అమ్మవారి వద్దకు వచ్చేవారికి, అమ్మవారి తరపున సమాధానాలు ఇచ్చేవారు. అవి ఖచ్చితంగా జరిగేవి. చందోలుశాస్త్రి గారు మడి కట్టుకొని అమ్మవారి ముందు కూర్చున గణాచారి లక్ష్మినారాయణగారి దరిచేరి, ఆయన్ను తన సంశయం తీర్చమని అడిగారు. వెంటనే లక్ష్మినారాయణ గారు ఆగ్రహోదగ్రుడైనట్టు కన్నెర్రజేసి, ఎలుగెత్తి 'ఏరా! నీకు ఐశ్వర్యం కావాలా?' అని కేకలు వేశారు. అందుకు ప్రతిగా పసిమనస్సున్న శ్రీ చందోలుశాస్త్రి గారు ఎంతమాత్రం బెదరకుండా 'ఏం? ఎందుకు కోరగూడదు' అని బదులిచ్చారు. అంతటితో ఆగకుండా "నేను మిమ్మల్ని అడగలేదు గదా" అని కూడ అన్నారు. లక్ష్మినారాయణ గారు అమ్మవారు పూనిన ఆవేశంలో చందోలు శాస్త్రిని చూస్తూ 'ఐశ్వర్యం కోరవద్దు. నీ అన్నవస్త్రాలకు లోపం లేకుండా జరుగుతుంది. నీవు ఈ సమీప పర్వతంలో ఒకనాడు తపస్సు చేసిన యోగివి. యోగభ్రష్టత వలన ఈ జన్మ సంభవించింది. నిన్ను నేను స్వయంగా అనుగ్రహిస్తాను" అని అభయ హస్తం ఇచ్చింది. అప్పుడు చందోలుశాస్త్రి గారు 'మీ మాటలను విశ్వసించటం ఎలా?' అన్న సందేహం వ్యక్తం చేశారు. అందుకు బదులుగా మహాలక్ష్మమ్మ అమ్మవారు చందోలు శాస్త్రి గారికి వచ్చిన స్వప్నాలను గుర్తుచేసి వారి సందేహాలను నివృత్తి చేశారు.

ఆ తర్వాత అమ్మ తను ఇచ్చిన హామీ మేరకు చందోలుశాస్త్రి గారికి ఏలోటూ రానీయలేదు. అయితే శాస్త్రి గారికి ఒకానొక సమయంలో ఒక వింత కోరిక కలిగింది.. ఇలా మహనీయులు, ఆత్మసాక్షాత్కారం పొందిన యోగులకు కూడ అలాంటి సంకల్పాలు వస్తాయా అంటే అవి గూడ ఏదో ఒక మహత్తర కారణార్థమై ఈశ్వరుడే కలిపిస్తాడు. స్వామి వివేకానంద ఆత్మ సాక్షాత్కారం పొందాక దేశమంతా ఊరు, పేరు లేని (unknown) సన్యాసిగా పర్యటించారు. ఆకాలంలో ఆయన ఉత్తర ప్రదేశ్‌లోని హిమాలయాల్లో ఒక హఠయోగిని కలిశారు. ఆ హఠయోగి ద్వార హఠయోగం గొప్పతనం గ్రహించి, తానుకూడ హఠయోగం నేర్చుకొంటానని తన పర్యటన తాత్కాలికంగా ఆపి ఆ యోగి ఆశ్రమంలో హఠయోగం నేర్చుకోవటం ప్రారంభించాడు. అలా రెండు మూడు రోజులు గడిచాయో లేదో శ్రీ రామకృష్ణ గురుదేవులు స్వామి వివేకానందకు సాక్షాత్కరించి వివేకానందను హఠయోగం నేర్చుకోవద్దని, ఆప్రయత్నం ఆపేయమని ఆదేశిస్తారు. గురువు మాట ధిక్కరించని స్వామీజి ఆ ప్రయత్నం విరమించుకొని తిరిగి తన పర్యటన కొనసాగిస్తాడు.

అదే మాదిరిగా చందోలుశాస్త్రి గారికి కూడ ఒకానొక సందర్భంగా తనకు కూడ 'జన వశీకరణం' చేసుకొనే శక్తి లభిస్తే బాగుంటుందనిపించింది. 'మయూర శిఖి' అనే ఔషధం నిచ్చే మొక్కను సాధించటం ద్వారా దీనిని సాధించవచ్చు. ఇది గ్రహణ కాలంలో ఏర్పడే చీకట్లో నెమలి రంగులతో మెరుస్తుందని చందోలుశాస్త్రి గారు గ్రహించారు. దానిని ఎలాగైనా సాధించాలని తాడికొండ సమీపంలోని లాము కొండపై వెతికారు పగటిపూట. అక్కడ 'మయూర శిఖి'ని గుర్తించారు. ఇప్పుడు కావలసినదెల్లా చంద్రగహణ సమయం. ఆ సమయంలో చంద్రుడు

గ్రహణాంతర్గతమైనప్పుడు ఈ 'మయూర శిఖి'ని ధరిస్తే తనకు జనవశీకరణ వశమవుతుందని గ్రహణం కోసం వేచి ఉన్నారు. ఒక నాడు అది రానే వచ్చింది. ఆ రాత్రికొండ మీదకు ఒక్కరే వెళ్లి తగిన సమయం కోసం నిరీక్షించారు. చంద్రబింబం మాయం కాగానే 'మయూర శిఖి' ఒక్కసారిగా వెలుగు లీనింది. దానిని మంత్ర సహితముగా స్వీకరించడానికి ముందుకు అడుగులు వేశారు. సరిగ్గా అదే సమయానికి అక్కడికి ఒక పొట్టివ్యక్తి వచ్చాడు. అతనికి దత్తాత్రేయుడికి ఉన్నట్లు మూడు తలలున్నాయి. 'ఈ ఓషధినాది. నువ్వు తీసుకోవటానికి వీల్లేదు' అని తగులాటకు దిగాడు చందోలుశాస్త్రి గారితో. ఎలాగైనా ఆ 'మయూర శిఖి'ని సొంతం చేసుకోవాలని శాస్త్రి గారు ప్రయత్నించసాగారు. ఆ పొట్టివాడు దానిని శాస్త్రి పరం చేయడానికి అంగీకరించట్లేదు. శాస్త్రి గారి పట్టుదలని గ్రహించిన ఆ వ్యక్తి "అబ్బాయి! నీవు కోరే వశీకరణశక్తి ఈ ముఖానికి సహజంగానే ఉంది. నీకు దేవతలు గూడ వశమే" అన్నాడు. అప్పటికి గ్రహణం తొలగింది. వెన్నెల వచ్చింది. మయూర శిఖి వెలుగు మాయమైపోయింది. ఆ మూడు తలల పొట్టి వ్యక్తి కూడ అదృశ్యమైపోయాడు. అప్పుడు గుర్తు వచ్చింది చందోలుశాస్త్రి గారికి – 'మయూరశిఖి' కి అధిపతి దత్తాత్రేయుడు అని. ఆ తర్వాత శాస్త్రి గారు మరెప్పుడు 'జనవశీకరణ' గురించి ఆలోచించలేదు.

(ఋషిపీఠం మాసపత్రిక ఫిబ్రవరి 2023)

(3వ భాగం)

చందోలుశాస్త్రిగారికి శ్రీ కృష్ణార్జున సంవాద అనుభవం :

భగవద్గీతలో శ్రీ కృష్ణుడు తనకు అర్జునుని పూర్వ జన్మలు తెలుసని, కాని అర్జుననకు ఆతని పూర్వ జన్మలు తెలిసే అవకాశం లేదని చెబుతాడు. అలాగే చందోలుశాస్త్రిగారికి ఆయన పూర్వ జన్మ వృత్తాంతం తెలిపే ఘట్టం ఒకటి జరిగింది వారి జీవితంలో.

ఈ ఘటన చందోలుశాస్త్రి గారు ముదిగొండ నాగలింగశాస్త్రి గారి వద్ద ఉంటున్నప్పుడు జరిగింది. ఒకసారి తాడికొండకు ఒక యోగి వచ్చారు. ఆయన ఊరు బయట ఉన్న చెరువు ఒడ్డున ఒక జింక చర్మం పరచుకొని, దానిపై ఆసీనులై తపస్సులో మునిగిపోయారు. ఆ విషయం ఆనోట ఆనోట ఊరంతా వ్యాపించింది. గ్రామస్థులు వస్తున్నారు, చూస్తున్నారు, పోతున్నారు. కాని, ఆ యోగి కళ్ళు తెరవటంలేదు, ఎవ్వరితో మాట్లాడటంలేదు. ఆఖరికి ఈ వార్త ముదిగొండ నాగలింగశాస్త్రి గారికి కూడా చేరింది. ఆయన కూడ వెళ్ళి ఆ యోగిని దర్శించివచ్చారు. ఆయన సలహా మేరకు చందోలుశాస్త్రి గారు కూడ ఆ యోగిని దర్శించడానికి, సాయం సంధ్యా వందన సమర్పణకు వీరు చెరువు వద్దకు వెళ్ళారు. యోగి వీరి రాకను గమనించారు. వెంటనే లేచి తన ఆసనం అయిన జింక చర్మాన్ని చుట్టచుట్టి చంకలో పెట్టుకొని, చందోలుశాస్త్రి వద్దకు వచ్చారు. శాస్త్రి గారి వైపు చూస్తూ, 'నేను నీ కోసమే వచ్చాను' అని అన్నాడు. ఒక్కసారి యోగి అలాఅనే సరిగి చందోలుశాస్త్రి గారు విస్తుపోయారు.

'నన్ను కలవటం కోసం మీరు రావటమేమిటి? నేను మిమ్మల్ని గతంలో ఎప్పుడు చూడలేదే' అని ఆ యోగితో అన్నారు చందోలుశాస్త్రి. "నేను నీకు తెలియదు. కాని నీవు నాకు బాగా తెలుసు. పూర్వజన్మలో ఇద్దరం ఒకే కొండ మీద తపస్సు ఆచరించాం. ప్రారబ్ధవశాత్తు నీవు యోగభ్రష్టుడవై ఇలా జన్మించావు" అని బదులు ఇచ్చారు ఆ యోగి.

అయితే 'ఇప్పుడెందుకు ఇలా వచ్చారు?' అని మళ్ళీ ప్రశ్నించారు శాస్త్రి గారు. 'నీకో సంగతి చెప్పాలని వచ్చాను' అన్నారు ఆ యోగి. 'ఏమిటది?' అని ఆత్రుతగా అడిగారు చందోలుశాస్త్రి గారు. ఆ సందర్భంగా

శ్రీకృష్ణుడు అర్జునుడికి గీతలో ఉపదేశించినట్లుగా 'ప్రపంచ స్వభావం ఎలా నశించేతత్వం కలిగి ఉన్నదో, సుఖ, దు:ఖాలు ఏ భ్రాంతి వలన ఏర్పడుతున్నాయో, రాగద్వేషాలకు, భౌతిక సుఖాలకు వెంపర్లాడకుండా ఎలా ముందుకు సాగాలో' వివరించి తిరుగు ప్రయాణమయ్యారు ఆ యోగి.

చందోలుశాస్త్రి గారు తనకు ఇటీవల వివాహం అయిన సంగతి విస్మరించి, ఆ యోగి ఉపదేశాలకు మరింత వైరాగియై తనను కూడ యోగి వెంట తీసుకెళ్ళమని కోరారు. తొలినుంచి ఏ యోగభ్రష్టత్వం వలన చందోలుశాస్త్రి గారికి ఈ జన్మ ప్రాప్తమైందో వివరించిన ఆ యోగి, తన ప్రారబ్ధాన్ని పూర్తిగా అనుభవించాకనే తను రాగలడని, అంతవరకు చందోలుశాస్త్రి గారికి మరో మార్గమేది లేదని తెలిపి వెళ్ళిపోయారు. అయితే, తిరిగి 50 సంవత్సరముల తర్వాత వస్తానన్న మాట మాత్రం ఒకటి శాస్త్రి గారి చెవిన పడేసి ఎంచక్కా వచ్చిన ద్రోవనే వెళ్ళి అంతర్ధానమయ్యారు' అన్నట్లే ఆ యోగి 50 సం॥ల తర్వాత మరోసారి చందోలుశాస్త్రి గారికి దర్శనమిచ్చాడు. అది కూడ ఒకానొక ప్రాణ గండ పరిస్థితిలో. ఒకనాడు శాస్త్రి గారు యోగాభ్యాసం చేసి ప్రాణం కుంభించి ఉండగా, హఠాత్తుగా వారి శరీరం గాలిలోకి లేచింది. అలా లేచి పైకప్పు దాకా వెళ్ళి దానిని ఢీకొట్టి తల్లక్రిందులై తిరిగి భూమిపైకి వస్తున్నది. ఇప్పుడు శాస్త్రి గారి శిరస్సు నేలతాకితే ఇంకేమైనా ఉందా? హఠాత్తుగా ఆ యోగి అక్కడ ప్రత్యక్షమై చందోలుశాస్త్రి గారి తల నేలతాకకుండా తన రెండు అరచేతులను అడ్డుపెట్టి వారికి ప్రాణగండం లేకుండా చూశారు. ఆ తర్వాత ఆ యోగి అదృశ్యమైనారు.

చందోలు పునరాగమనం – సంసార గ్రహణాలు :

భూమి గుండ్రంగా ఉందని చందోలుశాస్త్రి గారి విషయంలో మరోసారి నిరూపితమైంది. తాడికొండ నుండి శాస్త్రి గారు తిరిగి చందోలు చేరారు. అక్కడ అప్పటికే ఒక వేద పాఠశాల వారి తండ్రి గారి ఆధ్వర్యంలో నడిచేది. దానిలో చదివే శిష్యులకు, వచ్చిపోయే అతిథి, అభ్యాగతికి భోజనాలు పెడ్తూ వాళ్ళ ఆస్తులు ఒక్కొక్కటిగా హరించుకుపోయిన సంగతి అప్పటికి గాని చందోలు శాస్త్రి గారికి బోధపడలేదు. పైగా తండ్రి గారు వ్యాధిగ్రస్తులై అవసానదశకు చేరారు. అప్పులు అవటం ఆరంభమయినాయి. ఐశ్వర్యం రావటం మొదలైతే ఎలా కుప్పలు తెప్పలుగా వర్షిస్తుందో, అప్పులు, దారిద్ర్యం జంట కవుల్లా పోటీ పడ్తూ వస్తాయి అలాగే. కొంత కాలానికి తాడేపల్లి వెంకటప్పయ్య శాస్త్రి గారు పరమపదించారు. వారు రాసిన రామాయణ మహాకావ్యం కేవలం 'బాల కాండం' వరకే అచ్చయింది. అందుకోసం చందాదారులు ఇచ్చిన చందా ధనం అంతా ఖర్చు అయిపోయింది. ఇంకా అచ్చు కావలసింది చాలా ఉంది. కాని ధనాభావంతో అది ఆగిపోయేలా ఉంది. పైగా చందోలుశాస్త్రి గారు తన తండ్రి తుది శ్వాస విడిచేప్పుడు వారికి మాట ఇచ్చారు – 'చందాదారుల చందాలకు న్యాయం చేస్తానని' – వారితో తండ్రి గారికి మాట రానివ్వనని.

దేవీ సాక్షాత్కారం పొందిన వారికి ఇలాంటి పరీక్షలు ఎదురు కాకపోతే వారి తపశ్శక్తి లోకానికి వెల్లడయ్యేది ఎలా? పైగా 'చిన్నమ్మ' తనకు తిండికి, రాకపోకలకు, ఖర్చులకు ఇబ్బంది రాకుండా చూస్తానని హామీ కూడా ఇచ్చింది. తానుగా ఈ పరీక్షను ఎదుర్కోవడానికి తన వద్దనున్న ఏవైన మార్గం అమ్మని ప్రార్థించటమే. అందుకు కొంచెం కఠినమైన మార్గం ఎంచుకొన్నారు చందోలుశాస్త్రి గారు.

'చిన్నమ్మ' నామం జపించారు. ఆమెకు అభిషేకం చేశారు. 'నీరే' నైవేద్యం పెట్టారు. రోజుకు 27 పర్యాయాలు సహస్రనామ పూజలు జరిపారు. ఏం చేస్తే 'చిన్నమ్మ' వస్తుందో చందోలుశాస్త్రి గారికి బాగా తెలిసినట్టుంది. అమ్మ రానేవచ్చింది చందోలుశాస్త్రి కలలోకి. "ఒరే ముష్టి పెడ్తాను పట్టు" అంటూ పిడికిడితో బంగారు వడ్ల గింజలు వారి పైపంచెలోకి వేసింది. అంతేగాక "రేపటి ఉదయం నీ కోసం బండి వస్తుంది. కాదనకుండా బండిలో వెళ్ళు" అని శాస్త్రి గారిని ఆజ్ఞాపించింది. ఆ మర్నాడు 'చిన్నమ్మ' చెప్పినట్లు ప్రొద్దున్నే ఖాజీపాలెం నుండి ఆ ప్రాంతం రాజులు పంపిన బండి వచ్చింది. సీతారామరాజు అనే ధనికుడు ఓ బండి పంపారు. అమ్మ ఆదేశం ప్రకారం ఆ బండిలో వెళ్ళారు. ఖాజీపాలెంలో బండి దిగారు. వందలమంది రాజులు కట్టకట్టుకొని శాస్త్రి గారికి ఎదురొచ్చారు. ఘనంగా స్వాగతం పలికి సాదరంగా ఊర్లోకి తీసుకెళ్ళారు.

ఆ రోజున శాస్త్రిగారికి రాచ మర్యాదలు చేశారు. తమకు పురాణం చెప్పమని రాజులు కోరగా శాస్త్రిగారు ఆనందంగా అంగీకరించారు. తన చేత్తో వండుకొన్న వంటతోనే శాస్త్రి గారు భోజనం చేసేవారు అక్కడున్నన్ని రోజులు. వారి మన్ననలు పొందాక తిరిగి బండిలో చందోలుశాస్త్రి గారు చందోలు చేరారు. ఇంటి ముందు బండి దిగి తలుపు నెట్టబోతే అది కదలటంలేదు. ఆయన వచ్చిన వినికిడి విని శాస్త్రి గారి తల్లి హనుమాయమ్మ, 'అక్కడ ధాన్యం అడ్డు ఉంది. వెళ్ళడానికి వీలుకాదు. ఖాజీపాలెం నుండి నువ్వు పంపిన ధాన్యం అక్కడ పోయించడంతో తలుపుకు అడ్డమైంది' అని అంది. ఆ విషయం తెలిసి ఆశ్చర్యపోవటం చందోలుశాస్త్రి గారి వంతైంది. అంటే ఖాజీపాలెం రాజులు తమకు సాలుకు

ఎంత ధాన్యం అవసరమో అంత ధాన్యం పంపించారు అన్నమాట. ఆ తర్వాత చందోలుశాస్త్రి గారి జీవితంలో ఎప్పుడూ ధాన్యం తరగలేదు. అతిథి, అభ్యాగతే గాక వేద పాఠశాల ఖర్చులు, విద్యార్థుల కనీస అవసరాలు, భోజనాలు అంతా 'చిన్నమ్మ'నే చూసుకొంది వేటికీ లోపం లేకుండా.

ఈ కాలంలో చందోలుశాస్త్రి గారికి తన 'చిన్నమ్మ' బాలతో అనేక విషయాలపై సంవాదాలు జరుగుతుండేవి. వాటి గురించి ఆయన సన్నిహితులలో ఎవరికి తెలుసునో, తెలియదో గాని పరమాచార్య చంద్రశేఖర సరస్వతి స్వామి వారికి క్షుణ్ణంగా తెలుసు. చందోలుశాస్త్రి గారు పరమాచార్యను కలిసినప్పుడు స్వామి స్వయంగా ఆ సంవాదాల గురించి అడిగి చెప్పించుకొనేవారు.

పోతన, జయదేవుల అనుభవం చందోలుశాస్త్రి గారికి కూడ :

పోతనామాత్యుని గారి భాగవత రచన సమయంలో ఒకానొక ఘట్టంలో ఆయన ఘంటం ఆగిపోతే, రాముల వారే స్వయంగా వచ్చి పోతన రూపంలో ఆపద్యం పూరించినట్టు విన్నాం. అలాగే జయదేవుడి అష్టపదుల రచనప్పుడు ఆ శ్రీకృష్ణుడే వచ్చి ఆచరణం పూరించినట్టూ విన్నాం. ఈ రెండు అనుభవాలు లాంటిదే ఒక అనుభవం చందోలుశాస్త్రి గారికీ జరిగింది.

తన తండ్రి గారు వెంకటప్పయ్యశాస్త్రి గారు రాసిన రామాయణానికి ఉత్తరకాండ చందోలుశాస్త్రి గారు రాశారు. స్వయంగా మహాపండితుడు, బ్రహ్మజ్ఞాని అయి చందోలుశాస్త్రి గారు ఉత్తర కాండ రాయటం మొదలు పెడితే అడ్డం ఏముంది ఆయన ఘంటానికి. అయితే ఈశ్వర సంకల్పం మరోలా ఉంది. ఒకానొక ఘట్టానికి రాగానే చందోలుశాస్త్రి గారి ఘంటం

ఆగిపోయింది. ఆ సందర్భానికి రావలసిన ఒక పద్యధార ఆగిపోయింది. అదే విషయమై ఆలోచిస్తూ వారు మగత నిద్రలోకి జారుకొన్నారు. ఆ నిద్రలో ఒక కలలా ఒక దృశ్యం ఆయన మన: ఫలకంపై ఆవిష్కారం కాసాగింది. వాళ్ళ ఇంటి అరుగు మీద చాలా ముదిమి వయస్సున్న ఒక ముస్లిం మహిళ కూర్చుని ఉన్నది. ఆమె దగ్గర ఒక ముస్లిం వృద్ధుడు ఆవిడిచ్చిన పాలు త్రాగుతున్నాడు. చందోలుశాస్త్రి గారు ఈ ఇద్దరినీ అలానే చూస్తుండిపోయారు. అప్పుడు ఆముసలిది కావాలంటే 'నీకూ పాలు పోస్తాను' త్రాగుతావా?' అని అడిగింది. అందుకు చందోలుశాస్త్రి గారు కూడా అంగీకారంగా తలూపి ఆమె వద్దకు వెళ్ళారు. ఆమె వారి చేతిలోకి పాలుపోసింది. అవి తాగారు శాస్త్రి గారు. అవి ఆయన గ్రుక్క కూడ తడపలేదు. 'మరీ ఇంత తక్కువ పోస్తే ఎలా, గ్రుక్క తడవలేదు' అని అన్నారు శాస్త్రి గారు ఆ ముదుసలి ముస్లిం యువతితో. వెంటనే ఆమె తడుముకోకుండా 'నువ్వు రాసే కంద పద్యాలకు ఇవి చాలు' అని చెప్పి అదృశ్యమైంది. అంతే శాస్త్రి గారికి చటుక్కున మెళుకువ వచ్చింది. వెంటనే మనస్సులో రాయవలసిన కంద పద్యం ధారలా ప్రవహించింది. 'భర్మమయ రమ్య హర్మ్యము లర్మివిప్రియురాలిగూడి' అని ఆ పద్యాన్ని రచించారు చందోలుశాస్త్రి గారు. అలాగే 'చిన్నమ్మ'కు తన ఆవ్యాజ ప్రేమ పుష్పాన్ని ఈ పద్యం రూపంలో అందించారు.

ఎగబడి త్రాగు కావలసెనేనని త్రాగుచు పాలు లేవ్వపూ
ర్తిగ నొక గ్రుక్కకేననిన బ్రీతి మెయింగని, కందపద్దె, మ ।
ల్లగ నవి చాలు పొమ్మని అలక్షితయై స్వకవిత్వధార, సా
ధ్విగ బెను పొందజేసిన సతిన్ యవనిన్ దలతున్ తదాప్తికిన్ ॥

ఇలా చందోలుశాస్త్రి గారి యోగ జీవితం ఒక పరిపూర్ణస్థాయికి ఎదిగింది. ఇందులో భాగంగానే అనేకసార్లు ఆ పరాభట్టారిక వారిని ఎన్నో పరీక్షలకు గురి చేసింది. అనుక్షణం ఆపరాభట్టారిక ఆయన్ను వెంటాడే ఉందన్నది ఈ పరీక్షల వలన తేటతెల్లం అవుతుంది. ముఖ్యంగా కాంత, కనక వ్యామోహం చందోలుశాస్త్రి గారి దరిచేరకుండా చూడాలన్నదే ఆ జగన్మాత సంకల్పం. తానే భూమి పైకి పంపినందుకు చందోలుశాస్త్రి తన వేలు వదలకుండా అనుక్షణం తన స్మరణలో జీవితం గడిపేలా 'చిన్నమ్మ' అని జాగ్రత్తలు తీసుకొంది. తొలుత జగన్మాతను 'బాల'గా, 'చిన్నమ్మ'గా భావించిన చందోలుశాస్త్రి గారు తన జీవన అంతిమ భాగంలో లలితా పరాభట్టారికగా అర్చించారు. శాస్త్రి గారు 'అగ్ని పరీక్ష'లు ఎదుర్కొంటూనే మరోవైపు తన యోగ వైభవాన్ని కూడ లోకానికి చాటారు. శ్రీ రామకృష్ణ పరమహంసను కూడా యోగిని పరబ్రహ్మణి ఎన్నో కఠిన పరీక్షలకు గురిచేసింది. పరమ యోగులకు ఇవి తప్పనిసరి పరీక్షలు.

చీడ, పీడలు సోకిన వారికి, 'అమ్మవారు' సోకిన వారికి, భూతప్రేత పిశాచాల బారిన పడ్డ బాధితులను తన యోగశక్తితో ఉపశమనం కల్గించిన ఘట్టాలు ఎన్నో. అన్నింటా చందోలుశాస్త్రి గారికి ముల్లోక దేవతలతో సంబంధాలుండేవన్నట్లు సాగింది ఆయన యోగ వైభవం. అవన్నీ చిన్న చిన్న ఘటనలే. సాధారణ యోగులు జీవితంలో అత్యంత సామాన్యంగా తారసిల్లేవే. ఈ యోగ యాత్రలో శాస్త్రి గారు 'దత్తాత్రేయ భాగవతం', 'మత్స్యప్నం', 'దత్తాత్రేయాష్టక గర్భిత ఆత్మ సుప్రభాతం' వంటి రచనలు చేశారు. అలాగే గతంలో చెప్పినట్లు ఆయన ఆది శంకరుని స్తోత్రాల కన్నింటికీ తాత్పర్య వ్యాఖ్యానములు రాశారు. ఆ వ్యాఖ్యానాలలో కొన్ని చాలా అద్భుత రహస్యాలను ఆవిష్కరిస్తాయి.

ఇక్కడ ఒక ఉదాహరణగా ఆయన శ్రీ లలితా త్రిశతి భాష్యం (శంకర గ్రంథ రత్నావళి: ద్వాదశ సంపుటం)లో 'హ్రీం' బీజమునకు ఇచ్చిన వ్యాఖ్యానము చెప్పుకోదగ్గది. "హ్రీం" బీజము నుండి 'హ్రీ' యనెడి శక్తి యుద్భవించినది. 'హ్రీశ్చతే లక్ష్మీశ్చపత్న్యౌ' యనుచు, పురుష సూక్తము, ఆ శక్తిని, పరబ్రహ్మ నిత్యానపాయినిగా చెప్పుచున్నది. 'హ్రీ'లో నున్న పురుష బీజముతో 'హర' యైన దనియు, స్త్రీ బీజముతో 'హరి' యైనదనియు, 'ఈం' కారముతో శక్తి బీజమై 'హీం' అయినదనియు సాంప్రదాయ వేత్తల అనుభవము' అని వివరించారు చందోలుశాస్త్రి గారు.

వేదములలోని 'హ్రాఙ్' ధాతువును వ్యారణము వదించినది గాని, స్వయముగ సృష్టించలేదు. 'హ్రీం' కారేశ్వరియైన లలితా త్రిపురసుందరియే, కార్యాకారణ భేదముల ననుసరించి లలిత, చండిక, దుర్గ మొదలగు ననేక శక్తి రూపములను ధరించినను, చిద్రూపమును విడిచి యుండలేదు. ఈ సత్యమును తెలిసికొనుడనియే శ్రీ ఆదిశంకరుల యుపదేశము. శక్త్యుపాసన, జ్ఞాన పర్యవసాయి యనియే శ్రీ శంకరుల అభిమతము" అని ముక్తాయించారు శాస్త్రి గారు.

ఇటువంటి వ్యాఖ్యానములు చందోలుశాస్త్రి గారి లాంటి యోగులకే చెల్లుతుంది. అలానే వారు స్వయంగా రాసిన "దత్తాత్రేయాష్టక గర్భిత ఆత్మ సుప్రభాతము"లో కూడ వ్యాఖ్యానం చాలా లోతుగా ఉంటుంది. దాన్లో గాయత్రి మంత్ర అర్థం శాస్త్రి గారు ఎలా ఇమడ్చారో చదివితే ఒకరకమైన అద్భుత ఆధ్యాత్మిక అనుభూతి కలగక మానదు.

సావత్సరోరజసి తత్స వితుర్వరేణ్యం
దేవస్య ధీమహి మహామతి చోదకస్య
గాయత్ర మర్థమితి భావయతో దురంతా
సాంతానిశాప్రవిరళా మమ సుప్రభాతమ్.

చందోలుశాస్త్రి గారు దాదాపు 94 సంవత్సరాలు జీవించారు.

కంచి పరమాచార్య చంద్రశేఖర సరస్వతి స్వామి వారికి ఆత్మీయులైనారు. "జన్మత:, మనసా, వాచా, కర్మణా ఏ దోషంలేని వాడు చందోలుశాస్త్రి' అని కంచి పరమస్వామి వ్యాఖ్యానించారంటే అర్థం చేసికోవచ్చు చందోలుశాస్త్రి గారు ఎటువంటి ఆదర్శ యోగిపుంగవులో. భారతంలో భీష్మా చార్యులుగా, తన వారంతా తన కళ్ళముందే గతించాక చందోలుశాస్త్రి గారు తన జీవన్ముక్తికి సన్నద్ధమైనారు. డిశెంబరు 10, 1990న ఆయన తానెంచుకొన్న ముహూర్తంలో స్వచ్ఛందంగా ప్రాణ త్యాగం జేశారు. అందుకు మూడు రోజులు ముందునుంచే ఆయన ప్రాయోపవేశం చేశారు. కటిక ఉపవాసం, మంచినీరు కూడ స్వీకరించకుండా, ఎవ్వరి వాదనలు లేని ప్రశాంత నిశ్శబ్ద రాత్రి తులసి నీరు నోట్లో వేస్తుండగా కంచి పరమస్వామి పంపిన పవిత్ర వస్త్రమును వారి దేహంపై కప్పగా వారు దేహత్యాగం చేశారు.

తాడేపల్లి రాఘవనారాయణశాస్త్రి గారు కలియుగంలో 20వ శతాబ్దంలో కూడ భగవంతుడున్నాడు, సాక్షాత్కారిస్తాడు అని నిరూపించిన యోగి పుంగవులు. వారి జీవితమే నాస్తికులకు, ఆస్తికులకు భగవంతుడి పట్ల విశ్వాసం పాదు కొలుపుతుందనటంలో సందేహంలేదు.

(ఈ జీవిత సంగ్రహంలో కొన్ని భాగాలను శ్రీ మేళ్ళ చెరువు వేంకట సుబ్రహ్మణ్యశాస్త్రి గారి తెలుగు సేతనుంచి స్వీకరించాను. అందుకు వారికి ఈ పత్రికా ముఖంగా కృతజ్ఞతలు తెలుపుతున్నాను. కొన్ని వివరాలు చందోలు దర్శించి సేకరించాను. శాస్త్రి గారి కుటుంబీకులకు ఈ రచయిత ధన్యవాదాలు.)

(ఋషిపీఠం మాసపత్రిక మార్చి 2023)

4
చందోలు శాస్త్రి గారి అంతేవాసి - మేళ్ళచెరువు సుబ్రహ్మణ్యశాస్త్రి

'చందోలు శాస్త్రి' గారు అన్నపేరు తరుచూ చాగంటి వారి ప్రవచనాలలో, గరికపాటివారి ప్రసంగాలలో వినిపిస్తూంటుంది. కాని 'చందోలు శాస్త్రి' (తాడేపల్లి రాఘవ నారాయణశాస్త్రి) గారి గురించి సవివరంగా ఎవ్వరికీ తెలియదు. చాలామంది తెలుసుకునే ప్రయత్నం కూడ చేయరు. చందోలు శాస్త్రి గారింట్లో శారదాదేవి 'బాల'గా నడయాడుతుండేది. శాస్త్రి గారు అడపాదడపా శారదామాతయిన 'బాల'తో సంవాదాలు జరుపుతుండేవారని మాత్రం ఈ ప్రసంగాల వలన శ్రోతలకు అర్థమయి ఉండవచ్చు. కాని 'చందోలు శాస్త్రి' గారు అంటే 'ఒక మహర్షి' అని చాలా మందికి తెలియదు. వారి తండ్రిగారు కూడా ఒక మహర్షే. బాపట్ల – రేపల్లె మార్గంలో ఉండే చందోలు కుగ్రామంలో వారి నివాసం ఉండేది. ప్రస్తుతం కూడ అక్కడే ఉంది. కొంత మంది బుద్ధిజీవులు, ఆధ్యాత్మిక సాధకులు ఈ చందోలు పుణ్యక్షేత్రం వెళ్ళి శాస్త్రిగారి ఇంటినీ, శారదా మాత 'బాల'గా నడయాడిన ఆ పవిత్ర స్థలాన్ని సందర్శించి వస్తుంటారు. అయినా వారందరికీ చందోలు శాస్త్రి గారి గురించి సవివరంగా తెలుసుననుకోవటానికి వీలులేదు. ఈ కారణంగానే చందోలు మహర్షి గురించిన సమగ్ర జీవిత చరిత్ర ఎవరైనా గ్రంథస్థం చేశారా అని శోధిస్తే వినపడే ఒకే ఒక్కపేరు మేళ్ళచెరువు సుబ్రహ్మణ్యశాస్త్రి గారు. ప్రస్తుతం 70 సం॥లు పైనే ఉంటాయి. ధర్మపత్నీ సమేతంగా తెనాలిలో

సేద తీరుతూ వీలున్నప్పుడల్లా అద్భుత సంస్కృత రచనలు చేస్తుంటారు.

ఈ మేళ్ళచెరువు సుబ్రహ్మణ్యశాస్త్రి గారు స్వయాన శ్రీ 'చందోలు శాస్త్రి' గారికి శిష్యుడు. అంతేగాదు. చందోలు శాస్త్రి గారు తన సోదరుడి కుమార్తె అయిన అనసూయమ్మ గారిని దత్తు తీసుకొని, తన శిష్యుడికి సంస్కృతాంధ్రాలలో విద్య గరిపి, వారికిచ్చి వివాహం జరిపించారు. మేళ్ళ చెరువు సుబ్రహ్మణ్యశాస్త్రి గారు వివాహనంతరం ఉద్యోగార్థియై ఒంగోలులోని శ్రీ తాడేపల్లి రాఘవనారాయణశాస్త్రి సంస్కృత కళాశాలలో సంస్కృత అధ్యాపకుడిగా చేరి పిల్లలకు గురుకుల ప్రమాణస్థాయిలో సంస్కృత విద్యను బోధించేవారు. దాదాపు 35 వసంతాలు వేర్వేరు సంస్కృత కళాశాలలో సంస్కృత విద్యగరిపిన ఈ మేళ్ళచెరువు సుబ్రహ్మణ్యశాస్త్రి గారు సుమారు 150 పైగా గ్రంథాలను రచించారు. అందులో మొట్టమొదటి గ్రంథం 'శ్రీగురుచరిత'. సంస్కృత పద్యాలలో తన గురువుగారు చందోలుశాస్త్రి గారి ఆధ్యాత్మిక జీవితాన్ని గ్రంథస్థం చేశారు. ఇది ప్రప్రథమంగా 1991లో అచ్చయింది. పుస్తకం కవరుపేజీపై గురు దంపతుల చిత్రంతో అచ్చయిన ఈ పుస్తకం ఆ సొంతం తెలుగు లిపిలోనే ఉంటుంది.

తయోర్గు ర్వోశ్చూ డాకవితశశిరేఖ భరణయో:
నమో వాకదన్యత్కిమపి చరితుల నాస్మినిపుణ:

అని గురుదంపతుల చిత్రం క్రింద అత్యంత భక్తి, వినయ, నిరాడంబరతతో నిండిన పై పంక్తులను ఒక కుసుమంగా సమర్పిస్తారు మేళ్ళచెరువు సుబ్రహ్మణ్యశాస్త్రి గారు. అంతేగాదు, తాను రాసిన ఈ శ్రీగురుచరిత కావ్యశైలికి చందోలుశాస్త్రి గారు రాసిన 'దత్తాత్రేయాష్టక గర్భిత ఆత్మ సుప్రభాతము, మత్స్వప్న:' అన్న చిరు కావ్యము ప్రేరణ అని

ఆత్మ నివేదనములో చెప్పుకొన్నారు. వారి మాటల్లో చందోలు శాస్త్రి గారు రాసిన ఈ ఆత్మ సుప్రభాత శ్లోకమే వారి కావ్యానికి జీవగఱ్ఱ!

"సావత్పరోరజిసి తత్స వితుర్వరేణ్యం
దేవస్యధీమహి మహామతి చోదకస్య,
గాయత్రమర్థమితి భావయతోదురంతా
సాంతానిశాం ప్రవిరలా మమ సుప్రభాతమ్"

దీని అర్థం తెలిస్తే మేళ్ళచెరువు గారికి శ్రీగురుచరిత కావ్యంలోని అనేక ఆధ్యాత్మిక కిటుకులు అవలీలగా బోధపడతాయి. అంతేగాదు. గట్టిలక్ష్మి నరసింహశాస్త్రి గారు 'అగ్ని పరీక్ష' అనే ఒక చిరు నవలను వ్రాశారు. ఆ నవల చదవగానే మేళ్ళచెరువు గారికి తానూ ఒక కావ్యం సంస్కృతంలో గురువుపై ఏలరాయ కూడదనే సంకల్పం కలిగింది. అదే గురువు అను గ్రహం కల్గిన మధురక్షణం. శ్రీహర్షుడు రాసిన కావ్యాలకు ఏవిధంగా ఆయన గురువే సర్వస్వం అయినట్లు మేళ్ళచెరువు వారు కూడ అదే మార్గమును అనుసరించే సాహసం చేశారు. 'మహతాం సంస్తవపద గౌరవాయ'ని జ్ఞప్తి చేసుకొంటూ, 'నానృషి: కురుతే కావ్యం, నా శివశ్శివమర్చయేత్' అని తన గురువు ఘనతను సార్థకం చేశారు మేళ్ళచెరువు సుబ్రహ్మణ్యశాస్త్రి గారు. చివరగా 'చక్రాంకితాం భోజయుగం సృజంతి పాద ప్రభా సద్గురు రాఘవస్య' అంటూ సువర్ణమంత్ర పుష్పాలు సమర్పించారు శాస్త్రి గారు.

అంతేగాదు క్రీ.శ. 2005లో 'పితాపుత్ర కవీశ్వరులు – చందోలు మహర్షులు' అనే చిరు జీవిత చరిత్రను సులభమైన రీతిలో తెలుగులో అచ్చువేశారు. దాదాపుగా 'చందోలుశాస్త్రి' గారి గురించి చాగంటివారు ప్రవచించే మాటల్లో కథలు, దానిలోని ఆధ్యాత్మిక అంశాలు, శ్రీ గరికపాటి

నరసింహరావు గారు ప్రసంగవశాత్తు ప్రశంసల వర్షం కురిపించే పదబంధాలు అన్నీ ఈ గ్రంథం నుంచి వచ్చేవే. కాని కారణం ఏమయినా ఈ ప్రవచనకారులు మేళ్ళచెరువు సుబ్రహ్మణ్యశాస్త్రి గారు గ్రంథస్థం చేసిన 'శ్రీగురుచరిత' ని గాని, 'పితాపుత్ర కనీశ్వరులు – చందోలు మహర్షులు' పుస్తకాన్ని గాని తాము ఉటంకిస్తున్న సంఘటనలకు ప్రమాణంగా పేర్కొనరు. ఈ కారణంగా మేళ్ళచెరువు సుబ్రహ్మణ్యశాస్త్రి గారు గొప్ప సంస్కృతాచార్యులు, పండితులు, విద్వాంసులైనప్పటికీ అజ్ఞాతంగానే ఉండి పోయారు. అంతేగాదు. వారు కూడ 'చందోలు శాస్త్రి' గారిలా అనేక గ్రంథాలు, అనువాదాలు చేశారు. ఆధ్యాత్మికత, సాధన విషయంలో తేడాతప్ప చందోలు శాస్త్రి గారికి, మేళ్ళచెరువు సుబ్రహ్మణ్యశాస్త్రి గారికి ఎన్నో పోలికలు కనిపిస్తాయి.

ఉదాహరణకు 'చందోలుశాస్త్రి' గారు స్వీయకవితలు, వచనంతో తెలుగులో చేసిన ఆధ్యాత్మిక ఉపదేశాలుగాక అనేక ప్రసిద్ధగ్రంథాలను టీకా తాత్పర్యంతో వివరించారు. ఇంతకు ముందే పేర్కొన్నట్లు 'దత్తాత్రేయాష్టక గర్భిత ఆత్మ సుప్రభాతం 'చందోలుశాస్త్రి' గారి స్వీయ రచనల్లో ఒకటి. ఇది తెలుగు లిపిలో సంస్కృతంలో ఉంటుంది. ఇందులో అనేక ఆధ్యాత్మిక సాధన రహస్యాలు ఇమిడి ఉన్నాయనే భావనతోనే దీన్ని ప్రామాణికంగా తీసుకొని శ్రీగురుచరిత కావ్య రచనకు మేళ్ళచెరువు వారు ఉపక్రమించారని ఇందాక చెప్పుకొన్నాంగదా! శ్రీ దక్షిణామూర్తి స్తోత్రాన్ని కూడ 'చందోలుశాస్త్రి' గారు టీకా తాత్పర్యములతో వ్యాఖ్యానించారు. అలాగే 'శ్రీ శంకర గ్రంథరత్నావళి' (ఏకాధశ సంపుటము) స్తోత్రములు అనువధించారు. ఇవి ఒక వరుసలో వారు అనువదించారు. ఈ గ్రంథాలలో అనేక ఆధ్యాత్మిక రహస్యాలు నిక్షిప్తం. మచ్చుకకు 'శ్రీలలితా

త్రిశతి' పూర్వ పీఠికనుంచి 'శ్రీలలితా త్రిశతీ' భాష్యం చదివితే తెలుస్తుంది దాని వైశిష్ట్యం ఏమిటో.

మేళ్ళచెరువు సుబ్రహ్మణ్యశాస్త్రి గారు కూడ దాదాపు గురువు గారి అడుగుజాడల్లోనే నడిచారని వారి రచనల పరంపర చూస్తే సులువుగా బోధపడుతుంది. ఒకరకంగా వాటిని పరిశీలించినా, చదివినా చందోలుశాస్త్రి గారే వారిలో ప్రవేశించి ఈ రచనలు చేయించారా అన్నంత ఆశ్చర్యంగా ఉంటుంది. వీటన్నింటిలోనూ మేళ్ళచెరువు వారి పాండితీగరిమ స్పష్టంగా ద్యోతకమవుతుంది. ఆధ్యాత్మిక గ్రంథులు కొన్నింటిని వారు పొందుపరుస్తూ రచనలు సాగించారు. కొన్నిచోట్ల వారే వివరణ ఇచ్చిన, కొన్నిచోట్ల ఏవివరణ ఇవ్వకుండానే రచనలో సాగిపోయారు. మనస్సుపెట్టి చదివిన వారికి ఈ తేడా స్పష్టంగానే అవగతమవుతుంది. ఇందుకుగాను వారు తాను రచించిన తొలికావ్యం శ్రీగురుచరితలో గుంటూరు శేషేంద్రశర్మ గారి 'షోడశి – రామాయణం – రహస్యములు' పొందుపరచిన 'స్వర్ణహంస' పుస్తకంలో గ్రంథులను విప్పటం ఎలానో తెలుసుకొని దీన్ని తన సాహిత్యంలో పొందుపరచటమే. గుంటూరే శేషేంద్రశర్మ వచనకవిగా, రచయితగా తెలుగు నాట ప్రసిద్ధి. అయితే అందరికీ (ఏ కొద్దిమందికో మాత్రమే తెలిసిన రహస్యం) తెలియనిది ఏమిటంటే వారు సంస్కృతంలో దిట్ట. ముఖ్యంగా 'స్వర్ణహంస'లో శ్రీహర్షుడి గురువుగారు ఆధ్యాత్మిక రహస్యాలను ఎలా గ్రంథుల రూపంలో నిక్షిప్తం చేశారో బయటి ప్రపంచానికి తెలియజెప్పి ఒక మహాకవి, జ్ఞాని. ఇది తెలియని వారు అనవసరంగా వారిని విమర్శిస్తుంటారు కూడ. అది ఇక్కడ అప్రస్తుతం కాబట్టి దాన్ని ఇక్కడే వదిలేస్తున్నాను. అలాగే ఎక్కిరాల కృష్ణమాచార్యులవారు రచించిన 'భాగవత రహస్య ప్రకాశం' కూడ మేళ్ళచెరువు వారి సాహితీ

వ్యవసాయాన్ని ఒక స్థాయి నుంచి మరో స్థాయికి తీసుకెళ్ళింది.

ఈ కోవలో వారు సంస్కృతంలో రాసిన కావ్యాలను తొలుత వివరిస్తాను. 'శ్రీగురుచరిత' (1991)తో ప్రారంభమైన వారి రచనా విన్యాసం – సాలభంజికా సూత్రధారం, లలితానందలహరి, స్పందలహరి, స్తన్యధారా స్తవం, వేదనాదస్తవ: , అకర్మానందలహరి, చరణారవింద షోడశీ, బందుమాలినీ స్తవ: – వంటి కావ్యాల ద్వారా ప్రాచుర్యంలోకి వచ్చాయి. 'శ్రీగురుచరిత' కావ్యం చదివిన రాణిరామకృష్ణ గారు (ప్రస్తుతం వీరిని తత్వ విదానందస్వామిగా వ్యవహరిస్తున్నారు) ఎంతో పాండిత్యం, ఆధ్యాత్మికం సమ్మిళితం అయితే గాని ఇలాంటి గ్రంథాలు మామూలు సంస్కృత పండితులు రాయలేరు అని వ్యాఖ్యానించారు. ఈ గ్రంథాల పేర్లు వింటేనే వీటిలో ఏదో క్రొత్తపద ప్రయోగాలున్నట్లు తెలుస్తుంది. చదివిన వారికి ఎంతో అద్భుత సంస్కృత ప్రయోగాలు, విన్యాసాలు స్పష్టంగా ద్యోతకమవుతాయి. అలాగే తెలుగులో కూడ వారి పాండితీ వ్యవసాయం నిరాఘాటంగా సాగింది. సామిశరణం, మదాలసజోలపాట, ఆత్మ సుప్రభాతం, అస్తిదేవం (సదసత్సంశయం), కనకధారాస్తవము (పద్యానువాదం, వ్యాఖ్య) శ్రీకృష్ణ రాసలీల – యోగత్రయీ హేల, బీజతంత్రం, అటుకులలో కిటుకులు (విమర్శనా వ్యాసం), గజేంద్ర మోక్షం – ఋషిరుణం, వామనుడు వమనము, మొదలైనవి వారి సంస్కృత సాహిత్య విన్యాసాలకు ఆధ్యాత్మిక జ్ఞానలోతులకు మచ్చుతునకలు.

ఇవి గాక తెలుగు వ్యాఖ్యానాలు చాలా ఉన్నాయి. వరాహోపనిషత్తు, శివగీత, త్రిపుర మహిమ్నఃస్తోత్రం, విజ్ఞాన భైరవం వంటివి ఎంతో నిగూఢమైన సంజ్ఞాశాస్త్రం (Semiotics) తో నిండి ఉంటాయి. వీరిలో ఈ లోతైన సాహితీ ఆధ్యాత్మిక పాండిత్యం వలననే అపర ఆదిశంకరుడు

వరాహ అవతారంగా కీర్తిగాంచిన శ్రీ బెల్లంకొండ రామరాయ కవిగారు రాసిన పలు సంక్లిష్టమైన సంస్కృత గ్రంథాలను అనువదించగలిగారు. అష్టక గుచ్ఛము, సిద్ధాంత సింధు:, రమా వల్లభరాయ శతకం, అద్వైత విజయం, వేదాంకిత నిశ్చయం, అద్వైతామృతం, భాగవత చతు:శ్లోకి, శంకరాశంకరా భాష్య విమర్శనం, సంక్షేప శారీరకం, ఆంధ్ర వేదాంతముక్తావళీ, మొదలైనవి వారి అనువాద పటిమకు, వ్యాఖ్యాన శక్తికి అద్దంపడతాయి. శ్రీ బెల్లంకొండ రామరాయకవి గారు హయగ్రీవతారం. ఆ హమనీయుడు తాను జీవించిన స్వల్పకాలంలోనే దాదాపు 141 గ్రంథాలు రచించారు. వేటికవే 'నభూతో నభవిష్యతి' అన్నట్లుండే గ్రంథాలు. సంస్కృత లిపిలో ఉన్నవాటిని అర్థంచేసికొనే పరిజ్ఞానం లేకపోతే ఇది సాధ్యంకాదు. చందోలు శాస్త్రి గారి అనుగ్రహమో, స్వీయ ఆత్మశక్తో గాని మేళ్ళచెరువు సుబ్రహ్మణ్యశాస్త్రి గారు ఈ మిక్కిలి కష్ట సాధ్యమయినదానిని సులువుగా సాధించారు. ఆ విధంగా ఆయన బెల్లంకొండ రామారావు గారి రచనల అనువాదాల ద్వారా కూడ సార్థక కవులు, పండితులు, విద్వాంసులు. ఇవిగాక 'విద్యారణ్యకృత వివరణ ప్రమేయ సంగ్రహ'నికి ఆంధ్రానువాదం చేశారు. సాధారణంగానే విద్యారణ్యుల వారి వివరణ ప్రమేయం జటిలంగా ఉంటుంది. ఇది ఆ గ్రంథాన్ని అనువదించటానికి పూనుకొన్నవారందరికి అనుభవైక వేద్యము. అలాంటి దాన్ని తెలుగులో అనువాదం చేయటం ఎంతో సాహసంతో కూడినపని. మేళ్ళచెరువు వారు గనుక ఈ వ్యాయామం చేసి ఫలితాన్ని పాఠకులు వారికి అందించారు. అలానే 'శ్రుతిగీతలు' అనే కావ్యం కూడ. మధ్య యుగంనాటి రచనలు, గ్రంథాల అనువాద సాహిత్యానికి మేళ్ళచెరువు వారి ఈ రచనలు అద్దంపడతాయి.

మన ప్రాచీన ఆధ్యాత్మికతనుంచే సాహిత్యం ఉద్భవించింది. హర్షుడికైన కాళిదాసుకైన, శ్రీనాధుడికైనా, పోతనకైన ఐతిహాసిక, వైదిక సాహిత్యం పఠన, విమర్శన నుంచే నూతన కావ్య సృజన సాధ్యమైంది. ఈ సంగతి మరిచి ఆధునిక సాహిత్యాన్ని పరిపుష్టం చేసేందుకు తెలుగు సంకర ఆంగ్ల సాహిత్యాన్ని ఆశ్రయిస్తున్నారు. ఈ కారణంగా ప్రాచీన సాహిత్యాన్ని నేటి తరాల ముందుంచేందుకు అహోరాత్రులు కృషి జరిపి ఎంతో సాహితీ సంపదను ప్రోదుచేసిన మహా కవులు, పండితుల్ని విస్మరిస్తున్నారు.

అలా విస్మరించకూడని మహాపండితుల్లో మేళ్ళచెరువు సుబ్రహ్మణ్యశాస్త్రి గారు ఒకరు. అటు 'చందోలు శాస్త్రి' గారి అంతేవాసిగా, ఇటు బెల్లంకొండ వారి సాహిత్యానికి ఏకైక వ్యాఖ్యాన అనువాద వారసునిగా, మధ్యయుగ సాహిత్య అనువాదాలకి ఒక ప్రతీకగా మనముందు నిలిచిన ఒక మహాపండితుడు మేళ్ళచెరువు వారి సాహితీ కృషి చిరస్మరణీయమైనది. పదిమంది గ్రహించి చదువగలిగినది.

(స్వాతి మాసపత్రిక డిసెంబర్ 2022)

5
శాస్త్రీయ సూత్రాలతో పశ్చిమానికి బోధించిన స్వామి వివేకానంద

'నేటి తరం యువతకు స్వామి వివేకానందుడి గురించి సరైన అవగాహన కలిగించటంలో మనం సఫలమైనామా?' అని ప్రశ్నించుకొంటే 'లేదనే' చెప్పవలసి ఉంటుంది. ముఖ్యంగా 'పదిమంది మెరికల్లాంటి యువకులను నాకివ్వండి. ఈ దేశ దశ, దిశ రెండూ మార్చి చూపిస్తాను' అన్న స్వామి మాటలకు అర్థం ఏమిటో విప్పి చెప్పటంలో మనతరం విఫలమైందనటంలో ఎంతమాత్రం సందేహించవలసింది ఏమీ లేదు. భారతదేశం 75 సంవత్సరాల 'ఆజాదికా అమృత్' ఉత్సవాలు జరుపుకొంటున్న వేళ, స్వామి వివేకానందపై నేటి తరాలకున్న అవగాహనను పునరావలోకనం చేయవలసిన అవసరం ఎంతైనా ఉంది. ముఖ్యంగా స్వామి జన్మదినం జనవరి 12ను 'జాతీయ యువత దినంగా' పరిగణిస్తున్న నేపథ్యంలో దీనిని వేరుగా నొక్కి వక్కాణించ వలసిన పనిలేదు. ఇలా భావించడానికి ఉన్న కారణాలు అనేకం. ముఖ్యంగా నేతి యువతలో నానాటికి పెరిగిపోతున్న నిరాశ, నిస్పృహలు, మాదకద్రవ్యాల వాడకం, ఇంకా హత్యలు, ఆత్మహత్యలు వంటివి స్వామి బోధలను వారికి మరింత దగ్గర చేయవలసిన అవసరాన్ని ఎత్తి చూపుతున్నాయి.

మన విద్యావ్యవస్థలో, సమాజంలో ఉన్న వైరుధ్యాల కారణంగానేమో గాని, 'స్వామి'ని ఒక 'ఆధ్యాత్మిక ఋషి' లా కాకుండా, ఒక 'సంఘ సంస్కర్త' గా పుస్తకాలలో పరిచయం చేస్తున్నాము. స్వాతంత్ర్యం

వచ్చిన తొలి దశకాలలో స్వామి జీవిత చరిత్ర భాగాలు, వారి బోధనలు పాఠాలుగా పాఠ్య పుస్తకాలలో వివిధ స్థాయిల్లో దర్శనమిచ్చేవి. క్రమంగా ప్రజల్లో, పాలకుల్లో ఆధునికత పేరున వేగంగా వస్తున్న మార్పుల కారణంగానేమో గాని స్వామి గురించిన పాఠాలు, ఆయన సారస్వతం, ఆయన తన దేశ యువత ఎలా ఉండాలని ఆశించారో ఆ స్ఫూర్తి క్రమంగా కనుమరుగయినాయి. మహా అయితే ఆయనను ఒక 'సంఘ సంస్కర్త'గా 'లౌకికంగా' పరిచయం చేస్తే 'చాల్లే' అన్న భావనకు వచ్చేశారు నేటి సమాజ పెద్దలు. ఈ క్రమంలో ఒక 'ఆధ్యాత్మిక రుషి'గా ఆయనకున్న ప్రత్యేకతను, ఆయన పశ్చిమ ప్రపంచానికి ఈ దేశ ఆధ్యాత్మిక ఘనతను చాటి చెప్పిన తీరును, ఆ విధంగా చెప్పే క్రమంలో ఆయన భౌతిక, జీవ, మానసిక శాస్త్రాలను ఎంత మెళుకువగా మేళవించారోనన్న సత్యాన్ని తిన్నగా విస్మరించేలా చేయగలిగారు. ఫలితంగా నేటి యువతకు దిశ, దశా నిర్దేశించగల ఒక వట వృక్షం లేకుండా పోయింది. ఈ నేపథ్యంలో స్వామి జీవిత విశేషాలు, ఆయన పశ్చిమ దేశాల్లో చేసిన ప్రసంగాలలో విజ్ఞాన వైశిష్ట్యం, ఏకాగ్రత ద్వారా అపార జ్ఞానం ఎలా సాధించారో సంక్షిప్తంగా స్పృశించడమే ఈ వ్యాస లక్ష్యం.

నిమ్న ఆర్థిక తరగతి యువతకు ఒక నమూనా :

సామాజిక శాస్త్ర పరిభాషలో చెప్పాలంటే వివేకానందుడు సమాజంలో నిమ్న ఆర్థిక తరగతికి చెందిన యువతకు ఒక 'నమూనా' (ఏశీఁవశ్రీ) లాంటివాడు. ఆ తరం భారతీయ యువత ఆశలకు, ఆకాంక్షలకు ఒక ప్రతినిధి కూడా. నాడు, నేడు కూడా భారతదేశంలోని 90 శాతం యువత జీవితంలో 'రగిలే ప్రశ్నలే' స్వామి జీవితంలోనూ రగిలాయి. ఆ వయస్సు వారిలో తరుచూ కనిపించే ఆవేశం, కోపం,

రోషం, పట్టుదల, మెండితనం, వాదించే స్వభావం వంటివి వివేకానందుడిలోనూ పుష్కలంగా ఉండేవి. వివేకానందుడు జన్మించే నాటికి (1863, జనవరి 12) భారతదేశం బానిసత్వంలో మగ్గుతుంది. అప్పటికి మొదటి సిపాయి తిరుగుబాటు (1857) జరిగి ఇంకా దశాబ్దం కాలేదు. ఇంకా భారతదేశంలో అనేక స్వతంత్ర సంస్థానాలు, రాజ్యాలు, సామంత రాజ్యాలు ఉన్నాయి. ఈస్ట్ ఇండియా కంపెనీ పాలన అంతరించి, క్వీన్ విక్టోరియా పాలన ప్రారంభమైంది. దేశ రాజధాని ఢిల్లీ అయింది. ఇంకొకవైపు భారతీయ వనరులు, శ్రమ దోపిడికి పగ్గాలే లేవు. దరిద్రం, నిరుద్యోగం, ముసురుకొంటున్న రోగాలు, ప్లేగు వ్యాధులు వంటివి కారు మేఘాల్లా దేశమంతా అలుముకున్నాయి. ఇది వివేకానందుడు ముందున్న నాటి భారతము.

పుట్టుకతో స్వామి వివేకానందుడు (అసలు పేరు నరేంద్రనాథ్ దత్త) ధనికుడు అయినా, తన తండ్రి పిన్న వయస్సులోనే హఠాత్తుగా మరణించటంతో గడ్డుకాలం ఎదుర్కోవలసి వచ్చింది. ఉన్న ఆస్తిపాస్తులు తన తండ్రి అన్నదమ్ముల కోర్టు వ్యాజ్యాల కారణంగా అక్కరకు రాకుండా పోయాయి. నిత్యా అవసరాలు తీరటం కూడా చాలా క్లిష్టమైంది. ఉన్నంతలోనే సర్దుకుపోతూ స్వామి డిగ్రీ వరకూ చదవగలిగారు. నరేంద్రుడు జన్మత: ప్రతిభాశాలి కాదు. ఆయన స్కూలు, కాలేజ్ రికార్డులు పరిశీలిస్తే ఆయన సగటు విద్యార్థే. ఇలాంటి వాడికి చిన్నప్పుడే తల్లిని పోషించే భారం, కోర్టు వివాదాలను ఎదుర్కొంటూ చదువులు చదవవలసి రావటం నిజంగా కఠిన పరీక్షనే. ఈ సమస్యలన్నీ నరేన్ మనస్సులో అనేక తుపానులను రేకెత్తించాయి. అనేక ప్రశ్నలు : అసలు భగవంతుడు ఉన్నాడా? ఉంటే జరుగుతున్న ఈ అన్యాయాల్ని చూస్తూండేట్లయితే ఆయన

(భగవంతుడు) ఉండి ఉపయోగం ఏమిటి? ఈ ప్రపంచం ఇంత దుర్భరంగా, మనిషి జీవించటమే ఒక సవాలుగా ఎందుకు మారింది ? ధనిక, బీద తేడాలు, కరువు కాటకాలు తొలగించి, ప్రపంచాన్ని సంతోషమయంగా, సుఖమయంగా భగవంతుడు ఎందుకు చేయడు ?

రామకృష్ణ పరమహంస తారసపడటం :

సమాధానాలు లేని ఈ ప్రశ్నల సుడిలో, తీరు, తెన్నూ లేకుండా మారిపోయిన జీవితానికి ఒక పరిష్కారం కోసం తపిస్తున్న సమయంలో నరేన్ కు అదే కలకత్తా నగరంలో ఉంటున్న శ్రీ రామకృష్ణ పరమహంస తారస పడటం జరుగుతుంది. నరేన్‌ను సాదరంగా ఆహ్వానించి ఆయన సందేహాలకు, సమస్యలకు పరిష్కారాలు సూచిస్తారు శ్రీ రామకృష్ణ పరమహంస. కానీ, సహజంగా మొండివాడు, హేతువాది అయిన నరేన్ అంత సులువుగా శ్రీ రామకృష్ణను గురువుగా అంగీకరించరు. ఆయనను విసిగిస్తాడు. తన వాదనలతో, పరిక్షిస్తాడు అనేక రకాలుగా. చిట్ట చివరన శ్రీ రామకృష్ణను గురువుగా అంగీకరిస్తారు. అదే మొదలు, నరేన్ జీవితం ఆధ్యాత్మిక మార్గం వైపు మళ్ళింది. ఆయన భగవంతుడి ఉనికి గురించి లేవదీసిన అన్ని ప్రశ్నలకు కాళికామాత దర్శనంతో సమాధానం లభిస్తుంది. ఆ సమాధానాలన్నీ 1886–1902 మధ్య చేసిన ప్రసంగాలలో ఆయనే పొందుపర్చటం జరిగింది.

ఆధ్యాత్మికత అంటే ఏమిటి ?

నరేన్ 'ఆధ్యాత్మికత' అనే శబ్దానికి కొత్త భాష్యం చెప్పి ప్రపంచాన్ని ఒప్పించిన తొలి భారతీయ యోగి. నరేన్ వివేకానందుడిలా మారే కాలానికే ఎంతోమంది మహాపురుషులు ఈ దేశంలో ఉన్నారు. వారిలో మహాత్మా గాంధీ (1869–1948), రబింద్రనాథ్ ఠాగోర్ (1861–1941), ఈశ్వర

చంద్ర విద్యాసాగర్ (1820–1891), స్వామి దయానంద సరస్వతి (1824–1883) చెప్పదగిన వారు. వీరెవ్వరు చేయలేని, చెప్పని మార్గంలో ఆయన భారతీయ 'ఆధ్యాత్మికత'ను స్వదేశంలో, పశ్చిమ దేశాల్లో నిర్వచించారు. ఆనాడు, నేడు కూడా సమాజంలో 'ఆధ్యాత్మికత' అంటే కొన్ని దురుద్దేశాలు ప్రజల్లో ఉన్నాయి. 'ఆధ్యాత్మికత' అంటే 'పిరికితనానికి', 'సోమరితనానికి' ప్రత్యామ్నాయం అనే భావన ఒకటి. కానీ, నరేన్ ఈ భావాలు తప్పని ప్రపంచానికి నిరూపించాడు. 'ఆధ్యాత్మికత' పేరున జరిగే మాయలు, మోసాలు, కుతంత్రాలను ఎండగట్టాడు. క్రమశిక్షణ, రుజుమార్గంలో వ్యవహరించటం, నిజాయితీగా ఉండటం, సత్యము, అహింసను ఆచరించి చూపటం, బాధలో ఉన్నవారిని దరిచేర్చుకొని సేవచేయటం, నిరాడంబరంగా ఉండటం 'ఆధ్యాత్మికతకు' గీటు రాళ్లుగా తాను ఆచరించి, తన సహచర శిష్యులతో ఆచరింపచేసిన వ్యక్తి నరేన్ (తరువాత కాలంలో స్వామి వివేకానంద).

ఈ క్రమశిక్షణతో, శ్రీ రామకృష్ణ గురుదేవుని ఆజ్ఞానుసారం రాజయోగ మార్గంలో కొద్దికాలంలోనే ఆత్మ సాక్షాత్కారం, అద్వైత దర్శనం రెండూ పొందారు (ఈ అద్వైత దర్శనాన్ని ఆయన కడదాకా తన 'అనుష్ఠాన వేదాంతం'గా మార్చాడు. నేటి ఉత్తరాఖండ్ లో 1897లో 'మాయావతి', 'అద్వైత ఆశ్రమం' పేరున తన తపోమందిరమును నిర్మించాడు). ఆత్మ సాక్షాత్కారం, అద్వైత దర్శనం పొందేప్పటికీ ఆయన వయస్సు 25 సంవత్సరాలు మాత్రమే. ఇది జరిగిన కొద్దినాళ్ళకే శ్రీ రామకృష్ణ గురుదేవులు కాలం చేశారు. ఇప్పుడు నరేన్ ముందు అనేక కొత్త బాధ్యతలు నిలిచాయి. రామకృష్ణ మఠం నిర్వహణ నుంచి తన సొంత తల్లి బాధ్యత దాకా ఎన్నో కొత్తవి వచ్చి చేరినా గతంలోలా నరేన్ గందర గోళానికి

గురి కాలేదు. వీటన్నింటిని నిర్వహిస్తూనే, ఊరు, పేరు లేని సన్యాసిగా ఆసేతు హిమాచలం కాలినడకన పర్యటించాడు. నాటి దేశ స్థితిగతులను స్వయంగా చూసి అర్థం చేసికొన్నాడు.

అమెరికా పయనం :

ఈ సమయంలోనే నరేన్‌ను అమెరికా వెళ్ళవలసిందిగా శ్రీ రామకృష్ణ గురుదేవులు ఆదేశిస్తారు. భారతీయ ఆధ్యాత్మికత గురించి మానవ జీవితంలో దాని ప్రాధాన్యత గురించి విదేశీయులకు నరేన్ తప్ప ఇంకెవరూ చెప్పలేరని, అందుకే నరేన్ అమెరికా వెళ్లాలని శ్రీ రామకృష్ణుల భావన. తొలుత నరేన్ అంగీకరించక పోయినా, చివరకు అమెరికా వెళ్లేందుకు సన్నద్ధం అవుతారు. ఈ క్రమంలోనే స్వామి వివేకానంద కన్యాకుమారి వద్ద సముద్రములో ఉన్న ఒక ఎత్తైన శిలపై 3 రాత్రుళ్ళు, 3 పగళ్ళు తపస్సు చేయటం జరిగింది. అమెరికా వెళ్లేముందు ఆయనకు ఖేత్రి మహారాజు 'స్వామి వివేకానంద' అని నామకరణం చేశారు. శ్రీలంక రామ్నద్ రాజు స్వామికి అమెరికా పర్యటనకు అవసరమైన ధనాన్ని అందిస్తాడు. ఇలా స్వామిజి సముద్రయానం ద్వారా అమెరికా చేర్తాడు.

అమెరికాలో అడుగు పెట్టినప్పటి నుంచి పరిస్థితులు చకచకా మారటం మొదలవుతాయి. అనుకోని ఘటన ద్వారా స్వామి హార్వర్డ్ విశ్వ విద్యాలయ ప్రొఫెసర్ జాన్ హెన్రి రైట్‌ను కలుస్తారు. స్వామితో సంభాషణ ప్రారంభించిన కొద్ది సమయంలోనే ప్రొఫెసర్ జాన్‌రైట్‌కు స్వామి ఒక విజ్ఞాన ఖని అని బోధపడుతుంది. స్వామి అమెరికా వచ్చిన కారణం తెలిసిన ప్రొఫెసర్ రైట్ ఆయనకు త్వరలో షికాగో లో జరగనున్న 'వరల్డ్ పార్లమెంట్ ఆఫ్ రెలిజియన్స్' గురించి తెలపటమే గాక అక్కడ స్వామి ప్రసంగించేందుకు వీలు కలిగించే సిఫారసు లేఖ కూడా ఇస్తాడు.

చికాగోలో 'వరల్డ్ పార్లమెంట్ ఆఫ్ రెలిజియన్స్' నిర్వాహకులను కలిసిన స్వామి తనకు భారతదేశ ప్రతినిధిగా కనీసం మూడే మూడు నిముషాలు మాట్లాడే అవకాశం కల్పించమని వేడుకొంటాడు. నిర్వాహకులు అనేక తర్జన భర్జనలు పడి చివరకు స్వామికి మూడే నిముషాలు మాట్లాడేందుకు అనుమతిస్తారు. ఆ విధంగా మూడు నిముషాలకు అనుమతి పొందిన స్వామి వివేకానంద మూడు గంటలు అనర్గళంగా ప్రసంగించటమే కాక, ప్రతినిధుల కోరిక మేరకు తర్వాత దినాల్లో కూడా ప్రసంగించారు.

అప్పటిదాకా ప్రపంచానికి ఎంత మంత్రం తెలియని స్వామి వివేకానందను 'దేవవక్త' (an orator by divine order) అని కీర్తిస్తూ, అమెరికాలోని అన్ని ప్రముఖ పత్రికలు రాయటంతో భారతదేశంతో సహా తూర్పు, పశ్చిమాలు ఒక్కసారిగా తుళ్ళిపడ్డాయి. గతంలో ప్రవచనకారుల్లా కాకుండా, తన భారతీయమైన ఆధ్యాత్మిక ప్రసంగాలు పాశ్చాత్యా భౌతిక, జీవ, మానసిక విజ్ఞాన శాస్త్రాలతో మేళవించి ప్రసంగించటం స్వామి ప్రసంగాలలో అందరినీ ఆకర్షించింది. ఈ క్రమంలో స్వామి తన ఉపన్యాసాలకు బలం చేకూర్చే అనేక శాస్త్రీయ విషయాలను పేర్కొనటం జరిగింది. ఆశ్చర్యమేమిటంటే అందులో కొన్ని శాస్త్ర విషయాలు ఇంకా అప్పటికి ఆవిష్కారం కాలేదు. కాని స్వామి తన ప్రసంగాలతో ఆ విషయాలను తర్కబద్ధంగా జోడించటంతో స్వామి ప్రసంగాలు మూసలో పోసినట్టు ఉండే ప్రవచనకారుల శైలికి భిన్నమై ప్రపంచాన్ని ఎంతో ఆకర్షించ కలిగింది. ఇక తరువాత వచ్చే విషయాలన్నీ స్వామి ప్రసంగాలలోని ఈ అంశాలనే స్పృశిస్తాయి. ఈ క్రమంలోనే 'ఆధ్యాత్మిక ఋషి'గా వివేకానందుడు ఒక సాధారణ 'సంఘ సంస్కర్త' కంటే ఎన్నో వేల రెట్లు ఎక్కువ ఎందుకో పాఠకులకు సులువుగా అర్థం అవుతుంది.

పాశ్చాత్య విజ్ఞానశాస్త్రాలు అన్వయించి స్వామి ప్రసంగం :

అప్పుడప్పుడే వెల్లివిరుస్తున్న విజ్ఞాన శాస్త్ర ఆధారంగా భారతీయ ఆధ్యాత్మికతను వివరించటంతో అమెరికాకు చెందిన శాస్త్రవేత్తలు ఆయనతో ముఖాముఖి చర్చలకు సిద్ధమయ్యారు. హార్వర్డ్ యూనివర్సిటీకి చెందిన శాస్త్రవేత్తలు అంతా కలిసి స్వామిని ప్రత్యేక ముఖాముఖికి ఆహ్వానించారు. హార్వర్డ్ గ్రాడ్యుయేట్ ఫిలసాఫికల్ సొసైటీలో మార్చి 22–24 (1886లో) వరకు మూడు రోజుల మధ్యాహ్న సమయంలో ఈ చర్చలు జరిగాయి. ఆ వేదికపై స్వామి ఎంతమాత్రం తడబడకుండా ఇచ్చిన సమాధానాలు, భౌతిక, జీవ, మానసిక శాస్త్రాలపై ఆయనకున్న సాధికారిత వారిని ముగ్ధులను చేశాయి. జీవి, మాయ, అద్వైతం, సాపేక్షత నుంచి మనస్తత్వ శాస్త్రాల వరకు స్వామి ఇచ్చిన సమాధానాలను రికార్డు చేసి పుస్తక రూపంలో తెచ్చారు హార్వర్డ్ ప్రొఫెసర్లు. 'ది వేదాంత ఫిలాసఫీ' పేరున, 'ది ఫర్గాటన్ బుక్స్' సంస్థ వీటిని అచ్చువేసింది. దీనికి ప్రొఫెసర్ ఛార్లెస్ కెర్రోల్ ఎవరెట్ ముందుమాట రాశారు. ఈ ప్రసంగం తర్వాత ఆ హార్వర్డ్ విశ్వ విద్యాలయంలోనే స్వామికి 'ఛైర్, ఈస్టర్న్ ఫిలాసఫీ' అనే ప్రత్యేక ప్రొఫెసర్ స్థానాన్నిచ్చి సత్కరించారు. అంతేగాక 'రాజయోగ, పతంజలి సూత్రాలు' అనే పేరున వివేకానంద ఇచ్చిన ప్రసంగాలను 'ది బేకర్ అండ్ టేలర్' కంపెనీ న్యూయార్క్ వారు 1899లో అచ్చువేశారు.కేవలం తన ఆధ్యాత్మిక సాధన వలన కలిగిన 'జ్ఞానం'నే పెట్టుబడిగా పెట్టి, అమెరికాతో సహా, ఇంగ్లాండ్, జర్మనీ, ఫ్రాన్స్ వంటి అప్పటికే శాస్త్రీయంగా ఎంతో ప్రగతి సాధించిన దేశాలను మెప్పించగలిగిన 'ఏకైక సైనికుడు' స్వామి వివేకానంద.

అమెరికా చేరే నాటికి అనేక ప్రముఖ వైజ్ఞానిక సిద్ధాంతాలు

పాశ్చాత్యా దేశాల్లో పాఠ్య గ్రంథాలు అయినాయి. ఛార్లెస్ డార్విన్ (1809–1882), కార్ల్ మార్క్స్ (1818–1883), సిగ్మన్డ్ ఫ్రాయిడ్ (1856–1936), ఇమ్మానుయేల్ కంట్ (1724–1804), ఆల్బర్ట్ ఐన్‌స్టీన్ (1879–1955), వంటి వారు తమ వైజ్ఞానికా శోధనలను వెలువరించారు. వివేకానందుడి ప్రసంగాలు పూర్తిగా చదివితే, స్వామి వీటన్నింటిని అప్పటికే క్షుణ్ణంగా చదివారని బోధపడుతుంది. స్వామి వివేకానంద తనకంత అపారమైన జ్ఞానం అంత చిన్న వయసులో ఎలా కలిగిందన్న హార్వర్డు ప్రొఫెసర్సు ప్రశ్నలకు ఇలా సమాధానం ఇచ్చారు. 'మీరంతా పుస్తకాలు చదివి, అందులోని సమాచారాన్ని ఒక దానిని మరొకదానితో గుద్ది గుచ్చుకొటూ జ్ఞానాన్ని సాధిస్తారు. 'దీనిని 'నాలెడ్జ్' అని అంటారు మీరు మీ 'ఎపిస్టమోలోజి' పరిభాషలో. కాని నేను అలా చెయ్యను. అచంచలమైన 'ఏకాగ్రత' ను ఒక విషయం/సబ్జెక్టు పై కేంద్రీకరించడంతో ఆ విషయం / సబ్జెక్టు అదంతట అదే విడిపోతుంది, దానిలో నిక్షిప్తమైన అన్ని రహస్యాలు, సూత్రాలు తమంతట తామే వెల్లడవుతాయి / బోధపడుతాయి. ఇందుకు నేను ఉపయోగించే ఆయుధం 'ఏకాగ్రత'. భారతీయ రుషులు, మునులు అందరూ ఇలా జ్ఞానం సాధించిన అపార జ్ఞాన సంపన్నులే. అందువల్లనే 'వేద' శబ్దానికి అర్థం 'జ్ఞానం' అని చెబుతారు. ఈ భూమి మీద ఉన్న గ్రంథాలయాలన్నీ ఒక ఋషి జ్ఞానానికి సమానం కావు'.

స్వామి ఏకాగ్రతకు పరీక్ష :

తూర్పు దేశాల తత్వశాస్త్రాలలో అత్యున్నత మేధావిగా కీర్తిగాంచిన ప్రొఫెసర్ పాల్ డ్యూసేన్ వివేకానందుడితో ముఖాముఖి మాట్లాడుతూ తన చేతిలో ఉన్న ఒక 600 వందల పేజీల తత్వ శాస్త్ర పుస్తకాన్ని ఆయనకిచ్చి ఇందులోని తత్వ విషయాలు తనకు ఏవిధంగా అర్థం

చేసికోవాలో తెలియటంలేదని, కొంచెం నువ్వు చదివి ఏమైనా చెప్పగలవా అని అడిగాడు. ఆ పుస్తకం స్వామి ఏనాడు చూసింది, చదివింది కాదు. ఆ అవకాశమే స్వామి జీవితంలో రాలేదు. ఎందుకంటే స్వామి ఆ స్థాయి విద్య చదివేందుకు నోచుకోలేదు. అయినా, స్వామి ఆ పుస్తకంలోని ప్రతి పేజీని తిరగేస్తూ మొత్తం పుస్తకంలోని అన్ని పేజీలను చూసేందుకు ఆలా ఎంత సమయం పడుతుందో అంత సమయం మాత్రమే తీసుకొని పాల్ ద్యూసేన్‌కు తిరిగిచ్చేసి ఆయన కోరిన పేజీలోని సందిగ్ధాలను విడమరచి అర్థమయ్యేలా వివరించాడు. అందుకు ద్యూసేన్ ఆశ్చర్యచకితుడై 'ఈ పుస్తకం చదవటానికే నాకు ఆరు నెలలు పట్టింది. అయినా అందులో అనేక విషయాలపై నాకు స్పష్టత, అవగాహన రాలేదు. అలాంటిది ఒక్కసారి అన్ని పేజీలు ఇలా తిరగేసి నువ్వు అంత సులువుగా దానిలోని అర్థాలను ఎలా విడమర్చి చెప్పగలిగావు?' అని అడిగాడు. అందుకు స్వామి వివేకానంద ఇచ్చిన సమాధానం తన 'ఏకాగ్రతే'నని. ఈ విషయాలను ప్రొఫెసర్ పాల్ జాకోబ్ ద్యూసేన్ స్వయంగా తన స్మృతుల్లో రాశారు.

అంతేగాదు, స్వామి ఎప్పుడో కొన్నేళ్ళ క్రితం తానిచ్చిన ఉపన్యాసాన్ని తిరిగి యధాతథంగా అక్షరం, లేదా ఒక వాక్యం పొల్లు పోకుండా మొదటి నుంచి చివరి వరకు తిరిగి ఒప్ప చెప్పేవాడు. స్వామి తన ఉపన్యాసాలను టైపు చేసేందుకు జోసయ్య జాన్ గుడ్ విన్ (J.J. Goodwin) అనే ఒక అత్యంత వేగంగా లిఖించగల ఒక బ్రిటిష్ ఆంగ్ల స్టెనోగ్రాఫర్ను నియమించుకొన్నాడు. ఎంతో వేగంతో ప్రసంగించే స్వామి ఆంగ్ల వాక్యాలు ఒక్కోసారి రాసుకోవటం వీలు అయ్యేది కాదు. ఈ కారణంగా స్వామిని ఆ వాక్యాలు పునరుక్తి చేయమంటే స్వామి యధాతథంగా పునరుక్తి చేసేవాడు. ఒక్కోసారి తాను సెలవుల్లో ఉన్నప్పుడు స్వామి చేసిన

ప్రసంగాలను తిరిగి యధాతథంగా టైపు చేసేందుకు మళ్ళీ ప్రసంగించమని కోరితే తిరిగి ప్రసంగించేవాడు. స్వామి వివేకానందుని ఈ అసమానమైన జ్ఞాపక శక్తిని, స్వామి వాత్సల్య పూరితమైన వ్యక్తిత్వాన్ని దగ్గరనుండి చూసినవాడై జోసయ్య జాన్ గుడ్విన్ స్వామి దగ్గరే సన్యాసం స్వీకరించి స్వామి శిష్యుడిగా మారి, ఆనతి కాలంలోనే లోకాన్ని విడిచివెళ్లిపోయాడు. ఈ సంగతులు, సందర్భాలు, తాను చూసిన వివేకానందుని వ్యక్తిత్వం గురించి విపులంగా రాశారు జోసయ్య జాన్ గుడ్ విన్ (1870–1898) తన స్మృతుల్లో. ఇలా స్వామి తన 'ఏకాగ్రత'ను ప్రదర్శించిన సంఘటనలు కోకొల్లలు.

స్వామి నారాయణ స్వరూపం, సప్త ఋషులలో ఒకరు : రామకృష్ణ పరమహంస

స్వామి చాలా బలిష్టమైన, ఆరు అడుగుల ఎత్తు గల అందమైన యువకుడు. పచ్చని పసిమి, ముగ్ధ సమ్మోహన రూపం. గంభీరమైన స్వరం. చక్కటి చలోక్తులతో, తన ప్రసంగాలతో శ్రోతలను ఘొల్లుమని నవ్వించగల చతురుడు. అందుకే శ్రీ రామకృష్ణ గురుదేవులు స్వామి వివేకానందుడిని నారాయణ రూపంగా వర్ణించేవారు. సప్త ఋషులలో ఒకరిని ఈ వివేకానందుడిగా భూమిపైకి తెచ్చాను. తిరిగి అక్కడికే భద్రంగా చేర్చే బాధ్యత తనదే అని కూడా చెప్పేవారు. అమెరికా, యూరోప్‌లు విశ్వగురుత్వాకర్షణ సిద్ధాంతం ద్వారా అంతరిక్ష శోధనలో ముందడుగులు వేస్తున్నామని గొప్పలు చెప్పుకొనే కాలం అది. ఒకసారి అమెరికాలో చేసిన ప్రసంగంలో స్వామి నాటి పాఠశాలల్లో విజ్ఞాన బోధన గురించి ఇలా చమత్కరించాడు. ఆ కాలంలో ఒక ఉపాధ్యాయుడు తన క్లాస్‌లో భౌతికశాస్త్రం పాఠం చెబుతున్నాడు. ఆయన తన విద్యార్థులతో 'విశ్వ

గురుత్వాకర్షణ బంధాల వల్ల ఒక గ్రహ కుటుంబంలోని గ్రహాలన్నీ, ఒక దానితో ఒకటి బంధితమై, ఒక నిర్ధేశిత కక్ష్యలో, తమ చుట్టూ తాము తిరుగుతూ, సూర్యుని చుట్టూ తిరుగుతూ ఉంటాయి' అని అన్నాడు. వెంటనే ఒక విద్యార్థి లేచి 'గ్రహాల మధ్య విశ్వ గురుత్వ ఆకర్షణ ఉండటం వల్లనే అవి అలా ఒక దీర్ఘ వృత్తాకారంలో పరిభ్రమిస్తున్నాయని నమ్మటం ఎలా?' అని అడిగాడు. ఇందుకు ఆ ఉపాధ్యాయుడు 'లేకపోతె అవి పడిపోయేవి కదా?' అని జవాబు ఇచ్చాడు. వెంటనే ఆ విద్యార్థి 'విశ్వానికి పైకి, క్రిందికి' ఏమిటి? పడితే ఎక్కడ పడతాయి?' అని అడిగాడు. ఆ ఉపాధ్యాయుడు ఒక్కసారిగా అవాక్కయ్యాడు. వివేకానందుడు విసిరిన ఈ చమత్కారానికి నవ్వు కోవటం అక్కడ కూర్చున్న పెద్ద పెద్ద భౌతికశాస్త్రవేత్తల వంతు అయింది.

'ఏకాగ్రత' సాధారణ మనుషుల్లో గూడ కనిపిస్తుంది. కానీ, దానిని చాలామంది గుర్తించరు. కానీ దానివల్లే వారు అపూర్వమైన సృష్టి రహస్యాలను ఛేదిస్తారు. ఈనాడు ప్రపంచం అంతా చెప్పుకొనే గొప్ప గొప్ప భౌతిక, జీవ, రసాయన, మానసిక సిద్ధాంతాలన్నీ వ్యక్తిలోని అపూర్వ ఏకాగ్రతతో వెలుగు చూసినవే. లేకపోతే ఐసాక్ న్యూటన్ భూమ్యాకర్షణ సూత్రాన్ని ఎలా కనుగొనేవాడు? అయిన ఒకసారి తన తోటలోని ఏపిల్ చెట్టు నీడలో సేద తీరుతూ విశ్వంలోని ఆకర్షణలు ఎలా ఏర్పడతాయి అని కళ్ళు మూసుకొని దీర్ఘంగా ఆలోచిస్తుండగా, టపీమని ఒక ఆపిల్ ఆయన నెత్తిమీద పడటం, అది అటు ఇటు గాక నిటారుగా గీత గీసినట్టు ఆయన మీదే పడటం ఎంతో ఆశ్చర్యం కలిగించింది. వెనువెంటనే ఆయన భూమి ఆకర్షణ వల్లనే అలా జరిగిందని గ్రహించటం రెప్పపాటు కాలంలో జరిగిపోయింది. న్యూటన్ అప్పటికే యూనివర్సిటీ స్థాయి విద్యను పూర్తిచేసి

ఉన్నాడు. బలం (ఫోర్స్) తాలూకు సమీకరణాలు, కాలుక్యులస్ పేరున కొత్త గణితశాస్త్ర సూత్రాలను సృజించాడు. ఇలా ఒక్క ఘటనతో ఆయన భూమ్యాకర్షణ సిద్ధాంతాన్ని ప్రకటించాడు. న్యూటన్‌కు ముందు కూడా ఎన్నో వందల ఏళ్ళనించి ఆపిల్ పండ్లు భూమి పైకి నిటారుగా పడుతుండేవి. అయినా అంతకుముందు ఎవ్వరు ఎందుకు కనుగొనలేకపోయారు? ఆ కాలానికే లీబ్నిజ్ లాంటి అఖండ గణిత భౌతిక శాస్త్రవేత్తలు ఉన్నా ఒక్క న్యూటన్‌కు మాత్రమే ఎందుకు తట్టింది భూమ్యాకర్షణ సిద్ధాంతం. ఇవన్నీ ఏకాగ్రత ద్వారానే సాధ్యం అవుతాయి. నేడు ప్రపంచంలో ఆవిష్కారం అయ్యే అన్ని సృజనాత్మక శోధనలు, రచనలు అన్నీ కొద్ది డిగ్రీల తేడాతో ఏకాగ్రత వల్లనే మానవ మస్తిష్కం నుంచి వెలువడ్డాయి. బాహ్య ప్రపంచం మానవ మస్తిష్కాన్ని ప్రేరేపించే కేవలం ప్రేరణే. దాని రహస్యాలను ఛేదించేది మటుకు మస్తిష్కంలోని ఏకాగ్రత.

జ్ఞానం సంకేతమయం : స్వామి వివేకానంద

ఈ జ్ఞానం అంతా మానవ మెదడులోని గ్రేమేటర్‌లో నిక్షిప్తం అయి ఒక్కోసారి ఒక్కొక్కరిలో ఒక్కో రూపంలో వెలువడుతుంది. మానవ మెదడులో ఈ 'జ్ఞానం' రూప రహితంగా ఉంటుంది. కానీ బయటికి వెలువడినప్పుడు అనేక రూపాలు పొందుతుంది. ఈ బాహ్యరూపాలు సంకేతంలా 'అక్షరం' నుంచి 'అంకె' ద్వారా ఏ రూపంలో అయినా ఉండవచ్చు. భారతీయ తత్వ శాస్త్రం 'జ్ఞానం' అంతా 'రూప' రహితంగా మనిషిలోనే ఉంటుంది అని చెబుతుంది. ఈ జ్ఞానమే ఈశ్వరుడి నిర్గుణ (రూప రహిత స్థితి) రూపం. బయట మనుషులు ఏర్పరచుకొన్న 'దైవరూపం' సంకేతం మాత్రమే. దీనినే వివేకానందుడు 'ప్రతికోపాసన' అని సూత్రీకరించారు. ఇలా అద్వైతాన్ని సశాస్త్రీయంగా వివరించిన

'ఆధ్యాత్మిక ఋషి' వివేకానందుడు. భారతీయ తత్వ శాస్త్రంలో బాహ్యానికి కనిపించేవి అన్ని ప్రతీకలు / సంకేతాలు మాత్రమే. వీటినే తర్వాత కాలంలో పశ్చిమ దేశాల్లో శాస్త్రవేత్తలు / తత్వ వేత్తలు / భాషాశాస్త్ర వేత్తలు 'సేమియాటిక్స్' అని వ్యవహరించారు. ఫెర్డినాండ్ డి సాస్యూర్ (1857–1913), చార్లెస్ సాండర్స్ పేయర్స్ (1839–1914) వంటి భాష శాస్త్రవేత్తలు ఈ 'సెమియాటిక్స్'కు ఆద్యులుగా చెబుతారు పశ్చిమ దేశాల్లో. నిజానికి వీరు వివేకానందుడి సమకాలీకులు. వీరిలో ఫెర్డినాండ్ డి సాస్యూర్ భారతదేశం వచ్చి ఇక్కడ తత్వ శాస్త్రాలలోని 'సంకేత' శాస్త్రం పైన అవగాహన ఏర్పరచుకొన్నట్లు ఒక వాదన ప్రచారంలో ఉంది. పాశ్చాత్య భాషా శాస్త్రవేత్తలకు, వ్యాకరణులకు భారతీయ తత్వ శాస్త్రం, పాణిని 'అష్టాధ్యాయి' ఎంతగానో ఉపకరించాయి అన్నది ఎంత మాత్రం అతిశయోక్తికాదు. హార్వర్డు శాస్త్రవేత్తలు అడిగిన అన్ని ప్రశ్నలకు శాస్త్రీయత జోడించి సమాధానాలు ఇచ్చాడు స్వామి. ఇందుకు ఆయన నాటికి అందుబాటులో ఉన్న శాస్త్ర విజ్ఞానమే గాక, తార్కికంగా, శాస్త్ర సమ్మతంగా ఆవిష్కారం అయ్యే అనేక నూతన శాస్త్రీయ సూత్రీకరణలు గూడా చేశారు. వాటిలో పైన పేర్కొన్నది ఒకటి.

ఖగోళశాస్త్రాధారంగా జీవ పరిణామం తెలిపిన స్వామి :

హార్వర్డ్ శాస్త్రవేత్తలు భారతీయ తత్వ శాస్త్రం 'సృష్టి' క్రమం, జీవపరిమాణం గురించి ఏమి చెబుతుంది అని ప్రశ్నించారు. సాంఖ్యయోగ ద్వారా సృష్టి క్రమాన్ని వివరించాడు స్వామి వివేకానంద. సాంఖ్య తత్వ శాస్త్రం 'ఆకాశ్' అనే పదార్థాన్ని ప్రతిపాదిస్తుందని, ఇది జడ పదార్థం అని, దీనిపై 'చైతన్యం', 'ప్రాణ' అనే రెండు బలాలు పనిచేయడంతో సృష్టి ఆరంభం అయి విస్తరిస్తూ పోతుందని వివరించాడు. సృష్టి క్రమం

నిరంతరం జరుగుతూ ఉండదని, కొంత కాల పరిమాణం తర్వాత అది తిరిగి అంతరిస్తూ సూక్ష్మాతి సూక్ష్మ పరిణామానికి వెళ్ళిపోతుందని కూడా వివరించాడు. ఈ ప్రక్రియ వలయాలుగా సాగుతుంది. ఒకసారి సృష్టి ఉద్భవం జరిగి, తిరిగి లయం అవటం ఒక వలయం అని స్వామి వివరించారు. దాన్నే 'యుగం' అని కూడా అంటారు అని చెప్పాడు వివేకానంద. 'ఆకాష్'పై 'ప్రాణ', 'చైతన్యం' నిరంతరంగా చర్య జరపటం వలన సృష్టికి కావలసిన అన్ని మూలకాలు, వాటి నుంచి పదార్థాలు, వాటి పరస్పర చర్యల వలన ప్రాణులు, వాటి ఆహారాలు ఏర్పడుతాయని కూడా వివరించాడు. నిజానికి స్వామి చెప్పిన ఈ వివరణనే తరువాత కాలంలో ఇంకా శాస్త్రీయంగా పరమాణువులు, అణువుల సంయోగంగా మొక్కలు, జంతువులూ, ఒక పరిణామ క్రమంలో ఏర్పడుతాయని అమెరికన్ శాస్త్రవేత్తలు అంగీకరించారు. జేమ్స్ స్టాన్లీ ట్రిఫిల్ (1936) అనే అమెరికన్ భౌతిక శాస్త్రవేత్త (జార్జ్ మసన్ యునివర్సిటీ) తన పరిశోధనా వ్యాసంలో 'ది డార్క్‌సైడ్ అఫ్ ది యూనివర్స్ : అటమ్స్ టు క్వార్క్స్, డిమూవ్మెంట్ ఆఫ్ క్రియేషన్' పేరుతో స్మిత్సోనియాన్ మ్యాగజైన్‌లో అచ్చుయింది. ఎడ్వర్ట్ హబుల్ ప్రతిపాదించిన 'బిగ్ బాంగ్' (విశ్వవ్యాకోచ) సిద్ధాంతాన్ని వివరించే క్రమంలో జేమ్స్ స్టాన్లీ ట్రీఫీల్ రాసిన వ్యాసానికి స్వామి వివేకానంద సాంఖ్య తత్వశాస్త్ర వివరణకు మధ్య ఉన్న చాలా పోలికలు కనిపిస్తాయి. అలాగే అక్టోబర్ 1990లో సైన్టిఫిక్ అమెరికన్ అనే ప్రముఖ వైజ్ఞానిక పత్రికలో 'ట్రెండ్స్ ఇన్ కాస్మాలోజి' పేరున బొమ్మల ఆధారంగా సృష్టిక్రమాన్ని వివరించిన వ్యాసం కూడా వివేకానంద ఇచ్చిన వివరణకు దగ్గరగా ఉంటుంది.

మనస్తత్వశాస్త్రం – సాంఖ్య యోగం :

సాంఖ్య యోగ శాస్త్ర ఆధారంగా మనస్తత్వ శాస్త్రం ఎలా ఆవిష్కరించవచ్చో స్వామి వివేకానంద చేసిన ఉపన్యాసాలు, తర్వాత కాలంలో పాశ్చాత్యులు 'గెస్టాల్ట్ సైకాలజి' గా పేర్కొన్న మానసిక శాస్త్రశోధనలు చాలా దగ్గర పోలికలతో ఉండటం ఆశ్చర్యం కలిగిస్తుంది. ఇలా చెప్పుకొంటూ పోతే ఎన్నో విషయాలు స్వామి ప్రసంగించిన చాలా కాలానికి శాస్త్రీయ విజ్ఞానంగా వాస్తవాలు అయినాయి. స్వామి తాలూకు ఈ ప్రతిభకు గుర్తింపుగా, చికాగోలో ఆయన ప్రసంగాలకు చిహ్నంగా చికాగో విశ్వ విద్యాలయంలో స్వామి పేరున 'సెంటర్ ఫర్ ఇండియన్ స్టడీస్' అనే కేంద్రం ఏర్పరిచారు. అది నేటికీ ఉంది.

ఇంత అపార జ్ఞాన నిధి అయినా స్వామి 1902 జులై 2న స్వచ్ఛందంగా కాలం చేశారు. ఆయన లేరన్న వార్త భారతదేశాన్ని దు:ఖ సాగరంలోకి నెట్టింది. స్వామిని జాతి, కుల, మత, భాషలకు అతీతంగా భారతదేశం ప్రేమించింది. అటువంటి వ్యక్తి హఠాత్తుగా ఈ లోకం విడిచిపోవటం భారతదేశం జీర్ణించుకోలేకపోయింది. ఈనాటి యువతను మేల్కొల్పే శక్తి స్వామికే ఉంది. ప్రస్తుతానికి స్వామి ఒక సంఘ సంస్కర్తకన్నా ఒక 'గొప్ప రుషి' అని, 'ఆధ్యాత్మికవేత్త' అని గ్రహిస్తేచాలు. ఋషులందరూ సంఘసంస్కర్తలే. కానీ సంఘ సంస్కర్తలందరూ ఋషులు కారు.

(భక్తి మాసపత్రిక జులై 2023)

6

అలంపురం జోగులాంబదేవి - బ్రహ్మేశ్వరాలయాలు

అలంపురం పేరు వినపడగానే మనకు గుర్తుకు వచ్చేది శక్తి స్వరూపిణి జోగులాంబ అమ్మవారు. అలంపురం అష్టాదశ శక్తి పీఠాలలో ఒకటి. ప్రస్తుతం జోగులాంబా గద్వాల జిల్లా, తెలంగాణాలో ఉన్న ఈ ఆలయం కర్నూలు పట్టణ కేంద్రం నుంచి 20-30 కి.మీ. దూరంలో గద్వాల వెళ్ళే జాతీయ రహదారిలో ఉంటుంది. జాతీయ రహదారి నుంచి ప్రక్కకు సుమారు 5 కి.మీ.లు ప్రయాణిస్తే ఈ దేవాలయం వస్తుంది. ఈ అలంపురం గ్రామంలోనే తుంగభద్రానది రిజర్వాయర్ ఉంది. ఈ రిజర్వాయర్ దేవాలయాలనానుకొని ఉంటుంది.

ఇంకా అలంపురం ప్రశస్తికి వస్తే ఇక్కడ తొమ్మిది బ్రహ్మేశ్వరాలయాలు ఉన్నాయి. వాటిలోని ఒక ఆలయంలోనే జోగులాంబ దేవాలయం కూడా ఉండేది. ఒక రెండు దశాబ్దాల క్రితం ఈ జోగులాంబ దేవాలయంను బ్రహ్మేశ్వరాలయం నుంచి వేరు చేసి అమ్మవారికి ప్రత్యేకంగా ఆలయం నిర్మించారు. సుప్రసిద్ధ శాసన నిపుణుడు గడియారం రామకృష్ణ శర్మ ఈ అలపురంలోనే ఉంటూ ఈ దేవాలయాల పరిరక్షణకు, జోగులాంబ అమ్మవారి దేవాలయ నిర్మాణానికి ఎంతోకృషి సల్పారు.

అలంపురం దేవాలయాలు, వాటి శిల్పకళ, నిర్మాణం ఒక అద్భుతమేనని చెప్పవచ్చు. దాదాపుగా 5వ శతాబ్దం నుంచి అలంపురానికి

ప్రత్యేక చరిత్ర ఉంది. అశోకుడి కాలానికే (3 బిసి) అలపురం ఉన్నట్లు పలువురు భావిస్తున్న శాసనపరమైన ఆధారాలు క్రీ.శ. 566–757 నుంచే అలంపురం ఉనికిని చాటుతున్నాయి.

బాదామీ చాళుక్యులు :

బాదామీ చాళుక్యుల కాలంలో అలంపురం ఒకానొక ప్రసిద్ధ పట్టణంగా వర్ధిలినట్టు శాసనాలు చెబుతాయి. ఈ ప్రాంతంలో శైవ, వైష్ణవ సంప్రదాయాలు రెండూ ఇక్కడ పరిఢవిల్లినాయి. చాళుక్యులు, పల్లవులు పోటీపడి ఈ రెండు సంప్రదాయాలను ప్రోత్సహించారు.

అలంపురం తొలి నామాలు :

అలంపురానికి ఈ పేరు రాక పూర్వం చాలా పేర్లుండేవి. ఈ పేర్లన్నీ శాసనాల నుండి రాబట్టినవే. మూడవ శతాబ్ద శాసనంలో అలంపురం తొలి పేర్లు ప్రస్తావనకు వచ్చాయి. అప్పుడు ఇక్ష్వాకరాజులు పాలిస్తున్నారు. ఇక్ష్వాక రాజు రుద్ర పురుష దత్తుడు మూడవ శతాబ్దంలో వేయించిన శాసనంలో దీని పేరు 'హతంపుర'. దీనినే ప్రఖ్యాత 'గురజాల బ్రాహ్మశాసనం'గా పిలుస్తారు. ఈ శాసనం గురిజాలలో లభించటం వలన దానికి ఆ పేరు వచ్చింది. తర్వాత కాలంలో అలంపురం చుట్టూ జరిపిన త్రవ్వకాలలో అలంపురంకు ఉన్న పలుపేర్లు వెలుగులోకి వచ్చాయి. హలంపురం, హేమాలపురం, ఎల్లమ్మపురం, మొదలైనవి. పురావస్తు శాఖవారు జరిపిన అనేక త్రవ్వకాలలో నాణాలు, జపమాలలు, శంఖాలు, గాజులు, మట్టి కుండలు (నలుపు, ఎరుపు రంగులు వేసినవి), 21 అంగుళాల ఇటుకలు వంటివి లభించాయి. 21 అంగుళాల ఇటుకలు శాతవాహనుల కాలం నాటివి. శాతవాహనులు కదంబ వంశాన్ని నిర్మూలించి కృష్ణా పరివాహక ప్రాంతమైన శ్రీశైలం, దాని చుట్టు ప్రక్క ప్రాంతాలను పరిపాలించారు.

అశోకుడి కాలం నాటి సమాధులు, బగ్గీలు, ఇక్కడ గుర్తించారు అధునాతన పద్ధతులనుపయోగించి. ఇవి ఇతర రాజులు భారతదేశం మీదకు దండెత్తి వచ్చినప్పుడు అశోకుడితో యుద్ధంలో మరణించగా ఉండిపోయినవి.

నవబ్రహ్మదేవాలయాలు (బ్రహ్మేశ్వరాలయాలు) :

ఇక్కడున్న నవ బ్రహ్మదేవాలయాలు బాదామీ చాళుక్యుల కాలంలో నిర్మించారు. ఈ నవ బ్రహ్మదేవాలయాలను 'బ్రహ్మేశ్వరాలయాలు' అంటారు. ఇలాంటి దేవాలయాలు భారతదేశంలో ఒక అలంపురంలోనే ఉన్నాయి. బాదామీ చాళుక్య వంశీకుడైన విజయాదిత్య ఈ దేవాలయ నిర్మాణాన్ని శాసించాడు.

బ్రహ్మ అసత్యం ఆడిన పాపానికి శివుడి శాపానికి గురవుతాడు. తన పాపము వదిలించుకోవడానికి తపస్సు చేసి ఈశ్వరుడి కటాక్షం పొందుతాడు. ఆ విధంగా బ్రహ్మ తాను చేసిన తపస్సు ఫలంగా ఇక్కడ తొమ్మిది శివాలయాలు నెలకొల్పుతాడు. వాటినే బ్రహ్మేశ్వరాలయాలు అని వ్యవహరిస్తారు. ఈ ఆలయాలు బాదామీ చాళుక్యులు తమ రాజ వంశీకుల్లో వివాహమందు జరిపించే పూజలకు వేదికగా ఉపయోగించేవారు. నిజానికి అమిదలేపాడులో దొరికిన ఒక శాసనం ద్వారా ఈ దేవాలయాలను ఒక్కసారిగా కాకుండా దశలవారీగా కట్టించారని తెలుస్తుంది. రెండవ పులకేశి (పరమేశ్వర బిరుదాంకితుడు) తొలి నవబ్రహ్మలయం కట్టించాడని తెలుస్తుంది. చాళుక్య రాజుల్లో రెండవ పులకేశీ చాలా గొప్పవాడు. అయితే పల్లవులు బాదామీ చాళుక్యులనే ఓడించాలన్న ఆశతో అనేకసార్లు యుద్ధం చేసి చివరకొకసారి ఓడించారు. నరసింహావర్మ వేయించిన శాసనం ద్వారా ఈ విషయం తేటతెల్లం

అవుతుంది. ఈ నవబ్రహ్మదేవాలయాలలో ఒక్కటి మాత్రమే పల్లవులు కట్టించిన దేవాలయం. ఇది బాలబ్రహ్మేశ్వర దేవాలయం ఎదురుగా ఉంటుంది. దీన్ని పూర్తిగా ద్రావిడ శైలిలో కట్టించారు. (దేవాలయ నిర్మాణ శైలిలో ద్రావిడ, వేసారా వంటి నిర్మాణ శైలులు ఉన్నాయి). అయితే తర్వాత కాలంలో ఈ దేవాలయాలపై జరిగిన దాడుల్లో ఈ దేవాలయం దెబ్బతిన్నా ఇప్పటికీ మిగిలి ఉన్న శిధిలాలపై పల్లవ శిల్పకళ మనల్ని ఆశ్చర్యచకితుల్ని చేస్తుంది.

బాదామీ చాళుక్యులు మిగతా బాలబ్రహ్మేశ్వర దేవాలయాలు నిర్మించార్నది వాటి నిర్మాణాల్ని బట్టి, శైలిని బట్టి తేటతెల్లం అవుతోంది. ఎర్రరాయితో నిర్మించటం బాదామీ చాళుక్యుల 'సంతకం' (సిగ్నేచర్) లాంటి గుర్తు. తుంగభద్రానది ఒడ్డున ఉన్న ఈ అలంపురం అనేక యుద్ధాలకు ప్రత్యక్ష సాక్షి అని ఇక్కడ తవ్వకాలలో లభించిన శాసనాలు వెల్లడి జేస్తున్నాయి.

ఈ బ్రహ్మేశ్వరాలయాల పేర్లు వరుసగా : బాలబ్రహ్మేశ్వర కుమార్, బ్రహ్మ, అర్క బ్రహ్మ, వీరభద్ర, విశ్వ బ్రహ్మ, గరుడ బ్రహ్మ,స్వర్గ బ్రహ్మ, తారక బ్రహ్మ, పద్మ బ్రహ్మ. పూర్వం ప్రసిద్ధి చెందిన 'రసతంత్ర' వాఙ్మయం అలంపూరం గురించి చాలా వివరాలు పొందుపరిచింది.

కళ్యాణీ చాళుక్యులు :

ఇక్కడ యుద్ధాలు చేసిన రాజులు జోగులాంబ అమ్మవారిని దర్శించి కానుకలు సమర్పించుకొన్నట్లు శాసనాధారాలు ఉన్నాయి. బాదామీ చాళుక్యుల పాలన తర్వాత ఈ ప్రాంతం రాష్ట్ర కూటుల పాలనలోకి వెళ్ళింది. తిరిగి రాష్ట్ర కూటుల్లో చివరి వాడైన కక్కల (973 ఎ.డి) చాళుక్యులలో 2వ వైలపూడి అలంపురాన్ని స్వాధీనం చేసుకొన్నారు. వీరిని కళ్యాణీ

చాళుక్యులుగా పిలిచారు. వీరికి బాదామీ చాళుక్యులతో చాల ప్రాచీన కాలం నుంచి సంబంధాలు ఉండేవి. 973 ఎ.డి నుండి 1161 ఎ.డి వరకు కళ్యాణీ చాళుక్యుల ఆధీనంలో అలంపురం ఉండింది. ఇక్కడ త్రైలోక్యమల్ల, బ్రహ్మైకమల్ల, త్రిభువన మల్లల వంటి రాజులు యుద్ధం చేసినట్లు శాసనాలున్నాయి. త్రిభువనమల్లుడి పతనంతో రాష్ట్ర కూటుల విక్రమాదిత్యుడు, దేవగిరి యాదవులు, ఓరుగంటి కాకతీయులు, హోయశల భల్లాలు, కాల చార్యులు ఈ ప్రాంతాన్ని ఏలారు. ఈ కాలంలో ఈ రాజులంతా శైవాన్ని ఎక్కువగా ప్రోత్సహించారు.

జోగులాంబ దేవాలయం : శక్తిపీఠం

దక్షయజ్ఞంలో జరిగిన అవమానానికి సతీదేవి తనను తాను అగ్నికి ఆహుతి చేసుకొన్నట్లు పౌరాణిక విషయం తెలిసిందే. ఆగ్రహించిన శివుడు ఆమె కాలిన శరీరాన్ని మోసుకొని వెళ్తూ ఆమె శరీరాన్ని 18 ఖండాలుగా నరికాడు. అవి పడ్డ చోటల్లా శక్తి పీఠాలుగా మారాయి. వాటిలో ఒకటి జోగులాంబ శక్తిపీఠం. తొలుత ఈ అమ్మవారి రూపం చాలా భయంకరంగా ఉండేది. బాల బ్రహ్మేశ్వరాలయంలో ఒక ప్రక్కనున్న ఉప దేవాలయంలో అమ్మవారి విగ్రహం ఉండేది. దీనిని నేరుగా కాకుండా ప్రక్కనున్న చిన్న ద్వారం ద్వారా భక్తులు దర్శించేవారు. అయితే గడియారం రామకృష్ణశర్మ గారు చొరవ తీసుకొని ఈ అమ్మవారికి విడిగా అలపురంలో ఎంతో అందమైన దేవాలయం ఆగమశాస్త్ర పద్ధతిలో కట్టించి, అమ్మవారిని దాన్లోనే ప్రతిష్ఠించారు. ఇక్కడి దేవాలయంలోనే ప్రతిష్ఠించారు. అలా శక్తి పీఠంగా ఈ దేవాలయం పరిఢవిల్లేందుకు వీలు గల్పించారు.

తెలుగు రాష్ట్రాలలో శ్రీశైల భ్రమరాంబిక, ఆలంపూరు జోగులాంబ, ద్రాక్షారామంలోని మాణిక్యాంబదేవి, పిఠాపురంలో పురూహితిక దేవి

భక్తుల పూజలు అందుకొంటున్న శక్తి పీఠాలు. రాబోయే నవరాత్రులకు ఇక్కడికి జనం ప్రవాహాలే వరదల్లా వస్తాయి. 'జోగులాంబ' అంటే 'యోగుల అమ్మ' అని. ఇక్కడ శివుని పేరు బాలబ్రహ్మేశ్వరుడు. ఇక్కడ ఉన్న నవబ్రహ్మ దేవాలయాలల్లో అనేక తాంత్రిక సంజ్ఞలున్నాయి. ముఖ్యంగా సాధకులకు మాత్రమే అవి అర్థం అవుతాయి. గతంలో అనేకమంది యోగులు ఇక్కడికి వచ్చి అమ్మవారిని దర్శించుకొని యోగ సాధన చేసే వారని ప్రతీతి. జీవితంలో ఒక్కసారైనా ఈ అలంపూర్ దేవాలయాలను దర్శించి అక్కడి శివ భక్తిత్వం చాటే బ్రహ్మేశ్వర, జోగులాంబల ఆశీస్సులు పొంది తీరాలి.

(భక్తి మాసపత్రిక అక్టోబర్ 2023)

7

రుషి తుల్యులు - బులుసు సూర్య ప్రకాశశాస్త్రి

ఇవాళ్ళ ఎంతో వేగవంతమైన జీవితంలో ఆధ్యాత్మిక ఉపశమనం ఎంతో మందికి అవసరం అవుతుంది. 'నేను', – 'నాది' అనే భ్రాంతిలో పరగులు తీస్తున్న నేటి తరానికి అసలు జీవితార్ధం, జీవిత తత్వం, సత్యం చెప్పేందుకు ప్రవచనకారులు, పుస్తకాలు రెండూ కావాలి. గత దశాబ్ద కాలంలో టీ.వీల వలన, మొబైల్ ఫోన్స్ వలన కొంత ఆధ్యాత్మిక ప్రవచనం అన్ని వర్గాలను చేరుతున్నా ఒక నిర్దుష్టమైన మార్గంలో దిక్సూచిలా మనిషిని నడిపించేవి పుస్తకాలేనన్నది నిర్వివాదం.

ఒకప్పుడు ఆంధ్రదేశంలో వావిళ్ళ రామస్వామి అండ్ సన్స్ వారు రామాయణం నుంచి భాగవతం దాకా, గీత, నారద భక్తి సూత్రాలు యోగవాశిష్ఠం, వంటి అనేక గ్రంథాలు అతి తక్కువ ధరకే ముద్రించేవారు. అలాగే ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలో గీతాప్రెస్ (ఘోరకపూరు) వారు కూడ అతి స్వల్పధరకే ఆధ్యాత్మిక గ్రంధాలు అచ్చువేసేవారు. ఒక్కోసారి వాళ్ళు తాము అచ్చు వేసిన పుస్తకాలను ఉచితంగా పంపిణీ చేసేవారు కూడ. ఇవన్నీ ప్రేరణగా పనిచేశాయి కాబోలు – బులుసు సూర్యప్రకాశశాస్త్రి గారు 1945లో తెనాలి కేంద్రంగా 'సాధన గ్రంధ మండలి' స్థాపించి మూడు పైసలు (కాణి), అణా, పావలాలకు కూడ గొప్పగొప్ప ఆధ్యాత్మిక గ్రంథాలను అచ్చువేసి పాఠక లోకానికి అందించేవారు. నాడు ప్రారంభించిన సాధనా

గ్రంధ మండలి ఆధ్యాత్మిక యజ్ఞం నేటికీ నిర్విఘ్నంగా కొనసాగుతూనే ఉంది.

అసలు ఈ సాధనం గ్రంధ మండలి స్థాపించిన బులుసు సూర్యప్రకాశశాస్త్రి గారు ఎవరు? వారెందుకు ఈ మహా యజ్ఞానికి శ్రీకారం చుట్టారు? ఎవరెవరిని ఈ యజ్ఞంలో భాగం చేశారు? ఎలా ఆర్ధికంగా ఈ సంస్థ నేటికీ మనగలుగుతున్నది? – వంటి విషయాలు తెలియపరచటమే ఈ వ్యాసం లక్ష్యం.

బులుసు సూర్యప్రకాశశాస్త్రి గారి తండ్రిగారు బులుసు సూర్యనారాయణ గారు, తల్లి సోదెమ్మగారు. వీరి స్వస్థలం గోదావరి జిల్లా, భట్నవిల్లి వీరు ద్వితీయ సంతానం. 1910 సెప్టెంబర్ 10న జన్మించారు. తండ్రి గారు వేద పండితులు. కనుక తండ్రి వద్దనే ఐదవ యేటనే ఉపనయనమై, ప్రాధమికంగా వేదం, తర్కం, జ్యోతిష్యం, చంధస్సు వంటి వన్ని క్షుణ్ణంగా చదివారు. వీరి తండ్రి గారు నిత్యాగ్నిహోత్రులు, వేద మంత్ర పరాయణులు అవటం వలన చిన్నప్పుడే సూర్య ప్రకాశశాస్త్రికి నైతిక కర్మలను నిష్టతో, మంత్ర యుక్తంగా చేయడం అలవాటు అయింది. ఆ నిష్ట, నియమాన్ని సూర్య ప్రకాశశాస్త్రి గారు తన జీవితం కడవరకూ ఆచరించారు. సూర్యప్రకాశ శాస్త్రి గారికి బాల్యంలోనే మేనరికం వివాహం జరిగింది. వీరి ధర్మపత్ని పేరు సత్యవెంకట సుబ్బలక్ష్మి. అప్పటికి వీరి ధర్మపత్నికి ఎనిమిదేళ్ళు కూడ నిండలేదు. తండ్రి తనే విద్యగరపటంకాక, అనేక మంది గురువులు గొర్తి విశ్వనాధశాస్త్రి, జయంతి సత్యనారాయణశాస్త్రి, పార్వతీశ్వరశాస్త్రిగారల వద్ద శిక్షణ ఇప్పించటం వలన సూర్య ప్రకాశశాస్త్రిగారు తూర్పు గోదావరి జిల్లాలో తమ ఊరు చుట్టు ప్రక్కలున్న అనేక ఊళ్ళు తిరుగుతూ (అనంతవరం, అన్నంపల్లె, ముక్తేశ్వరం,

పాలగుమ్మి, కొమ్మనపల్లి) అనేక వైదిక రంగాలలో విద్య నేర్చి నిష్ణాతులయినారు. ఆ తర్వాత మద్రాసు యూనివర్సిటీ వారు నిర్వహించే ఉభయ భాషా ప్రవీణ, విద్యా ప్రవీణ వంటి వాటిని పూర్తి చేసి ఉద్యోగార్థం తెనాలి రావటం జరిగింది.

ఆనాటికే తెనాలి ఎంతో మంది వేద పండితుల నిలయం. కుప్పా బైరాగిశాస్త్రి, త్రిపురారిభట్ల వీర రాఘవస్వామి, జమ్ములమడక మాధవరాయశర్మ, సూరి రామకోటిశాస్త్రి, కావూరి సుబ్బరామయ్య గారు, బొడ్డుపల్లి విశ్వనాధశాస్త్రి గారలు తెనాలి పాండితీ లోకంలో మణిదీపాలుగా వెలుగొందుతున్నారు. కొందరు ఆత్మదర్శన సంపన్నులు, యోగుల స్థాయివారు. వారి సాన్నిధ్యంలో, వారు నడయాడిన ఈ భూమిపైనే తన నివాసం ఉండాలని వారు ఇక్కడే స్థిరపడ్డారు. ఆ ప్రయత్నంలో భాగంగానే గవర్నమెంటు పరీక్షలో ఉత్తీర్ణులై 1939లో ఇక్కడే తాలూకా హైస్కూల్‌లో తెలుగు భాషా పండితుడిగా చేరారు. పదవీ విరమణ వరకూ తెనాలిలోనే వివిధ ప్రాంతాలలో ఉన్న ప్రభుత్వ పాఠశాలలో తెలుగు బోధించారు.

1940 నుంచి 1960 వరకూ వారు పాదయాత్ర చేస్తూ ఉత్తర, దక్షిణ భారత ప్రముఖ పుణ్య క్షేత్రాలన్నీ దర్శించారు. ఆ సమయంలో వీరు ఉత్తరప్రదేశ్‌లోని ఘోరక్‌పూర్‌లో ఉన్న గీతా ప్రెస్ వారి వద్దకు వెళ్ళి వారు పుస్తకాలు ప్రచురించే విధానం, దాని యాజమాన్య పద్ధతుల గురించి క్షుణ్ణంగా అడిగి తెలుసుకొన్నారు. అప్పుడే వారికో ప్రేరణ కలిగింది – తాను కూడ తెలుగు భాషలో అలాంటి ప్రయత్నమే చేయాలని. ఆ సంకల్పమే సాధనా గ్రంధ మండలికి బీజం నాటింది. తదనుగుణంగా 1945లో ప్రారంభించారు. తొలుత శంకరాచార్యులవారు రాసిన గ్రంథాలను 'శంకర గ్రంథరత్నావళి' పేరుతో అచ్చు వేయటం

ప్రారంభించారు. తర్వాత కంచి పరమాచార్యవారు చేసిన ఉపన్యాసాలను 'జగద్గురువు' బోధలు అంటూ అచ్చు వేశారు. పోతుకూచి శ్రీరామశాస్త్రిగారు రాసిన మంత్ర శాస్త్ర గ్రంథాలు, అలానే వారి గురువులు ఈశ్వర సత్యనారాయణశర్మ గారు రాసిన గ్రంథాలు అచ్చు వేయటం ప్రారంభించారు. వీరు శ్రీకాకుళం అరసవిల్లి వాసి. సూర్యప్రకాశశాస్త్రిగారు అచ్చు వేసేందుకు కావలసిన ధనాన్ని తన సొంత సముపార్జనతో సమకూర్చేవారు. కొంత మేరకు ఆవిధంగా ప్రచురణలు చేశాక, వాటిని చూపి సౌజన్యులైన పండితులను, జమీందారులను, వ్యాపారులను ధన సహాయం చేయమని అర్థిస్తే వారు వీరు సొంత ఖర్చుతో చేస్తున్న ఈ మహాయజ్ఞానికి తమ వంతుగా కూడ కొంత విరాళాలు ఇచ్చేవారు. ఇలా తన సొంత సంపాదన, దాతల విరాళం కలిపి వారి పుస్తక ప్రచురణ యజ్ఞం అప్రతి హతంగా ముందుకు సాగించారు.

ఆ రోజుల్లో మౌఖిక ప్రచారమే తప్ప, అడ్వర్‌టైజ్‌మెంట్లుండేవికావు. బులుసు సూర్యప్రకాశశాస్త్రి గారు తన ఈ ప్రయత్నం నిర్విఘ్నంగా కొనసాగడానికి చేయని ప్రయత్నం లేదు. ఒకవైపు తన ధ్యాన, సంధ్యా వందనాది అనుష్టానాలు, అభిషేకాలు, పూజలు, మంత్ర జపం చేస్తూనే మరోవైపు పరమ పూజ్యులైన ఆచార్యులు కంచి, శృంగేరీ, పుష్పగిరి నుంచి వేంచేసినప్పుడు వారిని ప్రేమతో తన స్వగృహానికి తొడ్కొని వచ్చి వారికి శుశ్రూషలు చేసి, భిక్ష పెట్టేవారు. అలాగే తను అచ్చువేసిన పుస్తకాలను, వారి ప్రసంగాలను వారికి చూపించి వారి ఆశీస్సులు పొందేవారు. ఇలా పరమాచార్యులైన శృంగేరి, కంచి, పుష్పగిరి పీఠాధిపతులు తమ భక్తులకు సాధన గ్రంథ మండలివారు అచ్చువేసిన పుస్తకాల గురించి ఒక ముక్క చెప్పటం వలన ఈ సాధనా గ్రంథమండలి

ఆనోటా, ఈనోటా పడి ఆంధ్రదేశం అంతా వ్యాపించింది. పలుచోట్ల నుంచి ఆశక్తికలవారు తమకు పుస్తకాలు కావాలని ధనం పంపటం, వారికి పోస్టులో బుక్ పార్సిల్ ద్వారా పుస్తకాలు పంపటం తానే స్వయంగా చేసేవారు బులుసు సూర్యప్రకాశశాస్త్రిగారు.

తను క్రొత్తగా వెలువరచిన ఆధ్యాత్మిక గ్రంథాలను ఎవరైన భక్తులు పరమాచార్యులు దర్శించడానికి కంచి, శృంగేరి, పుష్పగిరి వెళ్తుంటే వాళ్ళ ద్వారా పంపేవారు సూర్యప్రకాశశాస్త్రిగారు. అలాగే ఎవరైనా తెనాలి వారు తెలుగు భక్తులు పరమాచార్యులను దర్శించడానికి వెళ్తే తప్పనిసరిగా వారిని బులుసు సూర్యప్రకాశశాస్త్రిగారి గురించి ఆరా తీసి, వారికి తమ ఆశీస్సులు, ప్రసాదాలు, అక్షతలు పంపేవారు ఆచార్యులు. ఇలా వారికి, పరమాచార్యులకు మధ్య విడదీయలేని ఒక ఆధ్యాత్మిక బంధం ఏర్పడి అది వారి జీవితం చివరికంటా సాగింది.

వీరిని దర్శించడానికి ప్రస్తుతం ప్రముఖ ప్రవచనాచార్యులుగా పేరొందిన గరికపాటి, చాగంటి, సామవేదం షణ్ముఖశర్మ, మాడగుల నాగ ఫణి శర్మవంటి ఎందరో తెనాలి వచ్చి 'చతుస్సాగార పర్యంతం' అంటూ ప్రవర చెప్పి కాళ్లు కడుక్కొని లోపలికి వచ్చి వీరి దగ్గర కూర్చుని వీరితో ఆధ్యాత్మిక విషయాలు చర్చించేవారు. వీరి ఆధ్యాత్మికత, వాక్శు ద్ధి, పవిత్రత ఏ స్థాయికి వెళ్ళిందంటే వారు నోటితో ఏమని ఆశీర్వదిస్తే అది జరిగేది. అందుకే కామోసు తాడేపల్లి రాఘవనారాయణ శాస్త్రి గారు (చందోలు శాస్త్రిగారు) బులుసు సూర్యప్రకాశశాస్త్రిగారిని 'వేదమూర్తులు'గా అభివర్ణించారు. అంతేగాక శంకరులు రాసిన స్తోత్రాలకు (8, 9, 10, 11 సంపుటాలకు) స్వయంగా తాడేపల్లి రాఘవనారాయణ శాస్త్రి గారే టీ.కా సహిత తాత్పర్య రచన చేశారు. వీరివురి మధ్య స్నేహం లౌకికం

కాదు. ఆధ్యాత్మికం అనటంలో ఏ సందేహంలేదు.

తన జీతంలో కొంత ఇంటి ఖర్చుకు పోగా, మిగిలిన డబ్బును, దాతలు ఇచ్చిన డబ్బులను, ఎవరైనా సన్మానాలకు పిలిచి ఇచ్చిన డబ్బులను అన్నింటినీ సాధనా గ్రంథ మండలి ద్వారా పుస్తక ప్రచురణ, వితరణకు వారు వెచ్చించారు. సొంతానికి ఏమీ దాచుకోక ఆర్ష విజ్ఞానాన్ని నశించి పోకుండా కాపాడిన కర్మయోగి ఆయన. ఆఖరికి తను రిటైరైనాక వచ్చిన పెన్షన్ రూ. 3000/–ల్లో కూడ సగం పైగా ఈ పుస్తక ప్రచురణ యజ్ఞానికి వాడేవారు.

దాదాపు నాలుగు తరాల వారి ఆధ్యాత్మిక గ్రంథాలను వారు సాధనా గ్రంథ మండలి ద్వారా ప్రకటించారు. గత శతాబ్దం యోగుల్లో ముఖ్యమైన బెల్లంకొండ రామరాయకవి, తాడేపల్లి రాఘవ నారాయణశాస్త్రి (చందోలు శాస్త్రి), వావిలికొలను సుబ్బారావు, జిల్లెలమూడి అమ్మ, ఇలా ఎందరి గ్రంథాలో లెక్కచెప్పలేము. దాదాపు 250 టైటిల్స్‌ను ఆంధ్రరాష్ట్రం నలుమూలల నుంచి 500 పైగా పుస్తక విక్రేతలు, ఆధ్యాత్మిక భక్తులు నేటికీ వీరి వద్ద నుంచి తెప్పించుకొంటుంటారు అతి తక్కువ ధరకు.

వీరి పుస్తక ప్రచురణలో గొప్పతనం ఏమిటంటే ఒకప్పుడు లెటర్ ప్రెస్ విధానంలో అచ్చయ్యే వీరి పుస్తకాలు నేడు ఆఫ్‌సెట్‌లో కూడ అచ్చు వేస్తున్నారు. అయినా స్వలాభాపేక్షలేకుండా, నష్టం లేకుండా ఎంత ఖరీదు అచ్చుకు అయితే దాని ప్రకారమే పుస్తక ధర నిర్ణయం చేస్తారు. వ్యాపారాత్మకంగా పుస్తకాలు అచ్చు వేసేవారు, తమకు అచ్చు వేసినందుకు అయ్యే ఖర్చుకు రెండు రెట్లు పుస్తకం ధర నిర్ణయిస్తారు. కాని నేటికీ సాధన గ్రంథ మండలి ఈ ఆధ్యాత్మిక యజ్ఞాన్ని లాభాపేక్షలేకుండా నిర్వహించటం ఎంతో గర్వకారణం. పైగా ఎన్నో పురాతన ఆధ్యాత్మిక గ్రంథాలను నేటికీ వెలుగులోకి తెస్తున్న ఏకైక సంస్థ సాధన గ్రంథ

మండలి. అలా సాధన గ్రంథ మండలిని గత 77 సంవత్సరాలుగా స్థిరంగా నడిచేలా రూపకల్పన చేసిన మహా శిల్పి బులుసు సూర్యప్రకాశశాస్త్రి.

బులుసు వారిని 2004లో అజో-విభో-కందాళం సంస్థవారు రూ. 50,000.00లు ఇచ్చి 'లైఫ్ టైం ఎఛీవ్‌మెంట్' అవార్డుతో సత్కరించారు. అప్పటికి వారికి 97 వసంతాలు నిండాయి. వారికి 2008లో గల జన్మ దినం తన సంతానంతో జరుపుకోవాలని సంకల్పం కలిగింది. తన సంతానం (ముగ్గురు మగ పిల్లలు, ఇద్దరు ఆడపిల్లలు) అందరికీ విషయం తెలియపర్చారు. అంతేగాదు 2009 నాటికి తాను బ్రతకనని, ఇదే తన ఆఖరి జన్మదినమని కూడ తెలిపారు. అలాగే మొత్తం కుటుంబ సభ్యుల మధ్య వారు తన జన్మదినం జరుపుకొన్నారు. చెప్పినట్లేవారు 2009 జన్మదినముకు ముందే తన 102వ ఏట కాలం జేశారు. అంతకు పూర్వమే 1992లో సూర్యప్రకాశశాస్త్రి గారి ధర్మపత్ని కాలంచేశారు. ప్రస్తుతం వీరి మగ సంతానంలో ఒక్కరు మాత్రమే మిగిలారు. వారి పేరు బులుసు హరిశంకరశర్మగారు. వారు, వారి ధర్మపత్ని బులుసు సూర్యప్రకాశశాస్త్రి గారు వెలిగించిన ఈ ప్రచురణ యజ్ఞాన్ని అదేవిధంగా నేటికీ కొనసాగిస్తున్నారు.

తొలుత సూర్యప్రకాశశాస్త్రిగారు శంకర భగవత్పాదులు మొత్తం రచనలకు 25 సంపుటాలుగా తేవాలని సంకల్పించారు. అనేక ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతూ 21 సంపుటాలు తేగలిగారు. వారు కాలం చేశాక వారి పుత్రుడు హరిశంకరశర్మ గారు మిగతా నాలుగు సంపుటాలు వెలుగులోకి త్రెచ్చారు. అంతేగాక దశోపనిషత్తుల్లో ఇప్పటికి ఆరు ఉపనిషత్తులు ముద్రించారు. మిగతా నాలుగు ముద్రణలో వివిధ

స్థాయిల్లో ఉన్నాయి. అలాగే బ్రహ్మసూత్రాలు, భగవద్గీత వంటివి అచ్చువేసి భక్తులైన పాఠకులకు అందుబాటులో ఉంచారు. ప్రస్తుతం పాత, కొత్త అన్నీ కలిపి 300 దాకా టైటిల్స్ అందుబాటులో ఉన్నాయి.

సూర్యప్రకాశశాస్త్రిగారు సంపాదించినదంతా సంస్థ నిర్వాహణకే ఖర్చు చేయటం వలన వారు జీవిత చరమాంకం వరకూ అద్దె ఇంట్లోనే ఉండేవారు. చివరకు ఆ అద్దె ఇల్లు అమ్మకానికి వచ్చినప్పుడు పలువురు దాతలు కలిసి చేయి వేసి ఆ ఇల్లు సూర్యప్రకాశశాస్త్రి గారికే చెందేలా చూశారు. ఆ పాత ఇల్లు పడగొట్టి ఒక అంతస్థు మేడను నిర్మించి ఇచ్చారు. పైన అన్నదమ్ములు గతించగా మిగిలిన కుటుంబం ఉంటుండగా, క్రింద హరిశంకరశర్మ గారు ఒక చిన్న భాగంలో ఒదిగి ఉంటూ, మిగతా భాగాన్ని ముద్రించిన పుస్తకాల అల్మారాలలో నింపేశారు.

బులుసు సూర్యప్రకాశశాస్త్రిగారు ఎంతో గొప్ప ఆధ్యాత్మిక సాధకుడు, పండితుడైన తనకూ, తన కుటుంబానికి ఏమీ మిగల్చని ధర్మాత్ముడు. తండ్రి నుంచి ఏవిధమైన ఆస్తిపాస్తులు సమకూరకపోయినా ఉన్నదాంట్లోనే నిరాడంబరంగా జీవిస్తున్న ధన్యజీవి బులుసు వారి కుమారుడు హరిశంకరశర్మ.

మారుతున్న సాంకేతికత, చట్టాలు, న్యాయ సూత్రాలు సరిగ్గా తెలియని హరిశంకరశర్మ అనేక విషయాల్లో చాలా జాగ్రత్తగా వ్యవహరించవలసి వస్తున్నది. తన తండ్రి గారి కాలం నుండి తమ కుటుంబానికి ఎంతో ఆప్తుడైన కల్లూరి సూర్యనారాయణశాస్త్రి (ప్రముఖ హైకోర్టు అడ్వకేటు) గారి సహాయ, సహకారాలతో ప్రస్తుతం తన సంస్థ ముద్రణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. జిజ్ఞాసులైన ఆధ్యాత్మిక వాదులైన వారు తమ రచనలు సాధన గ్రంథ మండలి వారికి అచ్చుకు ఇవ్వవచ్చు.

వారి సొంత ఖర్చుతో అచ్చువేసిన పుస్తకాలను కూడ సాధన గ్రంథ మండలి ద్వారా పదిమందికి అందేలా చూసుకోవచ్చు. ఒకవేళ సాధన గ్రంథ మండలి వారే ఆ ఆధ్యాత్మిక గ్రంథాలను, మంత్ర గ్రంథాలను అచ్చు వేయాలని భావిస్తే కాపీ రైటు హక్కులు సాధన గ్రంథ మండలికి ఇవ్వవలసి ఉంటుంది.

నేటికీ ఆధ్యాత్మిక పరిమళం గుభాళిస్తున్న సాధన గ్రంథ మండలి, బులుసు సూర్యప్రకాశశాస్త్రి గారి కుటుంబం ధన్యులు.

(దర్శనం ఆధ్యాత్మిక మాసపత్రిక సెప్టెంబర్ 2023)

8

రామభక్తిలో తెలుగు రాష్ట్రాలది భారతదేశంలోనే అగ్రస్థానం, తెలుసా ?

భారతదేశంలోనే 'రామతత్వం' కు అగ్రాసనం వేసిన రాష్ట్రం ఏదైనా ఉందంటే అది 'ఆంధ్ర రాష్ట్రమే' (మునపటి తెలంగాణా కలిపి). ఇక్కడ 'రామతత్వం' అంటే 'రాముడే సర్వస్వము'గా భావించి కష్టాలలో, సుఖాలలో 'రాముడి'నే తలుస్తూ జీవనం సాగించటం. అంతటి రామభక్తిని కేవలం ప్రదర్శించటమే గాక, ఆ రామామృతంలో తలమునకలై కవితలు, కావ్యాలు, కీర్తనలు, ప్రబంధాలు లాంటివి రచించటం కూడా ఈ రాష్ట్రంలోనే జరిగాయి. నిజానికి 'రామతత్త్వం'కు పూర్తి పేటెంట్ హక్కులు ఎవరికైనా ఉన్నాయంటే ఆ హక్కులు తెలుగు వారికే ఉన్నాయి యావత్ దేశంలో.

కీర్తనలు, వాగ్గేయ కారుల పుట్టుక (కర్ణాటిక సంగీతం) రామభక్తితోనే

ఇలా అనడానికి కారణాలు చాలానే ఉన్నాయి. మొదటిది రామాయణ తెలుగు రచనలు ఈ రాష్ట్రంలో వచ్చినన్ని మరే రాష్ట్రంలో (దేశంలోనే) రాలేదు. రామభక్తి కీర్తనలో అద్భుత కీర్తన సృజన తెలుగులోనే జరిగింది. అన్నమయ్య తరువాతనే పురందర దాసు కన్నడంలో వాగ్గేయకారులయ్యారు. ఆ తరువాత తమిళంలో త్యాగరాజు కీర్తనలకు, రామదాసు కీర్తనలకు అనువాదాలు వచ్చాయి. తమిళంలో వాగ్గేయకారులెవ్వరు లేరు. ఈ కీర్తనల సృజనతో పాటే కర్ణ పేయమైన అమృత కర్ణాటిక సంగీత మధనం కూడా తెలుగు వారి నుంచే యావత్

దేశంకి అందింది. ఇలా అన్నమాచార్యులు (1408–1503) ఆద్యులు కాగా, 'భక్త రామదాసు'గా ప్రసిద్ధి చెందిన కంచర్ల గోపన్న (1620–1700) ఎన్నో కీర్తనలు రాశారు. ఇవి రామదాసు కీర్తనలుగా ఏంతో ప్రసిద్ధి చెందాయి. 'దాశరధీ కరుణాపయోనిధీ' అనే మకుటంతో 'దాశరదీ శతకం' కూడా రాశారు. చివరగా తిరువాయార్ కు చెందిన తెలుగువాడైన త్యాగరాజు (1767–1847) తెలుగులో సుమారు 30,000లపై చిలుకు కీర్తనలు తన ఇష్ట దైవమైన రాముల వారిపై సృజించారు. వీరందరూ ఆశువుగా శాస్త్రీయ సంగీతం మేళవించి అప్పటికప్పుడే కీర్తనలు గానం చేయటం వలన వీరికి 'వాగ్గేయ కారులు' అని లోక వ్యవహారంలో ఒక బిరుదుగూడ ఉంది. త్యాగరాజ స్వామి కీర్తనలలో చివర పంక్తిలో 'త్యాగరాజ' అని వారి సంతకం ఉంటుంది. అయితే 'త్యాగరాజ' అనే శబ్దానికి 'శివుడు' అని మరో అర్ధం కూడా ఉంది. త్యాగరాజ స్వామి కుటుంబీకులు శివభక్తులు. ఇంకోటి ఏమిటంటే తిరువాయార్ ప్రజలు ఎక్కువగా ఆరాధించేది శివుడినే. అక్కడి శివుడిని 'త్యాగరాజ' అని వ్యవహరిస్తారు. అన్నమయ్య కూడా రాముల వారిపై అనేక కీర్తనలు శ్రీ వెంకటేశ్వర స్వామి సన్నిధిలో పాడేవారు. అయితే అన్నమయ్య కీర్తనలలో చివరి పంక్తిలో 'వేంకటేశుడు' అని సంతకం ఉంటుంది. కాబట్టి త్యాగరాజ స్వామి తన కీర్తనలలో దానిని ఉభయార్ధకంగా కూడా వాడి ఉండవచ్చు.

రామాయణాలు లెక్కలేనన్ని

ఇక అన్నయ్యకు కొంచెం ముందు గోన బుద్ధారెడ్డి అనే ఆయన 'రంగనాథ' మకుటంతో 'రంగ నాధ రామాయణం' రాశారని కొందరి విశ్వాసం. అయితే ఈ విషయమై వివాదాలు ఉన్నాయి. కట్టమంచి రామలింగారెడ్డి గారు గోన బుద్ధారెడ్డే 'రంగనాథ రామాయణం' కర్త అని

తన పరిశోధన ద్వారా నిర్ధారించారు. రంగనాథ రామాయణం రచనా కాలం సుమారు 1300–1310 (కొందరు ఈ రామాయణ రచనా కాలంను 1270–80 మధ్యగా కూడా భావిస్తారు) మధ్య జరిగిందని కొందరి అభిప్రాయం. ఇది పూర్తిగా ద్విపదలో రాయటం జరిగింది. పాల్కురికి సోమనాధుడి బసవపురాణం తరువాత అంతా పూర్తీ ద్విపదలో ఉన్న రామాయణం ఇదే. ఇది తొలి తెలుగు ద్విపద రామాయణం. కీర్తనలు కాకుండా 'రామయణం' మీద వచ్చిన తొలి తెలుగు ప్రబంధం రంగనాథ రామాయణం. ఇది వాల్మీకి రామాయణం ఆధారంగా రాసినదే. ఈ 'రామాయణం' గోన బుద్ధారెడ్డి రాయటానికి ప్రేరణ ఏమిటో ఇంకా స్పష్టంగా తెలియదు.

ఇదే కాలంలో (14వ శతాబ్దం) పోతనామాత్యుడు రామభక్తితో రామప్రేరితమై భాగవత రచన చేసినట్టు భాగవత పీఠిక నుంచి తెలుస్తుంది.

పలికెడిది భాగవత మట, పలికించెడివాడు రామభద్రుం డట, నే
బలికిన భవహర మగునట, పలికెద, వేఱొండు గాథ బలుకగ నేలా ?

తాళ్ళపాక అన్నమాచార్యులు కూడా 'ద్విపద రామాయణం' రాసినట్టు ఆయన మనమడు తాళ్ళపాక చిన్నన్న తాత గారిపై రాసిన జీవిత చరిత్రలో పేర్కొనటం జరిగింది. ఇది ఒక్క కాపీనే తంజావూరు సరస్వతీ లైబ్రరీలో ఉన్నట్టు పరిశోధకులు గుర్తించారు. అలానే ఆంధ్ర యూనివర్సిటీలో లభ్యమైన రంగనాధ రామయణం చివరన ఈ అన్నమయ్య ద్విపద రామాయణం కొన్ని భాగాలున్నట్లు గుర్తించారు. ఈ కాలంలోనే ఎర్రాప్రగడ 'ఎఱ్ఱన రామాయణం' రాశారు అని తెలుస్తుంది. కానీ దాని ప్రతులు ఏవీ ఇప్పుడు ఎక్కడా లభ్యం కావటం లేదు.

అంతేగాక 16వ శతాబ్దంలో వరదరాజు (1650) అనే కవి

కూడా వరదరాజ రామాయణం రాశారు. వీరు తండ్రివైపు కృష్ణదేవరాయల వంశీకులకు బంధువులు. ఈ వరదరాజు అనే మహాకవి 'శ్రీరంగ మహాత్మ్యం', 'పరమ భాగవత చరిత్ర', 'ద్విపద రామాయణము' రాశారు. ఇవి తంజావూరు సరస్వతీ మహల్ లైబ్రరీలో నేటికీ ఉన్నాయి. సాధారణంగా రామాయణ రచనకు ప్రేరణాత్మకంగా కొన్ని ఆధ్యాత్మిక ఘటనలు ఉండటం భక్తి సాహిత్యంలో మనం తరుచూ గమనిస్తాము. అలాంటి దైవిక నిర్ణయం / ఘటన లేకుండా 'రామాయణ రచన' అంత సులువు గాదని రామభక్తుల ప్రఘాడ విశ్వాసం.

దాదాపు ఇదే కాలంలో 'భాస్కర' మకుటంతో నలుగురు 'భాస్కర రామాయణం' అనే రామాయణం రచించారు. అయితే భాస్కరుడు అనే పేరుతో కాకతీయ రాజు ఓరుగల్లు ఏలిక అయిన ప్రతాపరుద్రుడు (రెండు) వద్ద ఒకరు ఉండే వారని కొందరి పండితుల అభిప్రాయం. ఆయన వృద్ధుడు అవటంతో ఆయన కుమారుడు మల్లికార్జున భట్టు, శిష్యుడు రుద్రదేవుడు (ఈయనకే రెండవ ప్రతాప రుద్రుడు అని మరో పేరు ఉందని అంటారు), మనవడు హుళక్కి భాస్కరుడు, చివరగా అయ్యలార్యుడు 14వ శతాబ్దంలో ఈ రామయణ రచన పూర్తి చేశారని కొందరి శోధనల విశ్వాసం. దీనిని తొలి 'చంపు రామాయణం' గా పండితులు పరిగణిస్తారు. 'చంపూ' అంటే కొంత గద్యం, కొంత పద్యం ఉండేలా వర్ణనలతో నిండినది అని అర్థం. ఈ రామాయణం వాల్మీకి రామాయణం ఆధారంగా రాసిన అనేక చోట్ల మూలం నుంచి వేరుగా వెళ్తుంది. ఎక్కువ భాగం ఈ రామయణం సంస్కృతంలో ఉంటుంది కూడా. ఇవి గాక కొఱవి సత్యనారాయణ (వీరికి కొఱవి భీమన్న అనే మారు పేరు ఉంది) కూడా రామాయణం రాసారని వినికిడి. అలాగే చిత్రకవి అనంతకవి అనే మహాకవి

'సకల వర్ణనా పూర్ణ రామాయణము' రాశారని కూడా తెలుస్తున్నది. అయితే వీటి వివరాలు ఇంకా వెల్లడి కావలసి ఉంది.

శ్రీ వాల్మీకి విచరితమయిన శ్రీమద్రామాయణమును ఆధారముగా చేసుకొని, తేట తెలుగులో వచ్చిన పద్య కావ్యము మొల్ల రామాయణం. ఇందులో కందపద్యాలు ఎక్కువగా ఉండడం వల్ల దీనిని కంద రామాయణం అని కూడా అంటారు. దీనిని 16వ శతాబ్దికి చెందని మొల్ల అను కవయిత్రి రచించారు. ఈమె పూర్తి పేరు ఆతుకూరి మొల్ల. ఈమె ఆంధ్రదేశములోని కడప జిల్లాలోని గోపవరము అను గ్రామములో నివసించినదని చరిత్రకారుల అభిప్రాయము. మొల్ల రామాయణములోని మొదటి కొన్ని పద్యాలలో తాను ఒక కుమ్మరి కుమార్తెనని, తన తండ్రి శివభక్తుడనియు పేర్కొన్నది. సబ్బండ జాతుల నుంచి వచ్చిన తొలి ఛందో బద్ధమైన రామాయణం ఇది.

మొల్ల ఏవిధమైన సంప్రదాయ విద్యను అభ్యసించలేదు. తన సహజ పాండిత్యమునకు ఆ భగవంతుడే కారణమని మొల్ల చెప్పుకొన్నది. తాను రచించిన రామాయణమును నాటి రోజుల్లో అనేక కవులు చేస్తున్నట్లు గాక ధనము, కీర్తిని ఆశించక ఏ రాజులకునూ అంకితము న్విలేదు. ఇది ఆమె రామభక్తికి నిదర్శనము. మొల్ల రామాయణము ఆరు కాండములలో సుమారు 870 (పీఠికతో కలిపి) పద్యములతో కూడుకున్నది. అంతకు మునుపే పలువురు రామాయణమును గ్రంథస్థం చేసిన విషయమును ప్రస్తావిస్తూ తన పద్య కావ్యములోని మొదటి పద్యములలో ఇలా రాసింది.

రాజిత కీర్తియైన రఘురాము చరిత్రము మున్ గవీశ్వరుల్
తేజ మొలర్ప చెప్పి రని తెల్సియు గ్రమ్మర జెప్పనేలనన్

భూజన కల్పకం బనుచు, భుక్తికి ముక్తికి మూలమంచు, నా
రాజును దైవమైన రఘురాము నుతించిన దప్పు గల్గునే ?

అంతేగాదు స్త్రీ కవులలో రామాయణం రాసే సాహసం చేసిన తొలి కవయిత్రి. మొల్ల తరువాత మరే తెలుగు కవయిత్రి రామాయణం రాసే సాహసం చేసిన దాఖలాలు లేవు.

ఆంధ్ర వాల్మీకి

19వ శతాబ్దంలో 'ఆంధ్ర వాల్మీ'కిగా ప్రసిద్ధి చెందిన వావిలికొలను సుబ్బారావు (1863–1936) వాల్మీకి రామాయణాన్ని సంస్కృతం నుంచి యథాతథంగా తెలుగులోకి అనువదించారు. వాల్మీకి వాడిన ఛంధస్సులే గాక, వాల్మీకి రామాయణం లోని శ్లోకాలలో ఉండే మంత్రం బీజాలను యథాతథంగా తెలుగు పద్యాలలో నిక్షిప్తం చేశారు. ఆ విధంగా వావిలికొలను సుబ్బారావు గారు రాసిన రామాయణం తొలి యథాతథ రామాయణంగా విశ్వ వ్యాప్తి చెందింది. కడప వాసి అయిన సుబ్బారావు తొలినుంచి రామభక్తుడు. ఒంటిమిట్ట రాములవారు వీరి ఇష్టదైవం. రామాయణమేగాక వీరు రాముల వారిపై భక్తితో 'టెంకాయచిప్ప' శతకం రాశారు.

ఆంధ్ర వాల్మీకి హస్తంబు నందు నిలిచి రూప్యములు
వేన వేలుగా ప్రోగు చేసి దమ్మిడైనను వానిలో
దాచుకొనక ధరణి జాపతి కర్పించి ధన్యవైతి
కర్మ గుణపణిముల కుప్ప ! టెంకాయ చిప్ప !"

రాములవారు వీరికి స్వప్నంలో కనిపించి రామాయణం రచించమని చెప్పటమే గాక అప్పటికే శజదిలావస్థలో ఉన్న ఒంటిమిట్ట రామాలయాన్ని పునరుద్ధరించమని అజ్ఞాపించటంతో ఈయన ఆంధ్ర

దేశమంతా తిరిగి, టెంకాయచిప్పతో భిక్షమెత్తి ఆ ధనం మొత్తాన్ని ఒంటిమిట్ట రామాలయం నిర్మాణానికి ఇచ్చారు. అంతేగాక తన సంపాదన, ఆస్తి మొత్తం ఒంటిమిట్ట రామాలయానికి అంకితం చేశారు. ఆయన వ్రాసిన రామాయణాన్ని మహాసభా మద్యంలో ఒంటిమిట్ట రామాలయంలో శ్రీరామునకు అంకితం ఇచ్చారు. అప్పుడు బళ్ళారి రాఘువ అధ్యక్షతన జరిగిన సభలో మహాపండితులు ఆయనకు 'ఆంధ్ర వాల్మీకి' అని బిరుదు ప్రదానం చేసారు. ఆయన దేశం మొత్తం పరివ్రాజకుడిగా తిరుగుతూ ప్రతిచోట కొంత కాలం ఉండి 'రామనామ' మహిమను, రామ తత్వాన్ని ప్రచారం చేశారు. సన్యసించిన తరువాత సుబ్బారావు గారు తనకు తాను 'వాసుదాస స్వామి'గా నామకరణం చేసికొన్నారు. వారి శిష్య గణం అంతా 'దాస' సంప్రదాయం క్రింద ఉండాలని నిర్దేశించారు.

వీరు తమ పర్యటనలో భాగంగా తెనాలి ప్రాంతంలో పర్యటించి అక్కడ 'దాసాశ్రమాలను' స్థాపించారు. అందులో ఒకటి తెనాలి దగ్గర ఉన్న నడిగడ్డపాలెంలో స్థాపించారు. మరొకటి అంగలకుదురులో నెలకొల్పారు. ఇక్కడ వారు కొంత కాలం భిక్షాటన చేయటమే గాక, పూజలు పునస్కారాలు కూడా జరిపారు. ఆ విగ్రహాలు నేటికీ నడిగడ్డపాలెం, అంగలకుదురులో ఉన్నాయి. వారి ఇతర రచనలు : శ్రీ కౌసల్యా పరిణయం, శ్రీ కుమారాభ్యుదయం, శ్రీ కృష్ణ లీలామృతం. ఇవి గాక 'భక్త సంజీవని' అనే మాస పత్రికను నడిపారు. ఆయన ఎంతటి మహా కవంటే నెల్లూరులో జరిగిన ఒక సభలో సభ అందరి ఎదురుగానే కొన్ని గంటలలో రంగనాయకునిపై నూరు పద్యాలు ఆశువుగా చెప్పి శతకాన్ని పూర్తి చేసారు. 'ప్రిన్స్ ఆఫ్ వేల్స్' యువరాజు భారతదేశాన్ని చూడటానికి వచ్చినప్పుడు, కళాశాల తెలుగు పండితుడు గనుక యువరాజును స్తుతిస్తూ

కవితలు చెప్పమని బ్రిటిషు ప్రభుత్వం ఆయన్ను ఆదేశించింది. బహుమతిగా బంగారు కంకణం ఇస్తామని ఆశ చూపింది. దాన్ని ఖరాకండిగా తిరస్కరించి తాను 'రామదాసునే' గాని 'కామదాసును' గానని తేల్చి చెప్పారు.

మద్రాసు ప్రెసిడెన్సీ కాలేజ్లో పరవస్తు చిన్నయ్యసూరి గారి పదవి విరమణ అనంతరం వీరే ఆ స్థానంలో తెలుగు ఆచార్యులుగా పదవి నలంకరించారు. వీరు తన జీవిత కాలంలో అనేక ఉద్యమాలలో భాగం అయ్యారు. అందులో ప్రధానమైనవి : వ్యవహార భాషా ఉద్యమం, వీరు వ్యవహార భాష వలన సాహిత్య విలువలు, సాహిత్యగరిమ పతనమవుతాయని వాదించారు. వీరికి వేటూరి ప్రభాకరశాస్త్రి, జయంతి రామయ్య పంతులు, విశ్వనాథ సత్యనారాయణ తమ సమర్ధన తెలిపారు. రెండవది 'బమ్మెర' పోతన అంత్య కాలంలో కడప ఒంటిమిట్టకే తన భాగవతం అంకితం చేశారన్న వాదన. ఈ రెండు ఉద్యమాలలో భాగస్వామ్యం ఉండటం వలన కొందరు సుబ్బారావు గారిని తీవ్ర పదజాలంతో నిందించటం జరిగినా ఆయన తన రామభక్తిని ఏనాడు వదలలేదు. స్వల్ప అనారోగ్యం కారణంగా వారు ఆగస్టు 1, 1936న దేహత్యాగం చేశారు. అంటే వారు కాలం చేసి ఈ ఆగస్టుకు 76 సంవత్సరాలు నిండి 77 ప్రవేశించింది. అన్నట్టు, విశ్వనాథ సత్యనారాయణ గారు, తాడేపల్లి వెంకటప్పయ్య శాస్త్రి గారు కూడా వాల్మీకి రామాయణానికి తుల్యమైన రామాయణ కావ్యాలు రచించారు. విశ్వనాథ వారి రామాయణానికి 'రామాయణ కల్పవృక్షం' అని పేరు. తాడేపల్లి వెంకటప్పయ్య శాస్త్రి గారు కూడా తన రామాయణాన్ని వావిలికొలను సుబ్బారావు గారిలా 24000 పద్యాలలో రాశారు. వాల్మీకి తన

రామాయణాన్ని 24000 పద్యాలలో గాయత్రీ మంత్ర బీజాక్షరాలలో నిబిడీకరించి రాశారని అనేక మంది యోగుల అభిప్రాయం. తాడేపల్లి వేంకటప్పయ్య శాస్త్రి గారు రాసిన రామాయణాన్ని ఆయన కుమారుడు తాడేపల్లి రాఘవ నారాయణ శాస్త్రి ('చందోలు శాస్త్రి') గారు ముద్రించారు. కంచి పరమాచార్య గారు విజయవాడ వచ్చి 'చందోలు శాస్త్రి' గారిని పిలిపించుకొని ఈ రామాయణ పద్యాలని అడిగి 'చందోలు శాస్త్రి' గారితో వినిపించుకొని ఆనందించే వారని నీలంరాజు ఆదిశేషయ్య గారు తన 'నడిచే దేవుడు' పుస్తకంలో రాశారు.

కళ్యాణాల పరంపర

అంతేగాదు, రామనవమికి కల్యాణాలు జరిపే సంప్రదాయం ఒక్క తెలుగు రాష్ట్రాలలోనే ఉంది. దేశములో ఎక్కడా కనపడవు. తెలంగాణాలో భద్రాచలంలో, ఆంధ్ర రాష్ట్రంలో విజయనగరం-బొబ్బిలి వెళ్ళే దారిలో పార్వతీపురం, కడప ఒంటిమిట్ట లోనే ఈ కల్యాణాలు ప్రభుత్వ ఆదరణతో జరుగుతాయి. అయితే, రాష్ట్రమంతా ఆనాడు రామనామంతో మారుమోగుతోంది. ప్రతి రామాలయం వద్ద పందిళ్లు, పానకాలు, వడపప్పు, విసిన కర్రలు విధిగా అందరికీ ఇవ్వడం నేటికీ కొనసాగుతుంది. తెలుగు వారి జీవిత ధారా 'రామనామం'. ఇలా తెలుగు రాష్ట్రాలలో 'రామ తత్త్వం', 'రామభక్తి' దేశంలో ఎక్కడా కానరానంతగా తెలుగు నాట పరిఢవిల్లింది.

(రుషిపీఠం ఆధ్యాత్మిక మాసపత్రిక, అక్టోబర్ 2023)

9
ఆత్మానుభవం సాధ్యమేనా?

నిజంగా 'ఆత్మ' అనేది ఉందా? ఆత్మానుభవం సాధ్యమేనా? అన్నది చాలా మందికి కలిగే సందేహం. ఇటువంటి సందేహం సహేతుకం కూడా. అయితే 'ఆత్మ' అనేది ఉంది, దానిని మనం 'అనుభవించవచ్చు' అని శాస్త్రాలు చెప్పటమే కాదు, అనేక మంది మహనీయులు ఆచరణలో కూడా చూపారు. అయితే మనం ముందు శాస్త్రాలు గురించి పరిశీలిద్దాము.

ప్రతి మనిషికి ఏదో ఓ సమయంలో దేహం వేరు, ఆత్మ వేరన్న భావం కలుగుతుంది. ఎలా? ఈ విషయం వివరించడానికి మనకొచ్చే కలల ఆధారంగానే 'ఆత్మ' అనుభూతిని వివరిస్తుంది శాస్త్రం. మనం నిద్రలో అప్పుడప్పుడు కలలు కంటాం. నిద్రలో ఒక వ్యక్తి నిద్రిస్తున్నప్పుడు నేలమీదనో, కుర్చీలోనో, మంచమీదనో అతని దేహం విశ్రాంతి స్థితిలో ఉంటుంది. మరి దేహం విశ్రాంతిస్థితిలో ఉన్నప్పుడు ఆ కలలో కనిపిస్తున్న దెవరు? అంటే అది వ్యక్తి 'ఆత్మ' ఉనికికి సంకేతం అంటుంది శాస్త్రం. మనిషి దేహభావంతో తనను తాను 'దేహంగా' పరిగణిస్తాడు కాబట్టి తనకు కలలో 'ఆత్మ' కూడా ఆ రూపంలోనే దర్శనమిస్తుంది. కలలో కనిపించే ఈ 'ఆత్మ' వ్యక్తికీ మెళుకువ రాగానే దేహంతో మమేకమై పోతుంది. కలలో కనిపించే ఈ 'ఆత్మ' కు దేహానికి ఎంతో సంబంధం ఉంటుంది. కలలో 'ఆత్మ 'భయపడితే, నిద్రిస్తున్న 'దేహం' కూడా ఆ భయానికి స్పందిస్తుంది. ఉలిక్కి పడుతుంది. గగ్గోలు ఎత్తుతూ లేస్తుంది.

ఆనందిస్తే 'దేహం'కూడా ఆనందం వ్యక్తం చేస్తుంది. ఇదే 'ఆత్మ'కు దేహాని'కి మధ్య నున్న విడదీయరాని సంబంధం.

ఈ సంబంధం మనిషి మెలకువగా ఉన్నప్పుడు ఏకాదశ ఇంద్రియాలతో దేహానికి ముడివడి ఉంటుంది. ఈ ఇంద్రియాల వలన మోహానికి గురై, వ్యక్తి తనను తాను 'దేహం' అని భావించి, 'ఆత్మ' ను దేహంనుంచి 'వేరు'గా గుర్తించలేకపోతున్నాడు. ఇక్కడుంకొక రహస్యం చెబుతుంది శాస్త్రం. కలలో కనిపించే 'ఆత్మ' కర్మేంద్రియాలకు, జ్ఞానేంద్రియాలకు ఆవల ఉండి 'అంతః కరణమైన 'మనస్సు, బుద్ధి' తో ముడివడి ఉంటుంది. ఈ కారణంగానే గాఢ నిద్రలో నున్న వ్యక్తిని, కలలో మునిగి తేలుతున్న వ్యక్తిని బాహ్యం నుంచి పిలిచినప్పుడు, ఆ విషయం 'ఆత్మ' మనస్సు, బుద్ధి ద్వారా గ్రహించి వెంటనే వ్యక్తి దేహంతో కలిసిపోయి వ్యక్తిని లేపేస్తుంది. కలలో 'ఆత్మ' కు కలిగే అనుభూతులన్నీ దేహానికి అన్వయించేవి మనస్సు, బుద్ధులే. ఎందుకంటే మిగతా ఇంద్రియాలన్నీ అచేతనంగా విశ్రాంతి స్థితిలో ఉంటాయి కాబట్టి.

నిజానికి ఆత్మకు రూపం ఉండదు. ఎవరైతే తాను 'దేహం' కాదని, 'ఆత్మ' ఒక్కటే సత్యమని సాధన చేసి దృశ్య రూప ప్రపంచంనుంచి ఇంద్రియ బంధాలను తెంచుకొంటాడో అతనికి నిద్దరే ఉండదు. కాబట్టి కలే రాదు. కలలో కనిపించేది ఎప్పుడూ కనిపిస్తుంది. దానికి రంగు, రూపు, రుచి, వాసనా ఏమీ ఉండవు. అది నిర్గుణం, నిర్వికారం. అది అవిచ్ఛిన్నమై దివ్యప్రకాశమై అత్యన్త రమణీయమై దర్శనమిస్తుంటుంది. ఇంద్రియాలతో వ్యక్త పరచే విధమైన స్థాయిలో ఉండదు. అప్పుడది 'ఆత్మ' కాదు. అదే 'పరమాత్మ' అవుతుంది. కాబట్టి దేహం, ఆత్మ రెండూ ఇంద్రియాల బంధాలతో కలిసి ఉన్నాయి కాబట్టి మనకు మాములుగా రెండూ వేరువేరు కాదని 'భ్రాంతి' కలుగుతుంది. ఏకాగ్రత , వైరాగ్యం,

సత్యాసత్య విచక్షణతో సాధన చేయటం ప్రారంభించిన కొద్దికాలంలోనే 'ఆత్మ' వేరు, 'దేహం' వేరు అనే సత్యం అనుభవ సాధ్యమవుతుంది. ఆ తరువాత ఏ సాధకుడు ఇంద్రియ సాదృశమైన ఈ ప్రపంచంతో 'ఇంద్రియ' సంబంధాలు కొనసాగించటానికి ఇష్టపడడు.

ఎందుకంటే ఇంద్రియ సంబంధమైనవన్నీ కాసేపు 'అనురక్తి', కాసేపు 'విరక్తి' కలిగిస్తూ స్థిత ప్రజ్ఞతో ఉండనీయవు. అంతే గాదు. ఇంద్రియ పరమైన రక్తానురక్తులను ఎల్లపుడూ అనుభవిస్తూ ఉండాలంటే 'దేహం' స్థిరంగా, ధృఢంగా ఉండాలి. కానీ, దేహం నశిస్తూ ఉండటం దాని స్వభావం. అలా రక్తానురక్తులు, దేహం రెండూ స్థిరం కావు. కాబట్టి,ఒక్క 'ఆత్మే' స్థిరం, శాశ్వతం అన్న భావం చెప్పకనే కలుగుతుంది. అలా 'ఆత్మ' సాక్షాత్కారం పొందిన వ్యక్తికే ఇంద్రియాతీత ప్రజ్ఞ ఉంటుంది.

ఇప్పటివరకూ శాస్త్రవివరణ స్పష్టంగానే ఉంది. ఇక దీనిని 'స్వానుభవం' లోకి తెచ్చుకొన్న వ్యక్తులు గురించి తెలుసుకొందాము. ముఖ్యంగా 20శతాబ్దపు రమణ మహర్షి తాను స్వయంగా అనుభవించటమే గాక, తన దగ్గరకొచ్చి, 'ఆత్మ', 'దేహం' రెండూ వేరు వేరా?'అని తెలుసుకో కోరిన వారందరికీ 'ఆత్మానుభూతి' ని వారిసాధనతోనే వారికి కలిగేలా చేశారు. ఇందులో విదేశీ, స్వదేశీ తేడా లేకుండా ఎందరికో 'ఆత్మానుభవం' కలిగించారు. అంతకు ముందు తరం శ్రీ రామకృష్ణ పరమహంస , స్వామి వివేకానందలు ఈ 'ఆత్మానుభవం' ను సాధన ద్వారా ఆచరించి, శాశ్వతంగా పొందే విధంగా శిష్యులకు బోధించారు. కాబట్టి, ఆత్మాసత్యమే, ఆత్మానుభవం సాధ్యమే.

10
ఎవరినివారే ఉద్ధరించుకోవటమంటే!

జీవితకాలమంతాఎదురు చూసినా ఎవరూ ఎవరిని ఉద్ధరించక పోవటం మనం ఎరిగినదే. ఎవరు ఎవరినైనా ఎందుకు ఉద్ధరించాలి? అందరు ఒకటేగదా. ప్రతి ఒక్కరిలో ఏదో ఒక సామర్ధ్యం, గొప్పతనం ఉంటాయి. నిజానికి కళ్లు, కాళ్లు లేనివారు కూడ తమలో ఉన్న సామర్ధ్యాన్ని గుర్తించి, ఆసమర్ధతపై జీవనం గడపాలని చూడటం మనంఎక్కడో చోట చూస్తూనే ఉంటాం. అయినా ఆనేక మంది కాలం కలిసి రాలేదంటూ తమ నిష్క్రియత్వానికి వింతవాదనలు జోడించి కాలం నెట్టేస్తుండటం కూడ చూస్తుంటాం.

తప్పుడు తర్కాలతో తమ సోమరితనం, చేతకానితనం సమర్ధించు కొనేవాళ్లు ఎప్పుడూఉన్నారు. మహభారత యుద్ధం ఆరంభానికి ముందు అపారమైన కౌరవసైన్యం చూసి, అయోమయానికి గురై, ధర్మరక్షకుడై నక్షత్రియుడిగా తన విద్యుక్తధర్మం నిర్వహించవలసిన సమయంలో బేలమాటలకు, వాదనలకు దిగుతాడు అర్జనుడు క్రుష్ణుడితో. అప్పుడు క్రుష్ణుడు 'ఉద్ధరేత్ ఆత్మనాత్మానాం నాత్మాన అవసాయదేత్, ఆత్మైవ: ఆత్మనో బంధురాత్మై వరిపురాత్మన:' అనిచెబుతాడు. ఈ పద్యంలో ఆత్మకు మూడర్ధాలు వివరిస్తాడు వ్యాసభగవానుడు. అత్యంత ప్రాధాన్యం ఉన్న ఈపద్యం, దానిలోని 'ఆత్మ' శబ్ద అర్ధాలు మానవ జీవితయానానికి దీపస్తంభాల్లాంటివి. ఇక్కడ'ఆత్మ'అంటేదేహం. ఆత్మహత్య అంటే కేవలం

దేహహత్యనే అర్థం. 'ఆత్మ'అంటేఈశ్వర ప్రతిబింబమైన జీవాత్మ వాచకం.ఆత్మ అంటే మనస్సు.

అలా 'అర్జునా అవసానం చెందకుండా నిన్ను నువ్వే ఉద్ధరించుకోవాలి. ఆత్మను (మనస్సును)ఆత్మకు బంధువుగా భావించితే ఉద్ధరించుకోగలవు. ఆత్మను (మనస్సును) ఆత్మకు శత్రువుగా చేస్తే నశిస్తావు' అని క్రుష్ణుడు స్పష్టం చేస్తాడు. ఆవిధంగా నిష్క్రియత్వంలోకీ పోయిన అర్జనుడిని తిరిగి కార్యోన్ముఖుడిని చేస్తాడు క్రుష్ణుడు.

నిజానికిమానవజీవితంలోఎప్పుడూఎదో ఒకరకంగా మనిషి నిష్క్రియాపర్వంలోకి ప్రవేశిస్తుంటాడు. కొందరు వ్యాపారంలో నష్టపోయి కట్టుబట్టలతో మిగులుతారు. కొందరు తుఫానులు, వరదలొచ్చి సర్వం వినష్టులై నైరాశ్యంలోకి, నిష్క్రియత్వంలోకి వెళ్తారు. కొందరు ఉద్యోగంలో సాటివారి కుట్రలకు బలై ఉద్యోగం కోల్పోయి నడిరోడ్డు మీద నిలబడతారు. కొందరు దారిద్ర్యం వలన, మరికొందరు రాగద్వేష శతృత్వాల వలన సర్వం నష్టపోతారు. అయినవాళ్లను కోల్పోతారు. ఈర్ష్యాద్వేషాల వలననే కదా పాండవులు సర్వస్వము పోగొట్టుకొని అడవుల పాలైంది. ఇలా ఇవన్నీ మాకే ఎందుకు జరుగుతున్నాయని చాలా మంది తరుచు అనటం వింటుంటాం.

నిజమే! అన్ని ప్రశ్నలకు ఈనాడు జరుగుతున్న వర్తమానం నుంచే సమాధానం వెతుక్కోవాలని చూస్తాం. కానీ, ఆకాశం కనుచూపు మేరలో ఏ సమాధానం లభించదు. కాబట్టి తమకెవరి వలననో, దేనివలననో అన్యాయం జరిగిందని భావించి, ఆక్రోశం పెంచుకొని, స్థిమితత్వం కోల్పోయి విధ్వంసాలకు, కక్ష్య, ప్రతీకారాలకుదిగి ఇంకా పతనమవటం

కన్నా, తన ప్రస్తుతస్థితికి కారణం బహుశగత జన్మలో తనాచరించిన కర్మలుకావచ్చునని గ్రహిస్తే మనస్సుకు శాంతి లభిస్తుంది. నిజానికి ఈశ్వరుడనే వాడొకడున్నాడని, వివేకవంతుడైన మనిషికి తెలియ చెప్పేందుకు ఆ పరమేశ్వరుడెంచు కొన్న అనేక మార్గాలలో ఇదొకటి కావచ్చునని ఆలోచించవచ్చు గదా!

ఎందుకంటే జీవుడికి ప్రతిజన్మలోను బాల్యం, కౌమారం, యౌవ్వనం, వార్ధక్యం అనే నాలుగుదశలున్నట్టే మరణించాక మళ్ళీ జన్మనేదశ కూడా ఉంటుంది. జ్ఞ్యానం లేకపోవటం వలననో లేక జన్మ, పునర్జన్మలపట్ల విశ్వాసం లేకపోవటం వలననో, లేక జరిగే అన్నింటికీ కార్యాకారణాలు ఈ జన్మలోనే ఉండి ఉండాలన్న వితండవాదన వలననో మనిషితానీ నాడు ఉన్నస్థితికి సరైన కార్యకారణ సంబంధం తెలుసు కోలేకపోతున్నాడు. ఈ విధమైన అజ్ఞ్యానస్థితి ఏ జన్మకాజన్మకే ఉండటం కూడా ఆ ఈశ్వరేచ్ఛఅయి ఉంటే, మనం ఈ జన్మే ఆఖరి లేక ఒకేఒక అవకాశంగా భావించి అనేక దుష్కర్మలు చేయవచ్చు. కానీ, ఆ దుష్కర్మల ఫలితాలు మనల్ని జన్మజన్మలు వెంటాడవచ్చు. అందుకే బుద్ధ భగవానుడు అన్నివేళలా అహింసానియమాన్ని, పరోపకారాన్ని ఆచరించమని బోధించాడు. ఎందుకంటే మన అహింసా వ్రతమే మనకు ఈ జన్మకు, జన్మజన్మలకు రక్షణ కవచంగా ఉంటుంది.

ఆ విషయం మనకీ జన్మలో తెలియ చెప్పేవి శాస్త్రాలు. తప్పితే కరుణామయుడైన ఈశ్వరుడు మాత్రమే. అందువల్లనే స్వామివివేకానంద తన చికాగో ఉపాన్యాసాలలో ఇలాచెప్పాడు మనిషి నేటిస్థితికి గతంలో చేసిన కర్మల ఫలితం కారణం అయితే, నేడు మనిషి చేసే కర్మల

ఫలితం రేపు అతని స్థితి ఏమిటో నిర్ణయిస్తుంది' అని. అందువల్ల మానవ నమ్మకాలతో నిమిత్తం లేకుండా మానవ జీవితం తర్కబద్ధంగానే ఈశ్వరుడు జరిపిస్తున్నారు'. అందువల్లనే, 'నీ పతనానికి నీవే కారణం అయితే, నిన్ను ఉద్ధరించుకోవడానికి కూడా నీవే శ్రమించాలి' అని ఆ మార్గాన్ని సవివరంగా శ్రీకృష్ణుడు అర్జునుడికి బోధించాడు గీతలో. అదే జ్ఞానం. ఒకసారి ఆ జ్ఞానం కలిగినవారు ఏ దుఃఖానికి లోనుగారు. తనజీవితాన్నిచాలాసుందరంగానడుపుకొంటారు.

11
క్రమశిక్షణ విజయ సోపాన రహస్యం

ఏ రంగంలో విజయం సహించాలన్న , వ్యక్తిగా మనిషి పరిణతి చెందాలన్న క్రమశిక్షణ చాలా అవసరం. క్రమశిక్షణ అంటే ఏదో ఒక నిర్దిష్ట సమయంలో ప్రతి దినం ఒక కార్యాన్ని చేయటమొక్కటే కాదు. వ్యక్తి తన దైనందిన జీవితాన్ని ఒక క్రమ పద్ధతిలో నడిపించుకోవటం కూడా. క్రమశిక్షణ అనేకానేక విషయాలకు వర్తింపచేయవచ్చు. ఏది, ఎంత వరకూ చేయాలి. ఏది ఎప్పుడు మాట్లాడాలి. ఏది మాట్లాడితే సంస్కారం అవుతుంది. ఏది నాగరికులుగా మనం మాట్లాడకూడదు వంటివి కూడా క్రమశిక్షణ వలననే సాధ్యమవుతాయి. శరీరాన్ని, మనస్సును రెంటినీ సమతూకంలో నియమించ్చేదే క్రమశిక్షణ. క్రమశిక్షణ మనిషి వ్యక్తిత్వ వికాసానికి ఎంతగానో తోడ్పడుతుంది.

మన జీవితానికి సంబంధించిన అన్నింటిపైన మనకు అదుపు ఉండటం కూడా క్రమశిక్షణలో భాగమే. మానవుడు సంఘ జీవి. పదిమందితో కలిసి మెలిసి ముందుకు సాగాల్సి ఉంటుంది. మానవ సమాజం అవతల ఉండే వారికి కూడా క్రమ శిక్షణ అవసరం. ఒంటరి జీవితం, ఏకాంత జీవితం మరింత క్రమశిక్షణ కోరుతుంది. క్రమశిక్షణ లేకపోతే మానవ జీవితం అతలాకుతలం అవుతుంది. ఒక్కోసారి క్రమశిక్షణ లేని వ్యక్తి చేసే పనులు, వారికే కాదు. సమాజానికి కూడా చేటు చేస్తుంది. ఒక్క ముక్కలో చెప్పాలంటే మానవజీవిత వికాసానికి, పరిణతికి క్రమశిక్షణ

ఎంతో అవసరం. చిన్న పోటీ పరీక్షకు సిద్ధమవటంనుంచి పెద్దపెద్ద లక్ష్యాలు సాధించే వరకు క్రమశిక్షణే ఆలంబన. ఈ క్రమశిక్షణ రెండు రకాలుగా ఉంటుంది. ఒకటేమో ఒక వ్యవస్థ బయటినుంచి మనమీద రుద్దే క్రమశిక్షణ. రెండవది మనకు మనమే ఏర్పరచుకొన్న క్రమశిక్షణ. బయటినుంచి మనమీద రుద్దే క్రమశిక్షణ కొన్ని సార్లు బాధాకరంగా, కఠినంగానూ ఉంటుంది ఆచరించేప్పుడు. దానికి ఎంతో సహనం ఉండాలి. అటువంటి శిక్షణను బాహ్యం నుంచి మనమీద రుద్దటం మొదట్లో మనకు ఇబ్బందికరంగా ఉన్నా కాలక్రమంలో ఆ శిక్షణ విజయవంతంగా పూర్తైన తరువాత మనకుగొప్ప సంతృప్తినిస్తుంది. ఆ సంతృప్తిని వర్ణించనలవి కాదు. అంత గొప్ప ఫలితంనిస్తుంది ఆ క్రమశిక్షణ.ఉదాహరణకు ఐ ఏ ఎస్ , ఐ పి ఎస్ , మిలిటరీ ఆఫీసర్లు అటువంటి శిక్షనే పొంది వస్తారు.

ఇక మనంతట మనం నిర్మించుకొన్న క్రమశిక్షణ కూడా మనం అలానేసాధ్యమైనంతవరకు నియమోల్లంఘన కాకుండా ఆచరించటంలోనే వ్యక్తి పరిణతి బయట పడుతుంది. నేను ఏర్పరచుకొన్న క్రమశిక్షణే కదా ఏం ఫర్వాలేదనుకొంటే అది ఆత్మ వంచనే అవుతుంది.

మనందరికీ గాంధీ మహాత్ముడు బాగా పరిచయమే. ఆయన సబర్మతీ ఆశ్రమం నిర్మించుకొని కొన్ని నిబంధనలు పెట్టి ఆ నియమాలన్నీ తనతో సహా ఆశ్రమంలో అందరూ పాటించాలని ఆదేశించాడు. ఆ నియమాల ప్రకారం గాంధీ గారు ఉదయానే ఏడు గంటలకు ఫలహారంకు వెళ్ళాలి. కానీ ఒకరోజు ఆలస్యంగా ఉదయం తొమ్మిదింటికి వెళ్లారు. ఆసరికే ఫలహారం ఇచ్చే సమయం దాటిపోవడంతో వంటయింటిని మూసేసి వెళ్లిపోయారు వంటవారు. అయితే గాంధీజీ ఆలస్యంగా రావటం

చూసిన వంటమనిషి గబాగబా వచ్చి తలుపు తీయబోయాడు. గాంధీ అది తప్పని, నియమం అందరికీ ఒకటేనని చెప్పి వెనక్కి తిరిగి వెళ్ళిపోయాడు.

ఇవాళ మహనీయులని మనం భావించే వారంతా స్వీయ క్రమశిక్షణతో జీవితంలో ఉన్నత' స్థాయికి చేరినవారే. రవీంద్రనాథ్ టాగోర్నుంచి నిన్న మొన్నటి అబ్దుల్ కలాం వరకు, దేశ విదేశాల్లోని టాల్స్టాయ్, డార్విన్, ఫెరడే, లూయి పాశ్చర్,న్యూటన్,ఐన్ స్టీన్ వంటి అనేక మంది మహామహులు క్రమశిక్షణ వల్లే జీవితంలో ఉన్నత స్థాయికి చేరారు. ఒక్కప్పటి మన గురుకుల విద్యా వ్యవస్థ క్రమశిక్షణ నేర్పి తరువాతనే విద్య గరిపింది. క్రమశిక్షణ లేకుండా అదృష్టవశాత్తు కొందరు జీవితంలో ఉన్నత స్థాయికి చేరి ఉండవచ్చు. కానీ, ఆ స్థాయికి చేరాకానైనా క్రమశిక్షణ పాటించకపోతే పతనం తప్పదు. అలా పతనమైన వారు కూడా కోకొల్లలు. క్రమశిక్షణతో ఒక పద్ధతిలో జీవితనిచ్చేన అధిరోహించేవారు అంత సులువుగా పతనం కారు. కొన్ని ఎంపిక చేసిన లక్ష్యాలను (అవి ఏవైనా సరే) ఒక క్రమపద్ధతిలో చేరటానికి గీటురాయి క్రమశిక్షణే. ఇది మనిషి పరిణతికి, సౌశీల్యానికి కూడా ఆధారం అని గ్రహించాలి.

12
మానవ మేధస్సు - ప్రశాంతత - ఆధ్యాత్మికత

మనిషి మేధస్సుకు, మనస్సుకు మధ్య ఉన్న లంకెలోనే తన ఆనందానికి, మనశ్శాంతికి అర్థం వెతుక్కుంటున్నాడు ఎప్పటి నుంచో. వీరిలో ఏకొద్దిమందో ఆధ్యాత్మికత ద్వారా పరిష్కారం ఏమైనా లభిస్తుందో చూద్దామని ప్రయత్నిస్తారు. మిగతా వారంతా ఈ లంకెలోనే కాలం గడిపివెళ్లిపోతారూ. శాస్త్రవిజ్ఞానంఎన్ని కొత్తపుంతలు త్రొక్కినా మానవ మస్తిష్కంపైనా, ముఖ్యంగా మేధస్సుకు – మనస్సుకు మధ్యనున్న లంకె పైనా, శాస్త్రవేత్తలకు నేటికీ పూర్తి పట్టు లభించలేదు. ఇందుకు కారణం మానవ మస్తిష్క నిర్మాణం జీవశాస్త్ర, భౌతికశాస్త్ర పరంగా ఒకేలాగున్నా క్రియాపరంగావ్యక్తి వ్యక్తికి వేరువేరుగా ఉంటుంది. ఈ వైవిధ్యం వలన మానవ మేథస్సు పూర్తి శక్తి పాటవాల చిత్రం వెలువరించటం శాస్త్రవేత్తలకు అధిగమించలేని ఓ సమస్యగా పరిణమించింది. అయితే భారతీయ ఆధ్యాత్మికత, యోగా, అందునా సాధనతో కూడిన యోగా, ఈ సమస్యను వ్యక్తిస్థాయిలో పరిష్కరించ గలిగి ఉండటం ఆహ్వానించ దగ్గర పరిణామం. భారతీయరుషులు పతంజలి నుంచి స్వామి వివేకానంద వరకూ యోగా ద్వారా మానవ మస్తిష్క ఔన్నత్యం, మేధస్సు వైవిధ్యం ఎలా ఛేధించవచ్చో ఎంతో వివరంగా బోధించారు.

ఇటీవల భారతీయ యోగా అంతర్జాతీయంగా బహుళ ప్రాచుర్యం పొందింది. ఈ యోగాను పలు సంస్థలు భిన్న లక్ష్యాల సాధనకు

ఉపయోగిస్తున్నాయి. భారతదేశంలో యోగా ఆధ్యాత్మికత నేపథ్యం కలిగి ఉండగా, దైవశక్తి నుంచి వేరుచేసి ఒక డ్రిల్గా, ఒక ఎక్సర్సైజ్గా దీనిని పరిగణిస్తున్నాయి అనేక ఇతరదేశాలు. ఏది ఎట్లున్నా యోగా ద్వారా ఒత్తిడి నుంచి విముక్తి లభిస్తుందని, కొన్ని అనారోగ్యాలకు పరిష్కారం లభిస్తుందని ఇవ్వాళ ప్రపంచం అంతా అంగీకరిస్తుంది.

యోగా ద్వారా ఏకాగ్రత, అసాధారణ జ్ఞాపకశక్తి, అనంతజ్ఞానం లభిస్తుందని స్వామివివేకానందులు స్వయంగా తెలిపారు. జ్ఞానం పొందాలంటే అకుంఠిత ఏకాగ్రత ఒక్కటేమార్గం. ఆఏకాగ్రతతో ఎంతటి క్లిష్ట సమస్యనైనా ఛేదించ వచ్చంటారు స్వామివివేకానంద. జ్ఞానం అంటే విషయసేకరణ కాదు, విషయాన్ని ఏకాగ్రత అంచున నిలబెట్టి ఛేదించటం. అటువంటి ఏకాగ్రతతో గతంలో జరిగినవే కాదు, గతజన్మలో జరగినవి కూడ్స్మృతికితేవచ్చు అంటాడు వివేకానందుడు. దానిని స్వామీజి 'మెర్క్యురిక్మెమరి', 'ఫ్లాష్మెమొరి' అన్నారు.ఎన్నో ఏళ్ల క్రితం స్వామీజి ఇచ్చిన ఉపన్యాసాలను స్వయంగా ఆయనే మళ్లీ ఒప్పచెప్పటం శాస్త్ర శాస్త్రజ్ఞులనే ఆశ్చర్యపరిచింది. కొన్ని వందల పేజీల పుస్తకాన్ని కొన్ని గంటల పఠనంతో కంఠతపట్టేవాడు వివేకానందుడు. అంతెందుకు, కంచి పరమాచార్యచంద్రశేఖర సరస్వతి గారు కూడ ఇటువంటి అసాధారణ్జ్ఞాపకశక్తి కలిగి ఉండేవారు. మనమధ్య సాధారణంగా తిరిగే కొందరు పండితులు కూడ సహస్రావధానం చేసి తమ అసాధారణ్జ్ఞాపకశక్తి ప్రదర్శించటంచూశాం. వీరికంటే కొన్నివేల రెట్లు అధికమైన్జ్ఞాపకశక్తి వివేకానందుడు, కంచి పరమాచార్య వంటి యోగ సాధన చేసిన వారిలో చూడవచ్చు.

కంటికి కనిపించే ఆకాశం ఎంత అనంతమై ఉందో, అంతటి మేధో ఆకాశం మనం పొందవచ్చు ఏకాగ్రత ద్వారా. ఇంత చిన్న కపాలంలో అనంత మేధో ఆకాశం ఎలా సాధ్యం అని ఎవరికైన సందేహం రావచ్చు. కంటికి కనపడని జీవకణ కేంద్రకంలో క్రోమోజోములు, వాటిలో జన్యువులు, శక్తికణాలు మైటోఖాండ్రియా ఉన్నాయి కదా. అలాగే కంటికి కనపడని పరమాణువులోని కేంద్రకంలో న్యూట్రానులు విచ్ఛిన్నం అయితే అనంత విచ్ఛిన్నశక్తి ఉద్భవిస్తుందని ఐన్‌స్టీన్ న్నిరూపించలేదా. అలాగే యోగా వలన కలిగే ఏకాగ్రతతో మెదడులో అనంత మేధస్సు ఆవిర్భవిస్తుంది. శారీరక ఆరోగ్యానికి చేసే యోగాకు ఎలా నియమాలు ఉంటాయో, యోగా ద్వారా ఏకాగ్రత, జ్ఞానం పొందాలను కొనేవారు నియమాలు పాటించాలి. ఇందుకు కొంత ఆధ్యాత్మిక పరిచయంచాలు. ఆధ్యాత్మికత అంటే తను తాను తెలుసుకొనే ప్రయత్నం. తానెవరు, ఎందుకు పుట్టినట్లు, ఎందుకు మరణిస్తున్నట్లు? ఈజనన, మరణాలకు ఏదైనా తర్కం ఉందా? అది తర్కరహితమా? అసలు ప్రశాంతత, ఆనందం నిజంగా ఉన్నాయా? ఉంటే హింసలో ఉన్నాయా, అహింసలో ఉన్నాయా? న్యాయమైన హింస ఉందా? ఏది ఏమైనా మానవ మస్తిష్క ఆనంద, ప్రశాంతతలకు, అద్భుతమైన మేధస్సుకు, జ్ఞానానికి, వ్యక్తిత్వ వికాశానికి భారతీయ ఆధ్యాత్మికత, యోగా చక్కని మార్గాలన్నది విస్పష్టం. ఇతర భౌతిక మార్గాలు, ఒత్తిడి, శ్రమకన్నా ఈ మార్గం సులభమైనది. ఆచరణీయమైనది.

(ఈనాడు అంతర్యామి ఆగస్టు 31, 2024)

13
అలవాట్లను మార్చుకోవటం ఎలా?

సాధారణంగా లోక నానుడిలో 'అలవాట్లను మార్చుకోవటం సాధ్యం కాదు'. కుక్క తోక వంకర', 'పుట్టుకతో వచ్చినవి పుడకలతో కానీ పోవు', ఎవంటి మాటలు వింటుంటాం. ఎందుకంటే మనిషి అన్నాక, కొన్ని అలవాట్లు, లక్షణాలు ఉంటాయి. అవి మంచివి కావచ్చు. చెడువి కావచ్చు. కానీ, ఒకసారి మనిషి జన్మెత్తాక ఏర్పడ్డ అలవాట్లు అంత సులభంగా పోవని పై నానుడుల అర్థం. ఆంగ్లంలో కూడా 'హ్యాబిట్స్ డై హార్డ్' అని ఒక నానుడి ఉంది. చాలామంది ఈ నానుడులను అడ్డుపెట్టుకొని తమ అవలక్షణాలను సమర్థించు కొంటుంటారుకూడా. కానీ, ఇది నిజం కాదని జనకమహారాజు,శునకం కథ చెబుతున్నది.

ఒకసారి ఒక శునకం తలపై అయిన గాయంతో, రక్తం ఓడుతూ జనకమహారాజు సభలోకి వచ్చింది. ఒక్కసారి సభలో కలకలం రేగింది. అలా అది హఠాత్తుగా రావటంతో జనకమహారాజు 'ఓ శునకమా! ఏమైంది? నీ తలపై ఆ గాయం ఏమిటి?'అని ఆతృతగా అడిగాడు. సభలో అందరూ ఆసక్తిగా చూస్తున్నారు ఆ శునకం ఏమి చెబుతుందోనని. అప్పుడు ఆ శునకం 'మహారాజా! దారినపోయే ఒక వ్యక్తి నన్ను తన చేతి కర్రతో చచ్చేలా కొట్టి, వెళ్ళాడు. నీ రాజ్యంలో ధర్మం నాలుగు పాదాల నడుస్తుందని విన్నాను. ఇలా జంతువులను హింసించటం నాలుగు పాదాల ధర్మం నడిచినట్టా? మీరే సెలవు ఇవ్వండి' అని ఆక్రోశించింది.

వెంటనే జనకమహారాజు, 'శునకమా! నీకు జరిగిన అన్యాయం తప్పనిసరిగా ఖండించవలసిందే. నిన్ను అలా కొట్టి గాయపరిచే హక్కు ఎవరికీ లేదు. నేను వేగులనిపంపి ఆ వ్యక్తి ఎవరో తెలుసుకొని అతనిని పిలిపించి, శిక్షిస్తాను. ఇక నీవు మన వైద్యుడి వద్ద తగిన చికిత్స చేయించుకొని, ఊరడిల్లు' అని దానిని ఓదార్చి పంపేశాడు.

అప్పుడు ఆ సంభలో ఉన్నవారంతా, 'అదేమిటి జనకమహారాజు శునకాన్ని కనీసం అది ఏమి చేస్తే ఆ వ్యక్తి కర్రతో అలా మోదాడో కూడా కనుక్కోకుండా, ఆ వ్యక్తిని పిలిచి శిక్షిస్తానని వాగ్దానం చేశాడు. మనిషి కుక్క కన్నా హీనమా?' అని గొణుక్కున్నారు.

ఆ విషయం గ్రహించిన జనకుడు 'సభికులారా! మీ సందేహం ఏమిటో నాకు అవగతమైంది. దారి వెంబటి ఎవరైనా కొత్తవారు వెళు తుంటే అరవటం శునకం సహజ లక్షణం. ఆ విధంగా అది సమాజానికి ఎవరో కొత్తవారు వీధిలోకి వచ్చిన సంగతి తెలిసేలా చేస్తుంది. అలా అరుస్తూ వెంటపడింది కాబట్టి దానిని అలా కర్రతో బాది రక్తం వచ్చేలా గాయపరచటం మానవ నైజం కాదు. మహా అయితే కర్రతో తమ పైకి రాకుండా అదిలించి పంపించేయవచ్చు. లేదా స్థానికుల సాయంతో దానిని దూరం తరిమేయవచ్చు. కుక్క తన నైజాన్ని మార్చుకోలేదు. కానీ, మనిషి తన హింసాత్మక నైజం, అధిక స్పందన లాంటి దుష్ట సంస్కారాలను మార్చుకోగలడు. వేగులావ్యక్తిని వెతికి తెస్తే, ఈ విషయమే ఆ వ్యక్తికి బోధపడేలా మందలించి పంపుతాను'. అని చెప్పాడు. అందుకు సభికులెల్లా సంతోషం వ్యక్తం చేశారు.

జనకుడు రాజర్షి. ధర్మం ఎరిగినవాడు. వేదవేదాంగ పండితుడు. అసత్యం పల్కనివాడు. అయితే, జనకమహారాజు చెప్పాడనే కాదు. సృష్టి

కోటిలో మనిషి ఒక్కడికే సంకల్పం, మనో నిబ్బరం, మనో నిగ్రహం వంటి వరాలను ఈశ్వరుడిచ్చాడు. అది చాలామంది గ్రహించరు. కొందరు గ్రహించినా తమ బలహీనతలను, వాటివలన ఒనగూడే తాత్కాలిక ఆనందాలను వీడలేక ఆసక్తుల్లా నటిస్తారు.

ఇలాంటివారిని దారిలో పెట్టడానికే సద్గురువులు భూమి మీద జన్మించి మార్గదర్శనం చేసి వెళ్తారు. ఒక సారి ఒకామె తన ముద్దుల తనయుడితో శ్రీ రామకృష్ణులను కలవడానికి దక్షిణేశ్వరం వచ్చింది. శ్రీ రామకృష్ణ గురుదేవులు అప్పుడే భోంచేసి, బయట కూర్చొని శిష్యులతో సాధన విషయాలు వివరిస్తున్నాడు. ఆమెను చూసి, గురుదేవులు ఆమె సమస్యేమిటని అడిగాడు. అందుకు ఆమె, 'గురుదేవా, మా వాడికి బంగ్ తాగటం అలవాటైపోయింది. ఎప్పుడు చూసినా బంగ్ తాగుతూ ఉంటాడు. అన్నం, నీళ్లు కూడా మానేశాడు. కొంచెం సేపు కూడా బంగ్ పీల్చకుండా ఉండలేడు. అదేమిటని మేము గద్దిస్తే 'అలవాటైపోయింది. లేకపోతే పిచ్చెక్కినట్టుంటుంది' అని అంటున్నాడు. మీరు సద్గురువులని, ఎంతో మహిమకల వారమని, మీ వాక్కు అమోఘమని, మీరైనా మా అబ్బాయికి ఇది మంచిదికాదని చెపుతారని మీ వద్దకు తీసుకు వచ్చాను' అని చెప్పింది.

అది విన్న వెంటనే శ్రీ రామకృష్ణులు 'నీవు నీ అంతట మానలేవు కదా!'అని ఆ యువకుడిని అడిగాడు. అవునన్నట్లు తలూపాడు ఆ యువకుడు. అయితే 'నీ అలవాటు మానిపించే హక్కు నాకు ధారపోస్తావా? నేను మానిపిస్తాను ' అని అడిగాడు. 'ఓ, అదెంత పని'. ఇప్పటినుంచి నా తోటి బంగ్ మానిపించే బాధ్యత మీదే' అన్నాడు ఆ యువకుడు.

ఆ యువకుడి ధైర్యం ఏమిటంటే 'తానెక్కడో ఉంటాడు. ఈయన ఇక్కడుంటాడు. నాతో ఎలా మానిపించగలడు? అదేమాత్రం సాధ్యం

కాదు. కాబట్టి ఒప్పుకొన్నా తనకేమీ తేడా పడదు ‘ అని. ‘సరే, వెళ్ళు. ఇకపై నువ్వు బంగ్ తాగకుండా చూసే బాధ్యత నాకప్పగించావు. గుర్తుపెట్టుకో’ అని చెప్పి పంపించేశాడు.

ఇంటికెళ్లిన ఆ యువకుడు తన తల్లి చూడకుండా బంగ్ తాగ పోయాడు. ఒక్కసారిగా మంటలు చెలరేగి, చేతిలో బంగ్ కాస్త కిందపడి మంటల్లో కాలిపోయింది. అదేదో కాకతాళీయం అనుకోని, మరుసటి రోజు మళ్ళీ బంగ్ తాగే ప్రయత్నం చేశాడు. మళ్ళీ అదే రీతిలో మంటలు చెలరేగాయి. ఇది గమనించిన ఆ యువకుడి తల్లి ఏం జరిగిందో కొడుకునుంచి తెలుసుకొంది. ముచ్చటగా మూడోసారి అదేప్రయత్నం చేసి, అదే అనుభవం ఎదురు కావటంతో అతను తానిక బంగ్ ముట్టలేనని గ్రహించాడు.

ఆ క్షణంలో అతనిలో తాను బంగ్ తాగ కుండ ఉండగలనని, గడచిన రెండు రోజులే రుజువన్న ఒక ఆలోచన మెరుపులా కలిగింది. అంతే. తనంతట తానే ఇక బంగ్ ముట్టకూడదన్న నిర్ణయానికి వచ్చాడు. ఆ తరువాత అతను శ్రీ రామకృష్ణులను కలిసి తను గురుదేవులకు సర్వాధికారం ఇవ్వటం లోని ‘అర్థం’ తెలిసిందని, తన ఆరోగ్యం ఇప్పుడు బాగుపడిందని, తానిక బంగ్ తాగనని, తనలో ఆ మార్పు తెచ్చినందుకు గురుదేవులకు ‘సాష్టాంగ నమస్కారం’ దక్షిణగా సమర్పిస్తున్నాని తెలిపి వెళ్ళిపోయాడు. దీనిని ‘శరణు మార్గం’ అంటారు. తనను ఒక దుష్ట అలవాటునుండి కాపాడమని ‘అంతర్యామి’ (లోనే ఉన్నాడు) అయిన ఈశ్వరుడిని శరణు కోరటం.

మరో మార్గం కూడా ఉంది. అది నిగ్రహ మార్గం. తర్కం ద్వారా మనలో నిగ్రహాన్ని స్థిరపరచి, అభివృద్ధి చేసుకోవటం. నిజానికి ఒక

దుర్వ్యసనం మానేయాలంటే దానినుంచి దూరం పరిగెత్తటం కాదు. దాని పక్కనే ఉండి, ఆ వ్యసనం పాలుకాకుండా ఉండగలగటం అంటారు స్వామి వివేకానంద. 'ధూమాపానం మానేయాలంటే ధూమపాన డబ్బాలు దగ్గిరే పెట్టుకొని ఎంత సేపు ధూమపానం చేయకుండా ఉండగలవో తెలుసుకో' అంటారు స్వామీజీ. గాంధీజీ తన జీవితంలో దీనిని ఆచరించి చూశారు. వారికి కామ వాంఛ ఎక్కువగా ఉండేది. దానిని తాను నిగ్రహించగలనని, కస్తూరిబాతో సహజీవనం చేస్తూనే నిగ్రహించి, విజయుడనైనానని 'సత్యంతో నా ప్రయోగం ' పుస్తకంలో రాసుకొచ్చారు.

ఒకరు ఒక్క నిముషం, ధూమపానం ముట్టుకోకుండా ఉన్నారంటే వారు ఎప్పటికీ మానేయగలరు అన్న తర్కం ఇక్కడ కీలకం. ఎందుకంటే నిముషం సేపు ఆగిన మనిషి అనంత కాలం ఆగ గలడు. నిముషం ముందున్న మనిషి, అనంత కాలం ఆగిన మనిషి ఒక్కడే. తెలుసుకోవలసిందల్లా తనలో ఆగ గల శక్తి ఏదైతే ఒక నిముషం ఆపిందో, అది తనలో ఎప్పుడూ ఉంది. కాబట్టి ఏ మనిషి సంకల్పిస్తాడో, ఆ మనిషిలో ఆ సంకల్ప బలం ఇంతకు ముందూ ఉంది. తరువాత కూడా ఉందని గ్రహించటమే. ఏ దురలవాటు మానుకోవడానికైనా మనిషి తెలుసుకోవలసిన రహస్యం ఇదే. ఈ వరం సృష్టిలో మనిషికి మాత్రమే దేవుడిచ్చాడు. అందువల్ల మనుషులు హింసామార్గం నుంచి అహింసా మార్గానికి సులువుగా రాగలరు. వ్యసనాలను వదిలి, తమ జీవితాలను, తమను నమ్ముకొన్న వారి జీవితాలను బాగు చేసుకోగలరు. కాబట్టి మనిషి తన అలవాట్లను మార్చుకోగలదన్నది నిర్ద్వంద్వము. అది శరణు మార్గం ద్వారా కానీ, నిగ్రహ– తర్క మార్గం ద్వారా కాని సాధించవచ్చు.

14

ఆలోచనలను అదుపు చేయటమే జీవన సాఫల్యానికి సోపానం

ఒకరోజు పొద్దున్నే ఫోన్. విషయం ఏమిటంటే ఒకానొక అంతర్జాతీయ స్కూల్లో విద్యార్థులకు కౌన్సిలింగ్ చేయమని ఆ ఫోన్. విషయమేమిటంటే ఇటీవల ఆ స్కూల్లో క్లాసుకు ఇద్దరు పిల్లలు అసహజ చర్యలకు, నేరాలోచనలకు పాల్పడటం. తల్లి దండ్రులకు స్కూల్ యాజమాన్యం సమాచారం ఇచ్చినా పిల్లల ప్రవర్తనలో ఏ మార్పు లేదు. అందువలన స్కూల్లో మిగతా పిల్లల తల్లి దండ్రులు ఆందోళన చెందుతున్నారు.

సరిగ్గా తొమ్మిది గంటలకు స్కూల్ కు చేరాను. స్కూల్లో విషయాలు వింటే చాలా ఆశ్చర్యం కలిగింది. ఒక విద్యార్థి ప్రేమలో పడి ఆ అమ్మాయి తన ప్రేమ కాదన్నదని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. చదువుతున్నది తొమ్మిదవ తరగతి. ప్రేమించింది పదవ తరగతి అమ్మాయిని. మరో సంఘటనలో తను ప్రేమిచిన అమ్మాయి వేరొక పిల్లాడితో సన్నిహితంగా ఉంటుందని ఆ అమ్మాయి, అబ్బాయి పైన దాడి. ఇలా మరికొన్ని సంఘటనలు. సరిగ్గా చదవలేక పోవటంతో టీచర్ కోప్పడిందని ఇంట్లోనుంచి అలిగి వెళ్ళిపోయాడు. మరొకడు ఎప్పుడు వీలైతే అప్పుడు క్లాస్ ఎగ్గొట్టి నలుగురి స్నేహితులను వెంటేసుకొని సిగరెట్లు, తాగుతూ స్కూల్ కాంపస్ లోనే చెట్ల కింద పచార్లు చేస్తుంటాడు. ఇలా ప్రవర్తనల్లో లోపాలున్న విద్యార్థుల సంఖ్య నానాటికి పెరిగిపోతూ యాజమాన్యానికి తల నొప్పిగా తయారయ్యారు.

లోతుగా విశ్లేషిస్తే అనేక మంది పిల్లలు 'అబ్సెసివ్ కంపల్సివ్ డిసార్డర్' తో బాధ పడుతున్నారని అర్థమయింది. ఇందుకు కారణం పిల్లలు తమ ఆలోచనలను తాము అదుపు చేసుకోలేక పోవటం. మనిషిలో ఉద్రేకాలను ప్రోత్సహించే సంఘటనలను పదేపదే చూడటం, వినాలని ఇష్టపడ్డటం, వాటిని ఆచరించటం గొప్పగా భావించటం, వాటిని గొప్పగా ప్రదర్శించే వాటిని ఆదర్శంగా తీసుకోవటం. వీటిలో హింసాత్మక, అహంకార, దర్ప ప్రదర్శన హావభావాలు ఆకర్షణీయంగా కూడా ఉంటాయి. ఎప్పుడైతే పిల్లలు వీటిని తమ లక్ష్యంగా మార్చుకొంటారో వాళ్ళ ఆలోచనలన్నీ ఇటువంటి చర్యల చుట్టూ పరిభ్రమిస్తూ, వారిని ఆ చర్యల ఆచరణ లోకి ప్రేరేపిస్తుంది. 'మనమేది ఆలోచిస్తామో అదే మనం అవుతాము'అన్నది మనస్తత్వ శాస్త్రంలో వ్యక్తిత్వ పరిణతి, వికాసంలో ప్రాథమిక సూత్రం.

ఒకసారి రవీంద్రనాథ్ ఠాగూర్ ను చైనాలోని పెకింగ్ (ఇప్పుడు బీజింగ్) విశ్వవిద్యాలయం సన్మానించాలనుకొంది. ఎందుకంటే సాహిత్యంలో ఆసియాలోనే తొలి నోబెల్ బహుమతి పొందిన మహా కవి రవీంద్రుడే కాబట్టి. అందుకు అంగీకరించిన ఆయన చైనా లోని ఆ విశ్వవిద్యాలయానికి వెళ్లారు. కొన్ని వేల మంది విద్యార్థులు ఆయన వాహనం వెళ్లే దారికి అటూ ఇటూ బారులు తీరి ఆయనకు ఘన స్వాగతం పలికారు. చివరకు ఆయన సన్మాన స్థలికి చేరారు. సన్మాన నిర్వాహకులు టాగోర్ ను బహుధా ప్రశంసించారు. చివరకు వారు టాగోర్ని సన్మాన వేదిక మీదకు ఆహ్వానించారు. వేదిక మీదకు వచ్చినాయన నేరుగా మైక్ దగ్గరికి వెళ్లి ఒకటే మాట చెప్పాడు. 'ఈ సన్మానాన్ని తిరస్కరిస్తున్నాను'. ఒక్క క్షణం అంతా నిశ్చేష్టులయ్యారు. 'మీరంతా ఎంతో సాదరంగా నన్ను ఆహ్వానించారు. కానీ, ఈ విశ్వవిద్యాలయంలో

ఎటువైపు చూసినా గోడలన్నీ అసభ్యంగా, చాలా నీచమైన స్లొగన్స్ తో, బొమ్మలతో నిండి ఉన్నాయి. ఇవి మీ మనస్సులెంత కలుషితమై ఉన్నాయో చెబుతుంది. అందువల్ల ఇటువంటి వాతావరణములో నాకు సన్మానం సరి కాదు. ఈ పరిస్థితి మారాలి. విద్యాలయాలు పరిశుభ్రంగా ఉన్నదని నేను గ్రహించాక మళ్ళీ తప్పక వస్తాను' అని ముగించాడు. అయితే ఠాగూర్ తిరిగి పదేళ్లకు అదే విశ్వవిద్యాలయానికి వెళ్లి సన్మానం స్వీకరించాడు. అప్పుడు విశ్వవిద్యాలయం ఎంతో పరిశుభ్రంగా ఉండటం ప్రత్యేకంగా గుర్తించారు ఠాగూర్.

ఠాగూర్ సమకాలికుడు స్వామి వివేకానంద కూడా ఈ దేశ యువతకు సందేశం ఇస్తూ 'మనిషి ఒక్కడే తన నైజం మార్చుకోగలడు. 'వివేక వంతుడయిన మనిషి తన ఆలోచనలను అదుపులో పెట్టుకోవటంలోనే మానవ జీవన సాఫల్యం ఉంది' అని చెప్పాడు. మన ఆలోచనల్లో మంచివి, చెడు ఉంటాయి. ఏ ఆలోచనైనా ఆకాశం నుంచీ ఊడిపడదు. అన్నీ మనలోనుంచే వస్తున్నాయి. ఒకరికి గాని, ఒక వ్యవస్థకి గాని హాని చేసే ఏ ఆలోచనైనా చెడు ఆలోచనని గుర్తించ గల వివేకం మనిషికొక్కడికే సాధ్యం.

ప్రతి ఆలోచన ఒక తరంగం లాంటిది. ఒక్కో తరంగానికి ఎంతో బలం ఉంటుంది. భౌతిక శాస్త్రం ప్రకారం చెడు ఆలోచనను మంచి ఆలోచనతో వెంటనే రద్దు చేయాలి. రెండు పరస్పర వ్యతిరేక తరంగాలు వ్యతిరేక దిశలో ప్రయోగించే శక్తి మనిషికే ఉంది. దీనిని అనువుగా మనిషి సందర్భాన్ని బట్టి వాడుకోవాలి. దీనినే 'థాట్ మానేజ్మెంట్' అంటారు. ఇలాంటి ఆలోచనలతో బాధపడుతున్నవారు 'చెడు ఆలోచనలు మనం చూసే సంఘటనలు, దృశ్యాలనుంచి వస్తున్నాయే కాని ఎక్కడినించో

రావటంలేదు. వీటిని నియంత్రించగల శక్తి, తిరస్కరించగల శక్తి మనచేతుల్లోనే ఉందని గ్రహించి ఆ ఆలోచనలను తృణీకరించాలి. లేక వ్యతి రేక ఆలోచనలతో తటస్థీకరించాలి. 'కొంచెం ప్రయత్నంతో వీటిని జయించగలం' అన్నది పిల్లలకు, తల్లి దండ్రులకు అర్ధమయ్యేట్టు చెప్పి స్కూల్ నుంచి బయట పడ్డాను. ఆ తరువాత కొన్నేళ్ల పాటు మళ్ళీ ఆ స్కూల్లో అటువంటి పరిస్థితి రాలేదు.

15

'కర్మ' శబ్దం పట్ల సరైన అవగాహనే నిజమైన సుఖమూ, శాంతి!

మానవ జీవితంలో అందరి నోట తరుచుగా వినిపించే తాత్విక పదం 'కర్మ'. 'ఇది వాని కర్మ'. 'కర్మ గతిని ఎవరు తప్పించ గలరు', 'వాని కర్మ అలా కాలింది'. 'ఎవరి కర్మకు ఎవరు కారణం?' 'బుద్ధి కర్మానుసారేం- ఇత్యాదులన్నీ తెలుగు వాని జీవితంలో 'కర్మ'పై నిత్యం మనకు వినిపించే తత్వ భాషణలు. అయితే ఇవేమీ 'కర్మ' గురించి సరైన అవగాహన ఉండి మాట్లాడే మాటలు కావు. మానవ జీవితంలో తారస పడే సంఘటనలను లోతుగా విశ్లేషించి, పాలను, నీళ్లను దేనికి దాన్ని వేరు చేయగల తార్కిక శక్తి లేని శుష్క పాండిత్యం ఉన్న వారు వ్యక్తీకరించే మాటలు. వీటి ప్రయోగం వలన ఎవ్వరికీ దమ్మిడీ ప్రయోజనం లేదు.

'కృషితో నాస్తి దుర్భిక్షం', 'తెలివి గలవాడు ఫలం పొందవచ్చు, పొందకపోవచ్చు. కానీ కృషి చేసినవాడికి ఫలం తప్పక వస్తుంది'వంటి సంభాషణా ప్రయోగాలు 'కర్మ'కు పర్యాయ పదంగా 'కృషి'ని ప్రతిక్షేపించి చెప్పేవి. ఇవి వేదాంతం నుంచి వచ్చినవి కావు. ఐతిహాసిక, పురాణ సూక్తులు. పురాణ వాక్యాలను 'అర్ధ సత్యాలు' అని అంటారు. పైగా ఈ వాఖ్యానాలను 'కర్మ' నిర్వచనాలుగా భావించి,ఆచరించే వ్యక్తులు విపరీతమైన మానసిక ఒత్తిడికి గురవుతారు. ఒక్కోసారి అనుకొన్న ఫలితం లభించకపోతే తీవ్రమైన క్రోధానికి లోనవుతారు. అఘాయిత్యానికి కూడా పాల్పడతారు.

'కర్మ' అంటే వేదాంత పరంగా ఉన్న అర్ధం నిజానికి చాలామందికి తెలియదు. కొందరు 'కర్మ' అంటే 'పని' చేయడం అనే అర్ధం తమకు తామే కల్పించుకొని ↄ మనిషి ఏ పనిలేకుండా కూర్చోగూడదు. చనిపోయేవరకూ ఏదోక పని చేస్తూనే ఉండాలి'అని సూక్తులు పలుకుతారు. ఇంకొందరు పనిచేయకుండా కూర్చునే వాని బుర్ర 'దయ్యాల ధామం' అని మరో రకమైన తాత్విక వాదన చేస్తుంటారు. ఇది అర్ధ సత్యమే కానీ, కర్మ పదానికి నిండు వేదాంత అర్ధం ఇవ్వదు. ఇలాంటి వారిని 'కర్మఠులు' అంటారు అని స్వామి వివేకానంద గీతలో 'కర్మ యోగం 'పై చేసిన ప్రత్యేక వ్యాఖ్యానంలో వివరించారు.

ఎందుకంటే 'కర్మ' ఆచరణ వలన కొంత కాలానికి కర్మలు చేయవలసిన పని ఉండదు. 'న కర్మణామనారంభ నైష్కర్మ్యం పురుషోస్నుతే' అనే వేద వాక్కుకు అర్ధం ఇది. ఆ పరిస్థితి (నైష్కర్మ్యం) సిద్ధించే వరకు మాత్రమే కర్మలు చేయాలి. ఒకసారి మనకు ఆ స్థితి సిద్ధించాక మనకిక కర్మల 'సంకల్పం' స్వాభావికంగానే ఆగిపోతుంది. రమణ భగవానులు, శ్రీ రామకృష్ణులు చెప్పిన 'సంకల్ప రహిత స్థితి ఇదే'. అంతవరకు మనిషి కర్మలు చేయకుండా ఉండలేడు. ఒక కర్మ పూర్తవటంతోనే మరో 'కర్మ' సంకల్పం అతని కపాలంలో పుట్టుకొస్తుంది. దీనినే చిత్తప్రవృత్తి అంటారు. ఇది నిరోధం అయ్యే వరకే కర్మలు ఆచరించాలి. చిత్తశుద్ధి సిద్ధించి, జ్ఞాన ద్వారాలు తెర్చుకోవడానికే 'కర్మ' ఆచరణ తప్ప, కర్మాచరణే ఒక వ్యసనంగా మారి మనిషిని జన్మను సుఖ దుఃఖాలకే పరిమితం చేసే శాశ్వత బంధం కాకూడదు అని గీతా వ్యాఖ్య. అలా జరగ గూడ దంటే కర్మలు ఈశ్వరార్పితంగా చేయాలే తప్ప స్వఫలానుభవం కోసం కాదు. ఈ రహస్యం మరచి ఏ మానవుడు 'నిత్యం కర్మలు చేయాల్సిందే, అదే

ఫలాన్ని ఇస్తుందని భావిసస్తాడో' అట్టి వానికి కర్మలు దుఃఖమే మిగులుస్తాయి అంటాడు స్వామి వివేకానంద.

ఎవరైతే 'కర్మ' శబ్దానికి సరైన అర్థం తెలుసుకొంటారో, వారే జీవితంలో వేదాంత శాస్త్రం నిర్ధారించిన మార్గంలో కర్మలు చేసి, అలసిపోకుండా ఈశ్వర కటాక్షంతో చిత్త శుద్ధి, తద్వారా ఈశ్వర జ్ఞానం, మోక్ష మార్గం పొందుతారు. నిజానికి పరమ యోగులు శంకరుడు, వివేకానంద, రామకృష్ణ పరమహంస, రమణ భగవానులు వంటి వారి బోధలలో గీతాచార్యుడి బోధనల తాత్విక పరిధిలోనే 'కర్మ'శబ్ద ప్రయోగం ఉంటుంది. అందువల్ల మనుషులు ఆ పరిధిలో కర్మలు చేయటం వారి మానసిక ఆరోగ్యానికి, చిత్త ప్రవృత్తుల శాంతికి దోహదం చేస్తాయి.

'కర్మ'ల గురించి శ్రీ కృష్ణ భగవానుడు గీతలో సరైన వివరణ ఇచ్చే వరకూ 'కర్మ'శబ్దం చుట్టూ అనేక వివాదాలు, 'కర్మ'కు భిన్న తాత్విక వ్యాఖ్యానాలు ఉండేవి. సాంఖ్యులకు, వేదాంతులకూ మధ్య 'కర్మ'శబ్దం పై ఉన్న వివాదాల్లో పైన పేర్కొన్న అనేక వ్యాఖ్యానాలు ఉన్నాయి. గీతలో కృష్ణ పరమాత్మ తొలిసారిగా, సాధికారంగా 'కర్మ'కు సంపూర్ణమైన వివరణ ఇచ్చాడు. అందువల్ల గీతలో 'అర్జున విషాదయోగం', తరువాత 'సాంఖ్య యోగమే' కృష్ణ భగవానుడు తొలుత అర్జునుడికి బోధిస్తాడు.

'కర్మ'లు జన్మ జన్మ పరంపరగా వచ్చేవి కూడా అయిఉంటాయి. ఇక్కడ వాటిని 'కర్మ' ఫలంగా భావించాలి. అందుకే కర్మలు ఆచరించే విషయంలో' ఏకర్మలు ఆచరించాలి , ఏవి నిషిద్ధమో తెలుసుకొని చేయాలి' అంటాడు గీతాచార్యుడు. ఎందుకంటే 'అన్ని కర్మలు ఫలాన్ని' అదే జన్మలో ఇవ్వవు. కొన్ని ప్రారబ్ధ, ఆగామి, సంచిత ఫలాలుగా విడిపోతాయి. ఎప్పుడు ఏ ఫలాలు కర్మచరించిన వ్యక్తికీ దక్కుతాయో చెప్పటం ఈశ్వరుడికి

తప్ప మరొకరికి సాధ్యం కాదు. ఎందుకంటే కర్మలకు స్వయంగా ఫలితాన్ని పొందే శక్తి లేదు. అందుకే 'కృషితో నాస్తి దుర్భిక్షం' అనేది అర్ధ సూక్తిగా పౌరాణిక 'అర్ధ సత్యం' అని వివరించటం జరిగింది. కష్ట పడ్డాం కాబట్టి ఇప్పటికిప్పుడే ఫలితం రావాలి అని అంటే ఎవస్తే రావచ్చు, రాకపోవచ్చు. అది ఈశ్వర నిర్ణయం. అలాగే 'ఒకవ్యక్తి కష్టం కలిగించాడు, దుఖ?పెట్టాడు. అతను వెంటనే నాశనం అవ్వాలి' అని కోరుకొంటే ఏమీ జరగాలని లేదు.

అందుకే వేదాంత శాస్త్రంలో 'కర్మ'ను జడమైనదానిగా భావిస్తారు. ఎవరు అంగీకరించినా, అంగీకరించకపోయినా కర్మలకు ఫలితాలను ఇచ్చేది ఈశ్వరుడే. కృష్ణుడు గీతలో 'కర్మలనాచరించటం అందే అధికారం ఉన్నదికాని, దాని ఫలం పై ఏ అధికారం లేదని స్పష్టం చేశాడు'. ధృతరాష్ట్రుడు తన నూరుగురు పిల్లలు శ్రీకృష్ణుడి వల్లనే యుద్ధంలో మరణించారని కృష్ణుడిని నిందిస్తాడు మహాభారత యుద్ధానంతరం. అందుకు చిరునవ్వు నవ్వుతూ కృష్ణుడు 'మహారాజా, ధృతరాష్ట్రా! కొన్ని జన్మలందు నీవు ఒక సర్పానివి. ఒకదినం ఆకలిగొని నీవు ఒక పక్షి పెట్టిన నూరు గుడ్లను తినేశావు. నాటి ఆ పక్షి శాప ఫలమే ఈ పుత్రశోకం నీకు. దీనినే ప్రారబ్ధం అంటారు' అని చెప్పాడు.

శ్రీ రమణ భగవానులను 'ఆత్మ దర్శనం' జరిగాక మీరు మధురైనుంచి అరుణాచలం ఎందుకు వచ్చారని' ఒక భక్తుడు అడిగితే, భగవానులు ఒక్క మాట లో 'ప్రారబ్ధం'నన్ను ఇక్కడికి తెచ్చింది అని జావాబిచ్చాడు. అలాగే, గాంధీ జీవితకాలం అహింసా వ్రతం ఆచరించాడు. 'అటువంటి మహనీయుడు తుపాకి గుండ్లకు ఎందుకు నేల కొరిగాడు' అని శ్రీ రమణ భగవానులను భక్తులు అడిగితే, శ్రీ రమణులు చెప్పిన

సమాధానం 'ప్రారబ్ధం' దారి అటువంటిది. దాని గతి ఎవ్వరూ చెప్పలేరు' అని.

అంటే కృష్ణ పరమాత్మ స్పష్టంగా 'కర్మ'ను వివరించాక గూడా ఇంకా మనం సాంఖ్యుల 'కర్మ' ప్రయోగ భాషణలనే వాడుతున్నామన్న మాట. మరి 'నీరు పల్లమెరుగు, నిజం దేవుడెరుగు'–అన్న నానుడికి అర్థం ఇదే గదా. అల్పమైనవి, అసత్యమైనవి లోకం త్వరగా గ్రహించేస్తుంది. గంభీరమైనవి, లోతైనవి తెలుసుకొందుకు లోకానికి అంత ఇష్టం ఉండదు. గీత మానవ జీవితానికి సంపూర్ణత, సాఫల్యత ఇచ్చే ఉపనిషత్తుల సారాంశం. సమస్త మానవ సమస్యలను సరైన కోణంనుంచి ఎలా దర్శించాలో ఆ తర్కాన్ని బోధించి, మనిషికి విజయం చేకూరుస్తుంది. అందువల్లే గీతాచార్యుడు 'యత్ర యోగేశ్వరః కృష్ణో యత్ర పార్థో ధనుర్ధరః ఎతత్ర శ్రీర్విజయో భూతిః ధ్రువా నీతిర్మతిర్మమ'అని ఒక ఎదురులేని హామీ ఇస్తాడు

16

విశ్వాసమే జీవనయానంకు ఆలంబన!

సంక్షుభిత మానవ జీవితంలో మనిషికి ఊరట నిచ్చేది భగవంతునిపై 'విశ్వాసం'. ఒక రకంగా 'అన్నీ నావే, అంతా నాదే' అనే భావనతో, నిస్సహాయతతో అనుక్షణం కొట్టుమిట్టాడే మనిషిలో, అంతర్గతంగా పెరిగే ఒత్తిడి నుంచి వెసులుబాటు భగవంతునిపై 'విశ్వాసం' పెట్టటం వల్లనే సులువుగా లభిస్తుంది. జీవనయానం సుగమవుతుంది. ఒక ఆకలి బాధితుడికి ఒక పూట అన్నం పెట్టవచ్చు. కానీ, మళ్ళీ అతనికి ఆకలి వేస్తుంది. 'ఇలా ఆకలేసినప్పుడల్లా వేరే వారెవరో అన్నం పెట్టటం, అవసరం వచ్చినప్పుడల్లా ఇతరులెవరో ఆ అవసరం తీరుస్తూ పోవటం శాశ్వత పరిష్కారం కానేరదు'అంటారు స్వామి వివేకానంద. దానికి బదులు ఆ వ్యక్తికి తానే అన్నం సంపాదించుకోగలడన్న 'విశ్వాసం' కలిగిస్తే అదీ నిజమైన పరిష్కారం. ఆ విశ్వాసానికి ఆలంబనే భగవంతుడు'అని వివరించాడు స్వామి వివేకానంద. అదేదో లేని దేవుడిపై నమ్మకం పెట్టి, గుడ్డిగా సాగమని కాదు వివేకానందుడు చెప్పింది. అయితే భగవంతుడున్నాడన్న నమ్మకంకు ఆధారం దొరకాలిగా. ఇది ప్రత్యక్ష, పరోక్షానుభూతుల ద్వారా పుష్కలంగా లభిస్తుంది. ఇందుకు కావాల్సిందల్లా హృదయకవాటాలు తెరిచి ఉంచడమే.

స్వామి వివేకానందనే చెప్పినట్టు 'సత్యం ఒక్కటే ఉంది (ఏకం సత్). దానికి మనం తలవంచాలి. లేదా నశించాలి. దానికి ఎదురుతిరిగి ప్రయోజనం లేదు'. అన్నివేళలా ఈ విశ్వమంతా ఆవరించి అడుగడుగునా

సహస్ర శీర్షాలతో, సహస్రాక్షాలతో మనలను అనుక్షణం గమనిస్తున్న ఆ భగవంతుని ఉనికిని (సహస్ర శీర్షం దేవం విశ్వాక్షం విశ్వసంభవం, విశ్వతః పరామాన్నిత్యం విశ్వం నారాయణం హరిః) విశ్వసించటం వినా వేరే మార్గం లేదు' అని స్వామిజి వివరణ కూడా ఇచ్చారు.

క్రైస్తవులు అను నిత్యం గానం చేసే 'నడిపించు నా నావా, నడిపించు ఓ దేవా' అర్థం కూడా ఇదే. 'విశ్వాసం' అంటూ ఉంచితే ఆ 'విశ్వాసం' భగవంతునిపై తప్ప మరొకరిపై కాదు. క్రైస్తవంలో దీనిని 'ఫెయిత్ హీలింగ్' అని అంటారు. వారు జరిపే ప్రార్ధనా సమవేశాలను 'స్వస్థత కూటములు' అని అందుకే అంటారు. మనిషికి భగవంతునిపై 'విశ్వాసం' కలిగించటం ద్వారానే మానవ జీవనం సుగమం చేయవచ్చునని బోధించడమే ఈ కూటముల లక్ష్యం. అనారోగ్యాలతో బాధపడేవారి మంచం పక్కన ప్రార్ధనలు చేసి వారికి 'త్వరగా స్వస్థత' చేకూర్చమని దైవాన్ని ప్రార్ధించేదికూడా ఇందుకే. అలా ప్రార్ధన చేసే వారిని 'ఫైత్ హీలర్స్' అంటారు.

కొందరు భగవంతునిపై విశ్వాసం అనటం 'ఏదో అసమర్ధుని వాదంగా భావించి, 'భగవత్' శబ్దం బదులు 'ఆత్మ ' శబ్దం వాడి తమకు 'ఆత్మ విశ్వాసం' ఉందని కూడా చాకచక్యంగా చెప్పుకొంటుంటారు. అలా కూడా చెప్పుకోవచ్చు. అది తప్పేమీ కాదు కూడా. ఎప్పుడైతే మనల్నిమనం సృష్టించుకోలేదో, మనతో పాటు ఏదీ తేలేదో, ఏదీ తీసుకుపోవటం లేదో అప్పుడా 'ఆత్మ' కూడా ఈశ్వరానుభూతే కదా. భగవంతుని పై 'విశ్వాసం' అంటే మనిషి నిరహంకారి కావాలి. నిరహంకారమే బలం. అంటే 'విశ్వాసం' ఒక వ్యక్తికి బలం, శక్తిని, జీవనస్వస్థత, స్థైర్యంను సమకూరుస్తుంది.

ఒక ఆసుపత్రిలో కాన్సర్ తో చనిపోయే ఒక పాపకు దూరాన ఉండే ఒక ఎండిపోతున్న ఒక పూల తీగ చూపి దానికున్నఆ ఒక్క ఆకు రాలనంత కాలం ఆ పిల్ల జీవించే ఉంటుందని అయినవాళ్లతో చెప్పిస్తాడు ప్రముఖ అమెరికన్ రచయిత ఓ హేన్రి తన కథ 'ది లాస్ట్ లీఫ్'లో. ఆశ్చర్యంగా ఆపాప ఆసుపత్రి కిటికీలోంచి రోజూ ఆ ఆకును చూస్తూ కాన్సర్ నుంచి కోలుకొని ప్రాణంతో తిరిగి ఇంటికి వస్తుంది. నిజానికి ఆ తీగ, ఆ ఆకును అంత జీవం ఉట్టిపడేలా ఒక చిత్రకారుడు చిత్రీకరిస్తాడు. అది చిత్రకారుడు గీచిన చిత్రం అన్న విషయం ఆ పాపకు తెలియనే తెలియదు.

భారతీయ ఆధ్యాత్మికతలో మానవుడి జీవితానికి ఒక స్థైర్యం ఈ 'విశ్వాసం'. ఇది యుగయుగాలనుంచి వర్ధిల్లిన జీవనప్రదాయని. కృతయుగంలో హిరణ్యకశిపుడికి ప్రహ్లాదుడు తనకు భగవంతునిపై ఉన్న 'విశ్వాసమే' తనని కాపాడుతున్నదని చెబుతాడు. ప్రహ్లాదుడిని చంపమని ఎన్ని రకాలుగా హిరణ్యకశిపుడు తన సైన్యాన్ని ఆదేశించినా, ప్రహ్లాదుడు ప్రాణంతో మళ్ళీ మళ్ళీ తన ముందుకు రావటం హిరణ్యకశిపుడికి జీర్ణం కాదు. ఇది హిరణ్యకశిపుడు ప్రహ్లాదుడికి పెట్టిన పరీక్ష కాదు. భగవంతుడిపై ప్రహ్లాదుడికి ఉన్న'విశ్వాసం'కు హిరణ్య కశిపుడు పెట్టిన పరీక్ష.

ఒకసారి ఏసు ప్రభువు తన భిక్షాటనలో భాగంగా ఒక వీధిగుండా తన శిష్యులతో వెళ్తున్నాడు. ఆ సమయంలో ఒక ఇంటిలో ఇద్దరు ఆడపిల్లలు గుండెలవిసేలా రోదిస్తున్నారు. ఏమైందో ఏమోనని ఏసు ప్రభువు ఆ ఇంటిలోకి తొంగి చూసి, ఆ రోదిస్తున్న ఆడ పిల్లల వద్దకు వెళ్లి వాళ్ళను విషయం అడిగాడు. తమకు ఏకైక ఆధారమైన తమ తల్లి చనిపోయిందని,

తాము నిరంతరం ఏసు ప్రభువు బోధనలనే నమ్ముకొని జీవించామని, అందువలన ప్రభువైన ఏసు తమ తల్లిని బ్రతికించాలని వేడుకొన్నారు. తమ తల్లి బ్రతకడం మినహా తమకేది వద్దని వారు ఏసు ప్రభువును దీనంగా వేడుకొన్నారు. అప్పుడు ఏసుప్రభువు వారితో 'మీరు నన్నే అనుక్షణం నమ్మి, నా బోధనలే అనుక్షణం ఆచరించి ఉంటే, మీ తల్లి తక్షణమే లేచి కూర్చోగలదు' అని వారితో చెప్పాడు. ఈ మాటలంటూండగానే వారి తల్లి లేచి కూర్చుని ఏసు ప్రభువు పాదాలకు నమస్కరించింది. ఆ పిల్లల ఆనందానికి అవధుల్లేవు.

తన గురుదేవులు శ్రీ రామకృష్ణులతో అనేక సార్లు నరేన్ (స్వామి వివేకానందగా మారక పూర్వం) ఎన్నో సార్లు అనేక తాత్విక విషయాలు వాదించి, వారిని విసిగించేవాడు. అలంటి వాదనలలో రాముడు, కృష్ణుడు అవతార పురుషులు కారని, హనుమంతుడు ఒక కోతి అని, అతడికి తోక ఉంటే అతను దైవం ఎలా అవుతాడని వాదించిన ఒకానొక సందర్భం కూడా ఒకటి ఉంది. ఎప్పుడూ ఎంతో సహనంతో నరేన్ వాదనలను విని నవ్వి ఊరుకునే శ్రీ రామకృష్ణ గురుదేవులు ఆ సారి నరేన్ కు గట్టిగానే గుణపాఠం చెప్పాలని నిర్ణయించుకొన్నారు. 'సరే నరేన్! హనుమంతుడు దైవం కాదు. కోతి అంటావు. అంతేనా?'. అవునని తలూపాడు నరేన్. 'అయితే నువ్వు ఈ సాయంత్రం ఈ కాళీ ఘాట్ లోని హనుమంతుడు గుడికి వెళ్లి, ఆయన చుట్టూ 'నువ్వు దైవం కాదు, ఓ కోతివి' అంటూ మూడు ప్రదక్షిణాలు చేసి తిరిగి నా వద్దకు రా!'అని చెబుతాడు. 'ఓ. అదెంత పని,' అని ఆయన సాయంత్రమే హనుమంతుడి గుడికి వెళ్లి గురుదేవులు చెప్పినట్టు మూడు సార్లు ప్రదక్షిణ చేశాడు. 'అంతే కదా' అని నరేన్ తనలో తాను అనుకొనేప్పటికి ఆయన మూతి

హనుమంతుని మూతిగా మారిపోయింది. వెనుక పంట్లాము లోంచి ఒక బొచ్చు తోక పొడుచుకు వచ్చింది. తనలోని ఈ మార్పుకు భీతిల్లి పరుగు పరుగున శ్రీ రామకృష్ణులను చేరి తనను ఈ విపత్తు నుంచి కాపాడమని వారి కాళ్ళపై పడ్డాడు. అప్పుడు శ్రీ రామకృష్ణులు 'మరెప్పుడైనా హనుమంతుని కోతి అని నిందిస్తావా?' అని అడుగుతాడు. ఇంకెప్పుడూ అనని ఒట్టేశాక తన చేతి స్పర్శతో నరేన్ కోతి మూతిని, తోకను ఉపసంహరిస్తాడు శ్రీ రామకృష్ణ గురుదేవులు.

అలా 'విశ్వాసం' ఉండటం ఎంత వరమో, 'విశ్వాసం' లేకపోవటం కూడా ఈశ్వరుడి దారే తనకు చూపిందని స్వామి వివేకానందులు చమత్కరించేవారు. విశ్వాసం లేకపోతే కూడా ఏమీ భయం లేదు. నిత్య కరుణామయుడైన భగవానుడు ముందు ఆ వ్యక్తికి తనపై విశ్వాసం కలిగించి, ఆ పై అతని జీవనాన్ని సుగమం అయ్యేలా చేయగలడు. ఆ విధంగా కూడా 'విశ్వాసం' ఉభయ తారకం, జీవనయానంకు ఒక చక్కని ఆలంబన!

(ఈనాడు అంతర్యామి నవంబర్ 3, 2024)

17
మనిషి శాంతి, అశాంతిలకు నేత్రాలే కీలకం!

'సర్వేంద్రియాణాం నయనం ప్రధానం' అనే సూక్తిని ఎవరు సృజించారో ఎవరికీ తెలియదు. కానీ, అందమైన ప్రపంచాన్ని మనకు చూపించేది మాత్రం నేత్రమే. దీని ప్రాధాన్యాన్ని ఎవరూ తక్కువ చేసి చూపలేరు. నేత్రం మనిషి చేత అనేక మంచి, చెడూ పనులను చేయిస్తుంది. ఈ పనులు మానసికంగానూ ఉండవచ్చు, శారీరకంగానూ ఉండవచ్చు.

కళ్ళు ప్రేమను వర్షించగలవు. నిప్పులు కురిపించగలవు. మనిషిలోని జాలి, దయను, ఆర్ద్రతను బయటికి వ్యక్తపరిచేవి కళ్ళే. అరిషడ్వార్గాలైన కామ, క్రోధ, లోభ, మద, మాత్సర్యాలకు కళ్ళే కారణం.

కళ్ళు జ్ఞ్యానానికి ఎంత దోహద పడతాయో, అజ్ఞ్యానానికి అంతే కారణం అవుతాయి. పురాణకాలంలో ఋషులు కోపంతో చూస్తే చాలు మనుషులు, జంతువులు, ఏవైనా దగ్ధం అయిపోయేవి. మహాభారతంలో కళ్ళ చుట్టూ పరిభ్రమించే పుణ్య, పాప హేతువులైన అనేక వృత్తాంతాలు మనకు గొప్ప సందేశాన్నిస్తాయి.

మహాభారతం అరణ్యపర్వంలో ఘోష యాత్రకు వచ్చిన దుర్యోధనుడికి గంధర్వుడైన చిత్రసేనుడు చేతిలో ఓటమి కలుగుతుంది. ఈ ఓటమి వలన, ధర్మజుడి దయా దాక్షిణ్యంపై చిత్ర సేనుడి బందీ

నుంచీ విముక్తుడు అవటం మూలాన, దాయాది మత్సర్యం రెట్టింపై దుర్యోధనుడిని ఆత్మ హత్యా ప్రయత్నానికి ఉసి గొలుపుతుంది. మయ సభలో ద్రౌపది నవ్వును పరిహాసంగా భావించి కించపడటం, ఉక్రోషాన్ని పెంచుకొని ఆమెను నిండు సభలో దుర్యోధనుడు అవమానించటం– ఇలా సృష్టిలో జరిగే మానావమాన సంఘటనలన్నీ కళ్ళు చిత్ర రూపంలో శాశ్వతంగా చిత్రిస్తాయి. ఇవి మానవ మస్తిష్కంలో భద్రంగా చిర కాలం ఉంటాయి. ఈ ఘటనల తీవ్రతను బట్టి అవంతటవే తరుచూ గుర్తుకు వచ్చి మనిషిని మానసికంగా కుంగదీసి, అధః పాతాళానికి తోస్తాయి. ఒక్కోసారి వాటిని తాత్కాలికంగా అధిగమించినా, మళ్ళీ గుర్తు వచ్చినప్పుడు మనిషిని కంపింప చేస్తాయి. క్షణాల్లో సంభవించే ఇటువంటివి మానవ జీవితంలో కోట్ల సార్లు సంభవిస్తూనే ఉంటాయి.

వీటిని నిరోధించగల శక్తి ఉన్న మనుజుడే జీవితంలో సుఖము, శాంతి, స్థిమితత్వం పొందుతాడని భారతీయ శాస్త్రాలు ఘోషిస్తున్నాయి." కామక్రోదోద్భవం వేగం సయుక్తః స సుఖీనరః" అనే శ్రీమద్భగవద్గీతలోని (5వ అధ్యాయంలోని 23వ శ్లోకం) శ్లోకం, "దుఃఖేష్వనుద్విగ్నమనాః సుఖేషు విగతస్పృహః"? (భగవద్గీత 2వ అధ్యాయం, 56వ శ్లోకం) అనే శ్లోకం ఈ విషయాన్నే సూచిస్తున్నాయి..

ఇది కళ్ళకు, మనస్సుకు, జ్ఞాపకానికి మధ్య ఉన్న అతి క్లిష్టమైన నిర్మాణం. ఇది యోగులకు తప్ప మానసిక శాస్త్రవేత్తలకు అంతు చిక్కని సంక్లిష్ట మానసిక ప్రక్రియ. ఇవి సాధారణ మనుషులకు బాహ్యంగానూ, యోగులకు అంతర్గతంగాను పనిచేస్తాయి. ఇలాంటి భావోద్వేగాలన్నీ కళ్ళున్నవారికే అధికంగా సంభవిస్తాయన్నది మరో శాస్త్రవిజ్ఞాన సత్యం.

అందువలన యోగులు తమ కళ్ళను పవిత్రంగా, గుణ దోష రహితంగా ఉంచుకోడానికి జల నేతి, సూత్ర నేతి వంటి ప్రక్రియలను ఉపయోగిస్తారు. ఈ ప్రక్రియలు సాధారణ మనుషులు గూడా ఆచరించవచ్చు. ఇవి కంటిని పవిత్రంగా ఉంచడమేగాక, చూసే పదార్థం తాలూకు అంతర రహస్యాలను కూడా క్షణాలలో బహిర్గ పరుస్తాయని పతంజలి యోగ సూత్రాలు తెలుపుతున్నాయి. నేత్రాలకు ఏర్పడే ఈ శక్తిని 'గరుడనేత్ర శక్తి' అని పతంజలి వర్ణించారు..

తొలిసారి మనకు ఈ అంతర్గత కంటి శక్తిని నిరూపించింది స్వామి వివేకానంద. ఆయన ఎన్సైక్లోపీడియా లాంటి వేలపేజీలున్న పుస్తకాలను ఒకసారి కంటితో ఆసాంతం పరికించి, ఆ పుస్తక పేజీల్లో ఉన్న విషయం మొత్తం అక్షరం పొల్లుపోకుండా ఒప్ప చెప్పేవాడు. అందువల్ల ఆయన భారతీయ యోగులు విశ్వవిద్యాలయ గ్రంధాలయాల్లాంటి వారని, కదిలే ఎన్సైక్లోపీడియాలని హార్వర్డ్ విశ్వవిద్యాలయ ఉపన్యాసాలలో నొక్కి వక్కాణించారు.

కళ్ళు జీవిత చిత్రణ చేసే కెమెరాల్లాంటివి. మనం చూసిన అందమైన ఘటనలు, దృశ్యాలు శాశ్వతంగా చిత్రించి మన మనస్సుకు, మస్తిష్కానికి ఆనందాన్ని ఇస్తాయి. చూడగూడనివి చూసినపుడు దుఃఖాన్నిస్థాయి. దుఃఖం కోరుకోవటం అవివేకం, అనాగరికం కాబట్టి మనిషెప్పుడూ బాధకలిగించే వాటిని చూడడానికి సంకల్పించరాదు. అందువల్లనే 'చెడు చూడకు'–అన్న నానుడి ప్రచారంలో ఉంది.

మహాభారతంలో గాంధారి తన భర్త ధృతరాష్ట్రుడు చూడని ప్రపంచాన్ని తాను గూడా చూడనని జీవితకాలం కళ్ళకు గంతలు కట్టుకొంది. అందువల్ల ధృతరాష్ట్రుడు, ఆమె దుర్యోధనాదులు లోనైనానంతగా

భావోద్వేగాలకు, రాగ ద్వేషాలకు లోనుకాలేదు. అనుక్షణం మనుషులను భ్రమింప చేసే కళ్ళను మూసివేయటం వలన కామక్రోధాదులకు, మద, మాత్సర్యాలకు గురవ్వలేదు. ఫలితంగా వాళ్ళ కళ్ళకు పవిత్రత, అసాధారణ శక్తి సమకూరాయి. ఈ కారణంగానే రాయబారానికి వచ్చిన కృష్ణ పరమాత్మ వారివురుకి, భీష్మ, ద్రోణ, కృపాచార్య వంటి వారికి, సభలో ఉన్న సాధు, సంతులకు తన విశ్వరూపం చూపాడు. మిగిలిన వారు మైకంకమ్మి స్పృహకోల్పోయి పడిపోయారు.

అంతేగాదు, మహాభక్తులైన యోగులు, జ్ఞానులు, కవులు తమ కళ్ళు నిత్యం భగవత్ దర్శన కాంక్ష కలిగి ఉండేలా ప్రయత్నిస్తూంటారని మనకు తెలుసు. గీతలో విశ్వరూప సందర్శన యోగం ఈ సత్యాన్నే నిరూపిస్తుంది. 'సుదుర్దర్శమిదం(మ్) రూపం(న్), దృష్టవానసి యన్మమ?.... నిత్యం(న్) దర్శనకాఙ్క్షిణః (11వ అధ్యాయం, 52వ శ్లోకం).

దీనినే పోతన మహాశయుడు మరో రూపంలో చెప్పాడు. 'కంజాక్షునకు గాని కాయమ్ము కాయమే' శ్లోకంలో 'కమలేశు చూడని కన్నులు కన్నులే కనుకుడ్య జాల రంధ్రములు గాక' అని ప్రహ్లాదుడితో హిరణ్య కశిపుడికి చెప్పిస్తాడు. అంటే 'దేవుడు కళ్ళు ఇచ్చింది సత్కార్యాలకు, ఈశ్వర కటాక్షానికి, ఈశ్వర దర్శనానికి' అని.

ఇక్కడ మనకు అర్థం కావలసిన విషయం ఒకటి స్పష్టం. అరిషడ్వార్గాలను వివేక, విచక్షణలతో నిత్యం జయించేవారి కళ్ళకుండే శక్తి వల్లనే లౌకిక, పారమార్థిక జ్ఞానాలు రెండూ వశమవుతాయి. కేవలం కళ్ళున్నంత మాత్రాన ఈశ్వరుడు కనిపించడు. సృష్టి రహస్యాలు వెల్లడి కావు. ముందు వాటికి పవిత్రత, శుద్ధి, శక్తి లభించాలి. అంటే మానవ నేత్రాలు 'జ్ఞాననేత్రాలు'గా మారాలి.

మహాభక్తులుగా జన్మించిన ఎందరో యోగుల నేత్రాలు ఈ

పవిత్రతను కలిగి ఉంటాయి. తుకారాం, సక్కుబాయి, పోతన, అన్నమయ్య, మొల్లమాంబ, వెంగమాంబ, రామదాసు, త్యాగయ్య వీరంతా ఈ నేత్ర శుద్ధీ సాధించిన వారే.

అంతేగాదు. అద్భుత శాస్త్రపరిశోధనలతో సృష్టి రహస్యాలు విప్పిన న్యూటన్, నీల్స్ బొర్, మైఖేల్ ఫెరడే, ఆల్బర్ట్ అయిన్స్టీన్, డార్విన్, రామన్, శ్రీనివాస రామానుజన్, హరగోబింద ఖోరానా, చంద్రశేఖరన్, సుబ్బారావు లాంటి శాస్త్రవేత్తల జీవితాల్లోకి తొంగిచూస్తే వారి కళ్లకున్న జ్ఞాన శక్తి ఇతర సాధారణ పౌరుల జ్ఞాన శక్తికి భిన్నంగా ఉన్న సంగతి తేట తెల్లమవుతుంది. ఇది కేవలం నేత్రాలకు లభించిన పవిత్రత, శుద్ధి వలననే సాధ్యం. ఎవరి కళ్ళు ఈ జ్ఞాన నేత్రాలవుతాయో సుఖం, శాంతి వారికే లభిస్తాయి. ఇతరులు రాగ ద్వేషాలతో జీవితకాలం సంతోష, దుఃఖాలతో జీవించి గతిస్తారు.

మహాభక్తులైన త్యాగరాజు, అన్నమయ్య, రామదాసు తమ కళ్ళను ఈశ్వర దర్శనం కోసమే వినియోగించాలని కోరుకొంటూ అనేక కీర్తనలాలపించారు. కళాకారులు సృజించే శిల్పాల సౌందర్యాలను, చిత్రకారులు చిత్రించే దృశ్యాలను, నటులు అభినయించే పాత్రలను ఈశ్వర విభూతులైన ఈ చిత్ర, నాట్య, నటన శిల్ప కళలన్ని మనిషికి ఆహ్లాదాన్ని, మనస్సుకు శాంతిని కలిగించటానికే వినియోగించారు. ఇవేవీ కళ్ళు లేకుండా సాధ్యం కావుకదా! దీనినే 'నారద భక్తి సూత్రాలు' సాత్వస్మి న్ పర ప్రేమ రూపా' అని, 'యల్లబ్ధ్వా పుమాన్ సిద్ధో భవతి, తృప్తో భవతి, అమృతో భవతి' అని నిర్వచించాయి. ఈ సృష్టిలో ఏవి తానై ఉన్నాడో, ఏవి ఉత్తమమైనవై ఉన్నాయో కృష్ణ పరమాత్మ భగవద్గీతలోని విభూతి యోగంలో చక్కగా వివరించాడు.

ఏక లక్ష్యంతో, ఏకాగ్రతతో కళ్ళను, తద్వారా మనస్సును అరిషడ్వార్గాలవైపు మళ్లించక సాధన చేస్తారో వారికే లక్ష్యం సిద్ధిస్తుంది. అద్భుత జ్ఞానం లభిస్తుంది. తత్ఫలితమే సుఖమూ, శాంతి. అంటే మన సుఖానికి, దుఃఖానికి కారణం మన కళ్ళే. ఆ కళ్ళను సద్వినియోగం చేసుకోవటం లోనే మనకు నిజమైన సుఖం, శాంతి లభిస్తాయి.

18

మాటల పొందు

మనిషి మాటకు అంతులేని శక్తి ఉందంటారు మన పెద్దలు. 'మాట ద్వారా మనిషిని ప్రభావితం చేయవచ్చు'– అని చాలా మంది విశ్వాసం. మనం మాటలు మాట్లాడే తీరును బట్టి మనకు లభించే స్పందన ఉంటుందంటారు ప్రాజ్ఞులు. ఒకరిని తిట్టినా, దూషించినా ఆ వ్యక్తి క్షణంలో ఆవేశానికి లోనయి తిరిగి తిట్టనైనా తిడతాడు. మన మాటలకు మరీ కోపం వస్తే కొట్టడానికైనా సన్నద్ధం అవుతాడు. వెనకటికెవరో ఒక ఊరుకు వెళ్లి 'బాబు ఈ ఊరు మంచిదేనా?' అని ఆ ఊరివాళ్లను అడిగాడట. అందుకు ఆ ఊరివారు 'అయ్యా, నీ నోరు మంచిదైతే ఈ ఉరుకూడా మంచిదే' అని సమాధానం చెప్పి నవ్వుకొంటూ వెళ్లిపోయారుట.

మనిషి మాటలు తియ్యగా తియ్యదనం జాలు వారేలా ఉండాలంటారు. అవి పదిమందిని ఇట్టే ఆకర్షించేలా, కట్టి పడేసేలా, ముగ్ధులను చేసేలా ఉండాలని పెద్దలు చెబుతారు. దీనినే 'పలుకుల పొందు' అని కూడా పండితులు వ్యవహరిస్తుంటారు. తియ్యగా మాట్లాడటం ఒక కళ. అందరికీ ఆ కళ రాదు అంటారు. ఇందుకు అనేక కోణాలున్నాయి.

కొందరి స్వరం బాగుండదు. మాట్లాడే మాటలు బాగున్నా స్వరం బాగా లేకపోతే వినేవాడి చెవులో వేడి వేడి సీసం పోసినంత బాధ కలుగుతుంది. కానీ, భగవంతుడు ఇచ్చిన స్వరానికి ఎవరేమి చేయగలడని

టక్కున జావాబివ్వవచ్చు. అది సరి కాదని మరో వాదన కూడా వినిపిస్తుంది. మన స్వరం ఎలా ఉన్నా మాటలు ఏర్చి కూర్చి, ఉన్నంతలో ఏ స్థాయిలో తాను మధురంగా చెప్పగలరో తనకు తానే ఒకటికి రెండు సార్లు పరిశీలించుకుని ప్రయత్నిస్తే బాగానే చెప్పగలరు. అప్పుడు అది మంచి ఫలితం ఇవ్వవచ్చు అని కొందరి పెద్దల అభిప్రాయం. నిజమే, మనిషి 'ప్రయత్నసాధనం' అనేది ఒకటి ఉందని మరిచిపోకూడదు. 'సాధనమున పనులు సమకూరు ధరలోన విశ్వదాభిరామ వినురవేమా ' అన్నది అటు ఆధ్యాత్మికానికానికి, ఇటు ఇహానికి కూడా మంచి సూచననే.

తమది మరీ ఘోరమైన స్వరం అని అనుకునేవాళ్లు చిన్న చిన్న యోగ ప్రక్రియల ద్వారా మధుర స్వరాన్ని పొందవచ్చు. ఇంకా నాటక రంగ నిపుణులను సంప్రదిస్తే చక్కని 'స్వరీకరణ' (మాడ్యులేషన్) కూడా నేర్పించగలరు. ఏది ఎట్లున్నా, మన మాటలెంత పొందుగా ఏర్చి కూర్చినా స్వరం బాగాలేకపోతే ఇబ్బందులు, గొడవలు తప్పవు అని అనుభవసారం చెబుతుంది. ఉదాహరణకు మనకంటే పెద్దలముందు, పై అధికారులముందు స్వరం పెంచి, దూకుడుగా, వేగంగా, ఆవేశంగా మాట్లాడకూడదు. అది దౌర్జన్యోల్లంఘన, కుసంస్కారం అవుతుంది. మన 'మాటల పొందు' బాగున్నా ఈ విధంగా మాట్లాడటం చేటు తెస్తుంది.

భగవద్గీత 'యోగః కర్మసు కౌశలం' అనే విధి విధానాన్ని బోధించింది. 'అనుద్వేగ కరం వాక్యం' (17వ అధ్యాయం, 15వ శ్లోకం) అని మాట్లాడే మాట లక్షణం కూడా నిర్వచిస్తుంది భగవద్గీత. ఈ రెండూ మనిషి ఉన్నత స్థాయిలకు ఎదగటానికి, ఆత్మ ఉద్ధానాన్ని సూచించే మార్గాలని గీత చెబుతుంది. అంటే మృదుభాషణులు, ఎదుటివారిని యిట్టె కట్టిపడేసే శక్తి గలవారు యోగ సాధకుల్లాంటి ఉన్నతస్థాయి వారై

ఉంటారు. నిజానికి మహాత్ములలో ఈ శక్తి సహజంగానే ఉంటుంది. శ్రీ రామకృష్ణులైనా, స్వామి వివేకానందంలాంటి వారైనా, మహాత్మా గాంధీ అయినా, మరే నాయకుడైనా తమ మాటలతో ప్రజలను సులువుగా ఆకర్షించగలగ డానికి కారణం ఇదే. వారి జీవన సంస్కారంలోనే వారి ఆత్మ పరిణతి స్థాయి అంతర్లీనంగా స్పష్టంగా కనిపిస్తుంది. 'మాటల పొందే కాదు' ఆ మాటలు సత్యం, ప్రియం,హితం కూడా అయి ఉండాలి అని గీత చెబుతుంది. ఇక్కడ మాటలకు తోడు అణుకువ కూడా అవసరం అని చెబుతుంది.

ఇక్కడ వారి మాటలు మహా మహిమాన్వితమై ప్రభావశీలమై ఉంటాయి. అన్నమయ్య, రామదాసు, త్యాగరాజు వంటి వాగ్గేయకారుల వాక్కులు వారి ఆత్మ పరిణతికి నిదర్శనమే గాక, మహా మహిమాన్వితమై ఉంటాయి. వారి పలుకులు బాణాల్లాగ శ్రోతల హృదయాలలో క్షణాల్లో స్థిరపడి శాశ్వతంగా వ్యక్తులలోమార్పు తేగలంత శక్తి కలిగి ఉంటాయి. కొద్దో గొప్పో వారి వారి ఆత్మ పరిణతి స్థాయిని బట్టి ఈ ఘనమైన స్థితి సాధారణ రచయితలకు కూడా ఉంటుంది. లేకపోతే యోగుల్లా కనపడని రచయితల పలుకులు, రాతల్లో గూడా ఎదుటి వారిని ప్రభావం చేసే శక్తి ఎలా ఉంది?

ఈ ప్రజ్ఞ ఈశ్వర విభూతై సమస్త జీవుల్లో ఎదో ఒక రూపంలో ప్రకటితమవుతూనే ఉందనడానికి ఇంతకన్నా నిదర్శనం ఏమి కావాలి. ఇందుకు ఆ యా రచయితలు భగంతుని పట్ల ఈ జన్మలో విశ్వాసం కలిగి ఉండవలె అన్న నియమేమి లేదు. కొందరు నిరీశ్వరవాదులయిన రచయితలు ఇదంతా తమ ప్రజ్ఞగానే భావించవచ్చు. అయినా మూల ప్రతిపాదనలైన మాటల పొందుకు, అనుద్వేగ వాక్య రచనకు, పరిణతి పొందిన ఆత్మ స్థాయికి అనుగుణంగానే ఆ ప్రజ్ఞ ఉంటుందన్నది తోసి పుచ్చలేని నిజం.

ఇందుకు భిన్నంగా ఉంటుంది దుష్ట స్వభావుల మాటలు. వారి మాటలు ఎదుటివారిని బాధిస్తాయి. జన్మ జన్మలనుంచి వేధిస్తున్నట్లుంటాయి. మహాభారతంలో ధృతరాష్ట్రుడు తనకు మనః శాంతి కలిగేలా మాటలు చెప్పమని విదురుడిని కోరుతాడు. అప్పుడు విదురుడు ఆయన పుత్రులు పాండవులపట్ల మాట్లాడిన దుష్టమాటలగురించి చెబుతూ ఇలా అంటాడు: తనువున విరిగిన యలుగుల ననువున బుచ్చంగవచ్చు, నతి నిష్ఠురతన్ మనమున నాటిన మాటలు విను మెన్ని యుపాయములను వెడలునె యధిపా! ౹అంటూ మనసులో నాటిన దుష్టమాటలు అంత సులువుగా మనుషులు మరిచిపోరని, ఆ మాటలు పాండవులను నేటికీ వేధిస్తూనే ఉన్నాయని చెబుతాడు.

అందుకే గీతలో కృష్ణుడు ౹‘సత్యం, ప్రియం, హితం’ సాత్విక మాటల పొందుకు చాలా ముఖ్యం అని నొక్కి వక్కాణించారు. అంతేగాదు. ‘అహింస (బాధించకుండా ఉండటం), సత్యం (అబద్ధం చెప్పకుండటం), అక్రోధం, అపైషునం (ఎదుటివారి దోషాలు ఎంచటం) వంటివి మాటల తియ్యదనం, మధుర భాషణం, శ్రోతల ఆకర్షణకు హేతువవుతాయని మనం గీత నుంచి గ్రహించవచ్చు. ఇవి కేవలం భక్తులకు, సాత్విక జీవనాన్ని కోరుకొనేవారికే పరిమితం అన్న అర్థం కాదు. ఇవి సమాజ హితానికి, సుఖమయ, ప్రశాంత మానవ మనుగడకు కూడా ఎంతో ప్రయోజనకరం అని గ్రహించి, ఆచరించాలి.

డా॥ కొప్పరపు నారాయణమూర్తి